www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 215

సోమవారం | 3-11-2025 | పేజీలు: 14 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా.2:06 చతుర్దశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ.3:06 తదుపరి రేవతి; వర్జ్యం: రా.1:50-3:15; దుర్ముహూర్తం: మ.12:21-1:06, మ.2:37-3:22; అమృతఘడియలు: ఉ.10:41-12:09; రాహుకాలం: ఉ.7:30-9:00; సూర్యోదయం: 6:18; సూర్యాస్తమయం: 5:39 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



షెఫాలీ వర్మ

బంగారు తల్లుల సువర్ణాధ్యాయం

మహిళల వన్డే వరల్డ్‌కప్ విజేతగా భారత జట్టు

దక్షిణాఫ్రికాపై హర్మన్‌ప్రీత్ సేన అద్భుత విజయం.. దీప్తి శర్మ, షెఫాలీ వర్మ ఆల్‌రౌండ్ షో

కీలక వికెట్ తీసిన తెలుగమ్మాయి శ్రీ చరణి

ఓ స్వప్నం సాకారమైందన్న కొండంత తృప్తి. అంతకుమించి గుండెల నిండుగా ఉప్పొంగే మాటలకందని ఆనందం! మన మహిళా క్రికెటర్లలో.. మన దేశ కోటాను కోట్ల క్రికెట్ అభిమానుల్లోనూ! భారత మహిళల క్రికెట్ పరంగా మరో చరిత్ర. తొలిసారిగా కపిల్‌సేన కప్పు కొట్టినప్పుడు 1983కు ముందు, తర్వాత అని భారత క్రికెట్‌ను నిర్వచించినట్లుగానే భారత మహిళల జట్టుకు ఇప్పుడిక సరికొత్త అధ్యాయమే. ఆలస్యమైనా భారత అమ్మాయిలు అద్భుతమే చేశారు. ముచ్చటగా మూడో ప్రయత్నంలో ఘన విజయం సాధించారు. వన్డే క్రికెట్‌లో మొట్టమొదటిసారిగా విశ్వవిజేతగా ఆవిర్భవించారు. దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో జరిగిన తుదిపోరులో భారత మహిళల జట్టు 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ.. తన పాత్రకు తగ్గట్టే బ్యాటు, బంతితో అదరగొట్టడం.. చిచ్చరపిడుగు షెఫాలీ బ్యాటుతోనే కాకుండా బంతితోనూ మాయ చేయడం ఈ ఫైనల్లో హైలైట్! టాస్ ఓడినా గత రెండు ఫైనల్స్‌కు భిన్నంగా తొలుత బ్యాటింగ్ చేయడం అద్భుతంగా కలిసొచ్చింది. షెఫాలీ, స్మృతి శతక భాగస్వామ్యంతో విజయానికి ఆదిలోనే గట్టి పునాది పడింది. ఈ పునాదే జట్టు స్కోరును ఏడు వికెట్లకు 298 పరుగుల దాకా తీసుకెళ్లింది. తీవ్ర ఒత్తిడితో కూడుకున్న ఫైనల్లో దక్షిణాఫ్రికా మహిళల ఎదుట ఈ స్కోరు ఎవరెస్టే అయింది. సఫారీ కెప్టెన్ లారా వోల్వార్ట్ సెంచరీ చేసినా ఆ జట్టు పరుగుల వేట 246కే పరిమితమైంది. 11



దీప్తి శర్మ



గెలుపు సంబరాల్లో షెఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన

సాహోరే బాహుబలి

భారత గడ్డపై నుంచి తొలి భారీ ఉపగ్రహం నింగిలోకి

ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం

16.29 నిమిషాల్లోనే కక్ష్యలోకి సీఎంఎస్-03 శాటిలైట్

భారీ ఉపగ్రహ ప్రయోగంతో కొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో

ఎల్వీఎం3 ప్రయోగాల్లో వరుసగా ఎనిమిదో విజయం

చరిత్రలో మైలురాయి: ఇస్రో చైర్మన్ నారాయణన్



నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్వీఎం3-ఎం5 రాకెట్

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత నేలపై నుంచి తొలిసారిగా అత్యంత బరువైన స్వదేశీ ఉపగ్రహం సీఎంఎస్-3ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. భారత నౌకాదళం కోసం ఇస్రో చేపట్టిన భారీ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. 4,410 కిలోల బరువైన మల్టీ బ్రాండ్ కమ్యూనికేషన్ శాటిలైట్ సీఎంఎస్-3తో నింగిలోకి ఎగిరిన ఎల్వీఎం3-ఎం5 'బాహుబలి' రాకెట్ దాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఈ క్రమంలో ఎల్వీఎం3 రాకెట్ ప్రయోగాల్లో ఇస్రో వరుసగా 8వ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) రెండో ప్రయోగ వేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5:26 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిరిన ఎల్వీఎం3-ఎం5 రాకెట్.. తన మూడు

మిగతా 2వ పేజీలో...

గెలుపు సునాయాసం



అయినా ఏమాత్రం అలసత్వం వద్దు

పెయిడ్ సర్వేలతో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు.. వాటిని తిప్పికొట్టండి

కాంగ్రెస్ సర్కారు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని క్షేత్రస్థాయికి వెళ్లి వివరించండి

'జూబ్లీహిల్స్' గెలుపు ప్రభుత్వానికి, మంత్రులకూ కీలకమే

మీ సొంత ఎన్నికలా తీసుకుని పనిచేయండి.. పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిపెట్టండి

ఎవరి పనితీరు ఎలా ఉందన్నది అధిష్ఠానం చూస్తోంది.. మంత్రులతో సీఎం

వంద ఓట్లకొక బూత్ స్థాయి ఏజెంట్‌ను పెట్టాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ప్రచార సమన్వయం కోసం కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సునాయాసమేనని, అయినా సరే ఏమాత్రం అలసత్వం చూపవద్దని మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు, పెయిడ్ సర్వేలను ప్రజల్లోకి తీసుకెళుతోందని, వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని దిశానిర్దేశం చేశారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలని.. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఓటరు దృష్టికీ తీసుకెళ్లాలని చెప్పారు. ఈ ఎన్నిక ప్రభుత్వానికి, మంత్రులకు కూడా కీలకమేనని స్పష్టం చేశారు. అందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలని, మంచి మెజారిటీతో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి ఒక్కో డివిజన్‌కు ఇద్దరు మంత్రుల చొప్పున బాధ్యతలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో మంత్రులతో విందు సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు కూడా ఇందులో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో డివిజన్లవారీగా ప్రచారం, ఇతర కార్యక్రమాలపై సీఎం సమీక్ష జరిపారు. ఆయా డివిజన్లలో ఇన్‌చార్జి మంత్రుల పనితీరు బాగానే ఉందని, పార్టీ విజయం కూడా సునాయాసమేనని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఉప ఎన్నిక ప్రభుత్వానికి చాలా కీలకమని, మంత్రులంతా సొంత ఎన్నికలా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఎవరి పనితీరు ఎలా ఉందన్నది అధిష్ఠానం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని చెప్పారు. ఉప ఎన్నికలో

మిగతా 13వ పేజీలో...

ఓట్ల వేటకు పార్కుల బాట!

ఉదయం, సాయంత్రం నడక వేళల్లో ఓటర్లను పార్కుల్లో కలిసి ప్రసన్నం చేసుకునేందుకు నేతల ప్లాన్

ఒకేరోజు పార్కుల్లో ప్రచారం చేసిన కిషన్‌రెడ్డి, పొన్నం, మహేశ్‌గౌడ్, బోయినపల్లి వినోద్ కుమార్

500 రోజులు ఆగితే.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం

13 హైడ్రా అరాచకాలకు పాల్పడుతోంది

హైడ్రా బాధితులకు బీఆర్ఎస్‌తోనే న్యాయం: కేటీఆర్

సన్నబియ్యం పథకాన్ని రద్దు చేసే దమ్ముందా?

ముఖ్యమంత్రి రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్

కాంగ్రెస్‌కు ఓటేయకపోతే బెదిరిస్తారా? అని ఆగ్రహం

జోగి రమేశ్ అరెస్టు

నకిలీ మద్యం కేసులో ఏపీ మాజీ మంత్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జోగి తమ్ముడు రామును కూడా..

పత్రాలు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

ఆర్థిక లావాదేవీలపై జోగికి సిట్ ప్రశ్నలు

వైద్య పరీక్షల తర్వాత అర్ధరాత్రి కోర్టుకు..

నకిలీ లిక్కర్ వెనుక రమేశ్ ఉన్నారని అద్దేపల్లి సోదరుల వాంగ్మూలం.. దీంతోనే అరెస్టు



జోగి రమేశ్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే నకిలీ మద్యం తయారీ కేసు ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ మెడకు చుట్టుకుంది. ఆయనతో పాటు ఆయన తమ్ముడు జోగి రామును ఏపీ ఎక్సైజ్, సిట్ పోలీసులు అరెస్టు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఉన్న జోగి ఇంటికి ఎక్సైజ్, సిట్ అధికారుల బృందం ఆదివారం తెల్లవారుఝామున 5.30 గంటలకు వెళ్లింది. ముందుగా ఇంటిని తనిఖీ చేస్తున్నామని సెర్చ్ నోటీసు ఇచ్చారు. పోలీసుల రాకను గమనించిన మాజీ మంత్రి

మిగతా 13వ పేజీలో...

అద్దెకు వైద్య పట్టాలు

డాక్టర్ జేబులో కాసులు.. 'యాక్టర్' చేతిలో రోగులు

ప్రైవేటు ఆస్పత్రులకు సర్టిఫికెట్లు కిరాయికిస్తున్న వైద్యులు

వాటితో అనుమతులు, దవాఖానాల నిర్వహణ

అసలైన వైద్యుడి స్థానంలో రోగులకు మరొకరి సేవలు

వాళ్లలో ఎంబీబీఎస్ చదవని వారు, అనర్హులు కూడా..

ప్రజల ప్రాణాలతో చెలగాటం

పట్టించుకోని వైద్యశాఖ అధికార్లు



హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చర్మ సంబంధ వ్యాధులకు సంబంధించి గచ్చిబౌలిలో ప్రైవేటు క్లినిక్ ఏర్పాటు చేసేందుకు ఓ డెర్మటాలజిస్టు పేరిట వైద్య, ఆరోగ్య శాఖకు దరఖాస్తు వచ్చింది. ఆ డెర్మటాలజిస్టు విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించిన అధికారులు అనుమతులు జారీ చేయగా.. ఆస్పత్రి కూడా ప్రారంభమైపోయింది. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. ఆ ఆస్పత్రి ఏ వైద్యుడి పేరు మీద ఉందో.. ఆ వైద్యుడు అక్కడ వైద్య సేవలు అందించరు. సరిగ్గా చెప్పాలంటే సదరు డాక్టరు గారు.. ఆ క్లినిక్ గుమ్మం కూడా తొక్కరు. ఎందుకంటే సదరు వైద్యుడు తన సర్టిఫికెట్లను

మిగతా 14వ పేజీలో...

మోదీని ఆడిస్తున్న వ్యాపారులు



బెగుసరాయ్‌లో మత్స్యకారులతో కలిసి చేపలు పడుతున్న రాహుల్

అంబానీ, అదానీల చేతిలో రిమోట్ కంట్రోల్

చిన్న వ్యాపారులను నాశనం చేసి బడా వ్యాపారవేత్తలకు మేలు చేయడమే మోదీ లక్ష్యం

దానిలో భాగంగానే జీఎస్టీ, నోట్ల రద్దు

బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ

చెరువులో దిగి చేపలు పట్టిన ప్రతిపక్ష నేత

18న సీఎంగా ప్రమాణం చేస్తున్నా: తేజస్వి

బెగూసరాయ్/ఖగారియా/ఢిల్లీ, నవంబరు 2: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటే భయపడటమే కాకుండా పెద్ద వ్యాపారవేత్తలు ఆడించినట్లల్లా ఆడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బిహార్‌లోని బెగూసరాయ్, ఖగారియా జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ మాట్లాడుతూ 'మహాత్మాగాంధీ నాటి శక్తిమంతులైన బ్రిటీష్‌వారిని

మిగతా 2వ పేజీలో...

పాక్‌పై బాంబులేస్తే.. కాంగ్రెస్ 'రాచకుటుంబానికి' నిద్ర లేదు: మోదీ 2

పట్నాలో భారీ రోడ్‌షో



మంటల్లో కాలిపోతున్న ఫర్నిచర్, ఇతర సామగ్రి

బీఆర్ఎస్ X కాంగ్రెస్

మణుగూరులో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుపై కాంగ్రెస్ శ్రేణుల దాడి.. ఫర్నిచర్ ధ్వంసం

గతంలో అది తమ ఆఫీసేనని.. బీఆర్ఎస్ హయాంలో ఆక్రమించారని ఆరోపణ

'ఇందిరమ్మ భవనం' అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు

పట్టణంలో పోలీసుల మోహరింపు

ముమ్మాటికి అది కాంగ్రెస్ కార్యాలయమే: స్థల దాత వారసుడు హరిబాబు

మణుగూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ కార్యాలయాన్ని గతంలో బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుపై దాడి చేసి ఫర్నిచర్, ఇతర వస్తువులను తగులబెట్టాయి. భవనంపై ఉన్న గులాబీ రంగును, బీఆర్ఎస్ జెండాను

మిగతా 3వ పేజీలో...

నేటి నుంచి ప్రైవేటు కాలేజీలు బంద్

బకాయిలపై సీఎంవో అధికారులతో చర్చలు విఫలం

150 కోట్లు ఇస్తామన్నా అంగీకరించని యాజమాన్యాలు

రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి 1,840 ఉన్నత విద్యాసంస్థలు

జేఎన్‌టీయూ ఫార్మసీ సెమిస్టర్, ఇంజనీరింగ్ ఇంటర్నల్, బీఈడీ పరీక్షలు వాయిదా 12

భార్యపై అనుమానంతో..

కూతురు, వదినతో పాటు ఆమెనూ చంపి తాను ఆత్మహత్య 3

నిద్రిస్తున్న వారిపై కత్తితో ఘాతుకం

తప్పించుకుని బయటపడ్డ పెద్ద కూతురు

వికారాబాద్ జిల్లా కులకచర్లలో ఘటన

హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

జలమయమైన ప్రధాన రహదారులు 14

పలు చోట్ల ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు

మరో రెండ్రోజులు మోస్తరు, భారీ వర్షాలు

రోడ్డు ప్రమాదాలకు ఇకపై కాంట్రాక్టర్‌కు జరిమానా!

'బీవోటీ' హైవేల పరిధిలో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ జరిగితే 25 లక్షలు 2

తర్వాతి ఏడాదీ పునరావృతమైతే 50 లక్షలు

కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయం




గల్ఫ్‌లో శివనామస్మరణ

ఒమాన్‌లో వైభవంగా సహస్ర లింగార్చన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఎక్కడో అరేబియా సముద్ర తీరాన ఉన్న గల్ఫ్ దేశం ఒమాన్.. కార్తీక మాస ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శివనామస్మరణతో మార్మోగిపోయింది. ఒమాన్‌లోని తెలుగు ప్రవాసీయులు, చిరు మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మస్కట్ శివారులో శుక్రవారం సహస్ర లింగార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక వేద పండితులు ధర్మపురి విజయకుమార్ ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన 1,115 శివ లింగాలకు ఈ కార్యక్రమంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఒమాన్, పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసీయులతో పాటు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ అనంత లక్ష్మి, సికింద్రాబాద్ మహంకాళీ డివిజన్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ సైదయ్య ఈ సహస్ర లింగార్చనలో పాల్గొన్నారు. భారతీయ పండుగలు, సంస్కృతి విదేశీ గడ్డపై భారతీయులను ఐక్యం చేసేందుకు ఉపకరిస్తున్నాయని ఒమన్‌లో భారత రాయబారి జీవీ శ్రీనివాస్ అన్నారు. ఒమాన్‌లో జరిగిన ఈ సహస్ర లింగార్చనలో పాల్గొన్న ప్రవాసీయులను చూస్తే తనకు సికింద్రాబాద్ మహంకాళి దేవస్థానంలో జరిగే బోనాల పండుగ గుర్తుకు వచ్చిందని సైదయ్య అన్నారు.

మెక్సికోలోని సూపర్ మార్కెట్‌లో భారీ పేలుడు

» 23 మంది మృతి, పలువురికి గాయాలు

మెక్సికో సిటీ, నవంబరు 2: మెక్సికోలోని ఓ సూపర్‌మార్కెట్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో కనీసం 23 మంది ప్రాణాలు కోల్పోగా, 12 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. శనివారం హెర్మోసిల్లో నగరంలోని వాల్డోస్ అనే సూపర్‌మార్కెట్లో ఈ ఘటన జరిగింది. తమకు అందిన ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం పేలుళ్ల ద్వారా విడుదలైన విషపూరిత వాయువులను పీల్చుకొని ఎక్కువ మంది మృతి చెందారని రాష్ట్ర అటార్నీ జనరల్ తెలిపారు. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

తేనె ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ దూకుడు

న్యూఢిల్లీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత్ 'తీపి విప్లవం' సృష్టిస్తోంది. తేనె ఉత్పత్తి, ఎగుమతుల్లో వేగంగా ముందుకుసాగుతోంది. కేంద్రం ప్రారంభించిన నేషనల్ బీకీపింగ్- హనీ మిషన్ (ఎన్బీహెచ్ఎం) అనూహ్య ఫలితాలనిస్తోంది. 'ఆత్మనిర్భర్ భారత్' అభియాన్‌లో భాగంగా ప్రవేశపెట్టిన ఈ పథకంతో భారత్ నాలుగేళ్లలోనే ప్రపంచ తేనె ఎగుమతుల్లో 9వ స్థానం నుంచి రెండోస్థానానికి ఎగబాకడం గమనార్హం. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి అంకురార్పణ జరగ్గా.. 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు తేనె ఎగుమతుల్లో ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక దేశంలో 2024 సంవత్సరంలో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల సహజ తేనె ఉత్పత్తి కాగా 1.07 లక్షల మెట్రిక్ టన్నుల తేనె ఎగుమతి అయింది.

భారత్‌లో పెరుగుతున్న అంటువ్యాధులు

న్యూఢిల్లీ, నవంబరు 2: భారత్‌లో అంటువ్యాధుల వ్యాప్తి క్రమంగా పెరుగుతోంది. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంటువ్యాధుల వ్యాప్తి 10.7 శాతంగా నమోదవగా.. రెండో త్రైమాసికంలో ఇది 11.5 శాతానికి పెరిగింది. ఐసీఎంఆర్ అధ్యయనంలో భాగంగా దేశవ్యాప్తంగా పరీక్షించిన ప్రతి 9 మందిలో ఒకరిలో సంక్రమిత వ్యాధికారకాలు ఉన్నట్టు తేలింది. ఐసీఎంఆర్ నెట్‌వర్క్ కింద ఉన్న ల్యాబ్‌ల్లో 4.5 లక్షల మందిని పరీక్షించగా 11.1 శాతం మందిలో వ్యాధికారక సూక్ష్మజీవులు ఉన్నట్టు కనుగొన్నారు. అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ (ఏఆర్ఐ) కేసుల్లో ఇన్‌ఫ్లుయెంజా-ఏ, తీవ్రమైన జ్వరం, రక్తస్రావం కేసుల్లో డెంగీ వైరస్, కామెర్ల కేసుల్లో హెపటైటిస్-ఏ, డయేరియా కేసుల్లో నోరోవైరస్, అక్యూట్ ఎన్సెఫాలిటిస్ సిండ్రోమ్ (ఏఈఎస్) కేసుల్లో హెర్పస్ సింప్లెక్స్ వైరస్ (హెచ్ఎస్వీ)లను టాప్-5 వ్యాధికారకాలుగా గుర్తించారు.

మరో రెండు ఐఏఎస్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్లపై సీసీపీఏ కొరడా.. రూ.8లక్షల చొప్పున ఫైన్

న్యూఢిల్లీ, నవంబరు 2: తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న మరో రెండు ఐఏఎస్ కోచింగ్ సెంటర్లపై కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) కొరడా ఝుళిపించింది. తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసినందుకు సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్స్ అయిన దీక్షంత్ ఐఏఎస్, అభిమను ఐఏఎస్‌లకు సీసీపీఏ రూ.8 లక్షల చొప్పున జరిమానా విధించింది. తమ అనుమతి లేకుండా తమ పేర్లతో పాటు ఫొటోలను ఈ ఇన్‌స్టిట్యూట్లు వాడినట్టు యూపీఎస్సీలో విజయం సాధించిన అభ్యర్థులు చేసిన ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేపట్టిన సీసీపీఏ చర్యలకు ఉపక్రమించింది. ఎక్కువ మంది ఎంపికైనట్టుగా చూపడానికి యూపీఎస్సీలో విజయం సాధించిన అభ్యర్థుల ఫొటోలు, పేర్లను వాడి చాలా మంది టాపర్లు తమ విద్యార్థులేనన్న అభిప్రాయం కలిగేలా ఈ ఇన్‌స్టిట్యూట్లు ప్రచారం చేసుకొన్నాయి.

2029 నాటికి డ్రగ్స్ ముఠాల అంతం: అమిత్ షా

పట్నా, నవంబరు 2: భారత్‌ను డ్రగ్స్ రహితంగా మార్చే లక్ష్య సాధనలో భాగంగా 2029 నాటికి మాదకద్రవ్యాల ముఠాలను సమూలంగా అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పక్కా ప్రణాళికతో తమ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి కేంద్రం వరకూ దీన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. గత మూడేళ్లలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు, డీలర్లను అరెస్టు చేయడంలో రికార్డు బద్దలు కొట్టామన్నారు. ఇప్పుడు డ్రగ్స్ వ్యాపారానికి బదులు ఈ ముఠాల ఆట కట్టించాల్సిన సమయం ఆసన్నమైందని, తద్వారా ఈ నెట్‌వర్క్ శాశ్వతంగా నాశనం అవుతుందని వివరించారు.

రాజస్థాన్‌లో మరో బస్సు ప్రమాదం
18 మంది దుర్మరణం

జైపూర్/పుణె/ఠాణె, నవంబరు 2: ఏసీ బస్సు దగ్ధమైన సంఘటన మరవక ముందే రాజస్థాన్‌లో ఆదివారం మరో బస్సు ప్రమాదం సంభవించింది. నిలిపి ఉన్న ట్రయిలర్‌ను బస్సు ఢీకొనడంతో 18 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రాజధాని జైపూర్‌కు 400 కి.మీ.దూరంలోని ఫాలోడి జిల్లాలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పర్యాటక కేంద్రమైన జోధ్‌పూర్ జిల్లాలోని సుర్‌సాగర్, బికనేర్ జిల్లాలోని పుణ్యక్షేత్రమైన కోలాయత్‌లను సందర్శించుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం భజన్‌లాల్ శర్మ తెలిపారు. ఈ బస్సు ప్రమాదం పట్ల ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తపరిచారు. పీఎం సహాయనిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గత నెలలో జైసల్మేర్ జిల్లాలో ఏసీ బస్సులో మంటలు వ్యాపించడంతో 26 మంది మరణించారు. అప్పటి నుంచి అధికారులు బస్సులను తనిఖీలు చేస్తున్నప్పటికీ ప్రమాదం జరగడం గమనార్హం. మరోవైపు, మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం వేకువజామున అతి వేగంగా వెళ్తున్న కారు మెట్రో పిల్లర్‌ను ఢీకొనడంతో ముగ్గురు మరణించారు. మద్యం సేవించి కారును నడపడమే ఈ ప్రమాదం కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. థానేలో మోటారు సైకిల్‌ను ఓ లారీ ఢీకొనడంతో రెండున్నర ఏళ్ల బాలుడు సంఘటన స్థలంలోనే మరణించాడు.

సాహోరే బాహుబలి


నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్వీఎం3-ఎం5

(మొదటి పేజీ తరువాయి)

దశలను సునాయాసంగా పూర్తి చేసుకుని 4,410 కిలోల బరువైన సీఎంఎస్-3 ఉపగ్రహాన్ని 16.29 నిమిషాల్లోనే నిర్ణీత కక్ష్యలో విడిచిపెట్టింది. ఆ వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ సహచర శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఎల్వీఎం3-ఎం5 రాకెట్ విజయవంతమైందని ప్రకటించారు.

వచ్చే ఐదు నెలల్లో ఏడు ప్రయోగాలు

ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం దేశానికే గర్వకారణమని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ అన్నారు. ఈ విజయం ఇస్రో చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. సీఎంఎస్-03 విజయానంతరం ఆయన మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ.. 'కక్ష్యలోకి విజయవంతంగా చేరిన ఉపగ్రహం స్థిరంగా ఉన్నట్లు బెంగుళూరులోని హసన్ మాస్టర్ కంట్రోల్ సెంటర్ గ్రౌండ్ స్టేషన్‌కు సిగ్నల్ అందాయి. ఇది ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన కమ్యూనికేషన్ ఉపగ్రహం. దీని బరువు 4,410 కిలోలు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించింది' అని తెలిపారు. వచ్చే ఐదు నెలల్లో ఏడు ప్రయోగాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచించామని తెలిపారు. డిసెంబరు తొలివారంలో ఎల్వీఎం3-ఎ06 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూబర్డ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని, డిసెంబరు చివరిలో పీఎస్ఎల్వీ-సీ62 ద్వారా ఈవోఎస్-05 ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం ఉంటుందన్నారు. పీఎస్ఎల్వీ-ఎల్1, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ ప్రయోగ పనులు కూడా జరుగుతున్నాయన్నారు.

భారత్ పంపిన భారీ శాటిలైట్లు ఇవే..

శాటిలైట్	బరువు (కేజీల్లో)
సీఎంఎస్03	4,410
చంద్రయాన్-2	3,877
జీశాట్-29	3,423
జీశాట్-19	3,136
ఫ్రెంచ్ గయానా నుంచి పంపినవి..	
జీశాట్-11	5,854
జీశాట్-24	4,180
జీశాట్-17	3,477

భారత్ నుంచి ఇదే తొలిసారి

ఇస్రో గతంలో కూడా ఇంతటి భారీ ఉపగ్రహాలను ప్రయోగించింది. కానీ.. అవన్నీ ఫ్రెంచ్ గయానా నుంచి ఫ్రాన్స్‌కు చెందిన ఏరియన్ స్పేస్ అందించిన రాకెట్ల ద్వారా ప్రయోగించినవే. 2018 డిసెంబరు 18న ఫ్రెంచ్ గయానా నుంచి 5,854 కిలోల బరువున్న కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-11ను ఇస్రో ప్రయోగించింది. భారత భూభాగం నుంచి జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లో ప్రవేశపెట్టిన తొలి భారీ ఉపగ్రహం సీఎంఎస్-03 కావడం విశేషం.

ప్రధాని, ఉపరాష్ట్రపతి అభినందనలు

భారత గడ్డపై నుంచి తొలిసారిగా అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రోను ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అభినందించారు. 'మన శాస్త్రవేత్తల కృషితో అంతరిక్ష రంగం అద్భుతమైన ఆవిష్కరణలకు పర్యాయపదంగా మారడం ప్రశంసనీయం. ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు జాతీయ పురోగతిని పెంచాయి' అని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇస్రో, భారత నావికా దళానికి అభినందనలు. ఈ విజయం ఆత్మనిర్భర్ భారత్‌లో మరో గర్వించదగిన మైలురాయికి చిహ్నం' అని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు.

జీశాట్-7 సిరీస్.. నిఘాకు, రక్షణకు..

భారత్ రక్షణపరంగా, నిఘా కోసం, సరిహద్దుల వెంట, సముద్రంలో పరిస్థితుల సమాచారం, కమ్యూనికేషన్ కోసం ప్రత్యేకంగా జీశాట్-7 సిరీస్ ఉపగ్రహాలు ప్రయోగిస్తోంది. అందులో మొదటిది జీశాట్-7. 2,625 కిలోల ఆ ఉపగ్రహాన్ని 2013లో ఫ్రెంచ్ గయానా నుంచి అంతరిక్షంలోకి పంపారు. నౌకాదళం కోసం ప్రత్యేకించిన ఉపగ్రహం. దాని కాలపరిమితి ముగింపునకు రావడంతో.. ఆ స్థానంలో ఆధునికమైన, సమర్థవంతమైన సీఎంఎస్03 (జీశాట్-7ఆర్) ఉపగ్రహాన్ని ఇప్పుడు ప్రయోగించారు. ఇక వైమానిక దళం, సైన్యం కోసం ప్రత్యేకించిన జీశాట్-7ఏను 2018లో ప్రయోగించారు. దాని స్థానంలో ఆర్మీ కోసం మరింత మెరుగైన ఉపగ్రహం జీశాట్-7బీని అభివృద్ధి చేస్తున్నారు.

సీ25 క్రయోజనిక్ దశపై కొత్త ప్రయోగం

ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌కు సంబంధించిన సీ25 క్రయోజనిక్ దశపై కొత్త ప్రయోగం నిర్వహించామని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. "దేశీయంగా అభివృద్ధి చేసిన సీ25 క్రయోజనిక్ దశను.. రాకెట్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చిన తర్వాత మరోసారి మండించాం. అది విజయవంతమైంది. ఇదొక గొప్ప ప్రయోగం. భవిష్యత్తులో క్రయోజనిక్ దశను పునఃప్రారంభించడానికి అవసరమైన డేటాను అందిస్తుంది. ఎల్వీఎం3 రాకెట్‌ను ఉపయోగించి బహుళ ఉపగ్రహాలను వివిధ కక్ష్యల్లోకి ప్రవేశపెట్టేందుకు అవకాశం కల్పిస్తుంది' అని నారాయణన్ తెలిపారు.

ఎల్‌వీఎం-3.. గగనయానం

సీఎంఎస్03 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన ఎల్‌వీఎం-3(లాంచ్ వెహికల్ మార్క్-3) రాకెట్‌ను భారత 'బాహుబలి'గా పిలుస్తారు. జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్‌కు పలు మార్పులు చేసి దీనిని అభివృద్ధి చేశారు. దీని బరువు 640 టన్నులు, ఎత్తు 43.5 మీటర్లు. మూడు దశల ఇంధనంతో అంతరిక్షంలోకి దూసుకెళుతుంది. చివరి దశలో భారత్ అభివృద్ధి చేసిన 'సీఈ-20' క్రయోజనిక్ ఇంజన్‌ను అమర్చారు. భూసమీప కక్ష్య (ఎల్ఈవో)లోకి పది వేల కిలోల పేలోడ్‌ను, జీటీవో కక్ష్యలోకి 4,500 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. సమీప భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న చంద్రయాన్, గగన్‌యాన్ ప్రయోగాలన్నీ ఎల్‌వీఎం-3తోనే జరగనున్నాయి. ఇక ఎల్‌వీఎంను మరింత అభివృద్ధి చేసి 'నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జీఎల్‌వీ)'ని రూపొందించేందుకు ఇస్రో ప్రయత్నిస్తోంది. ఎనిమిది టన్నుల బరువైన పేలోడ్లను జీటీవో (జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్) కక్ష్యలోకి చేర్చేలా దానిని అభివృద్ధి చేయనున్నారు.

సీఎంఎస్03.. సురక్షిత తీరం

భారత సముద్ర తీరం నుంచి సుమారు 3,500 కిలోమీటర్ల దూరం వరకు మన నౌకా దళానికి అవసరమైన సేవలను సీఎంఎస్03 ఉపగ్రహం అందిస్తుంది. దీనిలో యూహెచ్ఎఫ్, ఎస్, సీ, కేయూ బ్యాండ్ రాడార్లను అమర్చారు. దీని సాయంతో తీర ప్రాంతమంతటా నిఘా పెట్టడంతోపాటు ఒకే సమయంలో అత్యంత వేగంగా వివిధ రకాల కమ్యూనికేషన్లకు వీలు కల్పిస్తుంది. సముద్రంలో ఉన్న యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, సముద్రంపై ఎగురుతున్న యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల నుంచి.. నౌకాదళ ప్రధాన కార్యాలయానికి ఎప్పటికప్పుడు డేటాను అందిస్తుంది. అది కూడా మధ్యలో గుర్తించలేని విధంగా, హ్యాక్ చేయలేని విధంగా డేటాను, కాల్స్‌ను ఎన్‌క్రిప్ట్ చేసి, సురక్షితమైన కమ్యూనికేషన్‌ను అందిస్తుంది. ఈ ఉపగ్రహం నుంచి నౌకాదళానికి చేరే సమాచారాన్ని, కాల్స్‌ను, సిగ్నల్స్‌ను మధ్యలో ఎవరూ జామ్ చేయకుండా ప్రత్యేకమైన సాంకేతికతను వినియోగించారు.

లోకం తీరు



రోడ్డు ప్రమాదాలకు కాంట్రాక్టర్‌పై జరిమానా!

'బీవోటీ' హైవేల నిర్దిష్ట పరిధిలో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ జరిగితే 25 లక్షలు

తర్వాతి ఏడాదీ పునరావృతమైతే 50 లక్షలు

న్యూఢిల్లీ, నవంబరు 2: రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బీవోటీ (నిర్మాణం-నిర్వహణ-బదిలీ) పద్ధతిలో నిర్మించిన జాతీయ రహదారుల నిర్దిష్ట పరిధిలో (500 మీటర్లు) ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్లపై రూ.25 లక్షల జరిమానా విధించనున్నట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ బీవోటీ డాక్యుమెంట్‌ను సవరించిందని రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్ తెలిపారు. కాంట్రాక్టర్లు రోడ్డు ప్రమాదాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక ఏడాదిలో హైవేలోని నిర్దిష్ట పరిధిలో ఒకటి కంటే ఎక్కువసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగితే సదరు కాంట్రాక్టర్ రూ.25 లక్షలు జరిమానాగా చెల్లించాలని, తర్వాతి ఏడాది కూడా ప్రమాదాలు పునరావృతమైతే ఫైన్ రూ.50 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. హైవేల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 3,500 రోడ్డు ప్రమాదాల స్ట్రెచ్‌లను గుర్తించిందన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఆస్పత్రుల్లో నగదు రహితంగా చికిత్స అందించే పథకాన్ని ప్రభుత్వం త్వరలోనే ప్రారంభించనుందని ఉమాశంకర్ చెప్పారు. కాగా, హైవేల నిర్మాణాలను ప్రధానంగా బీవోటీతో పాటు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం), ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) పద్ధతుల్లో చేపడుతారు. నిర్వహణతో సహా ప్రాజెక్టులకు రాయితీ కాలం బీవోటీ మోడల్‌లో 15-20 సంవత్సరాలు ఉండగా, హెచ్ఏఎంలో 15 ఏళ్లు ఉంటుంది.


బెగుసరాయ్‌లో మత్స్యకారులతో రాహుల్ గాంధీ

మోదీని ఆడిస్తున్న పెద్ద వ్యాపారులు

(మొదటి పేజీ తరువాయి)

ఎదిరించారు. మరోవైపు 56 అంగుళాల ఛాతీ ఉన్న మన మోదీ ఆపరేషన్ సిందూర్ సమయంలో ట్రంప్ ఫోన్ చేయగానే భయపడిపోయి పాకిస్థాన్‌పై యుద్ధాన్ని ఆపేశారు. అంబానీ, అదానీ రిమోట్ కంట్రోల్ ద్వారా మోదీని ఆడిస్తున్నారు. చిన్న వ్యాపారవేత్తలను నాశనం చేసి, పెద్ద వ్యాపారవేత్తలకు మేలు చేసే లక్ష్యంతోనే మోదీ ప్రభుత్వం జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు తదితర ప్రధాన నిర్ణయాలన్నీ తీసుకుంది' అని ఆరోపించారు. కాగా, గత 20 ఏళ్లుగా బిహార్ యువత అవకాశాలను, కలలనూ బీజేపీ, జేడీయూ దూరం చేశాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. బిహార్ ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించాల్సిన సమయం ఆసన్నమైందని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. పారిశ్రామిక రంగంలో ఉపాధి విషయంలో దేశంలోనే 23వ స్థానంలో బిహార్ ఉందని ఖర్గే తెలిపారు. బిహార్‌లోని 10 శాఖల్లో జరిగిన రూ.70 వేల కోట్ల కుంభకోణాలను కాగ్ వెలుగులోకి తెచ్చిందని, దీన్ని అచ్ఛేదిన్‌కు సంకేతంగా భావించాలా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. కాగా, బెగూసరాయ్‌లో ఎన్నికల ప్రచారం అనంతరం రాహుల్ గాంధీ మత్స్యకారులతో కలిసి పడవలో చెరువు మధ్యలోకి వెళ్లి చేపలు పట్టారు. అనంతరం నీటిలోకి దిగి కూడా భారీ వలతో చేపల వేట కొనసాగించారు. ఈత కూడా కొట్టారు. ఆయన వెంట ఇండియా కూటమి ఉపముఖ్యమంత్రి అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు.

తమిళనాట 'సర్' పనులు ఆపకుంటే ఈసీపై సుప్రీం కోర్టులో పిటిషన్!

చెన్నై, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఆపకపోతే సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేయాలని డీఎంకే నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. ఈ నెల నాలుగు నుంచి కేంద్ర ఎన్నికల సంఘం తమిళనాడు సహా 12 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో స్థానిక టి.నగర్‌లో డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. డీఎంకే మిత్రపక్షాలతో సహా 46 తమిళ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, బీజేపీ ప్రతినిధులను ఆహ్వానించలేదు. విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగంను ఆహ్వానించినా ఆ పార్టీ తరఫున ప్రతినిధులెవరూ ఈ సమావేశానికి హాజరుకాలేదు. పీఎంకే, డీఎండీకే పార్టీలు ఈ సమావేశాన్ని బహిష్కరించాయి. సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలకులకు సానుకూలంగా ఈసీ సర్ పేరుతో ఓట్ల చోరీలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

'ఆపరేషన్ సిందూర్' నుంచి వారింకా తేరుకోలేదు

పాక్‌పై బాంబులు వేస్తే కాంగ్రెస్ రాచకుటుంబానికి నిద్ర లేదు

» బిహార్ మహాగఠ్‌బంధన్‌లో తీవ్ర విభేదాలు

» వారి మేనిఫెస్టో అబద్ధాల పుట్ట: ప్రధాని


పట్నాలోని రోడ్ షోలో మోదీ

అర్రా/పట్నా, నవంబరు 2: పాకిస్థాన్‌లో పేలుళ్లు సంభవిస్తే కాంగ్రెస్ 'రాచకుటుంబా'నికి నిద్ర దూరమైందని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. 'ఆపరేషన్ సిందూర్' నుంచి పాక్‌తోపాటు కాంగ్రెస్‌లోని పేరు గొప్ప నాయకులు ఇంకా తేరుకోలేదని ఎద్దేవా చేశారు. బిహార్లో ఇండీ కూటమి పార్టీలతో కూడిన మహాగఠ్‌బంధన్‌లో తీవ్ర విభేదాలు ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన అర్రాలో జరిగిన సభలో మాట్లాడారు. పట్నాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఆయా సందర్భాల్లో మాట్లాడుతూ.. వికసిత్ భారత్ కోసం ఎన్డీఏ పార్టీలన్నీ కలిసికట్టుగా పనిచేస్తుంటే.. కాంగ్రెస్, ఆర్జేడీ మాత్రం పరస్పరం కొట్లాడుకుంటున్నాయని అన్నారు. 'ఓ అంతర్గత సమాచారం చెబుతున్నాను. నామినేషన్ల దాఖలుకు ముందు రోజు ఈ పార్టీలు నాలుగ్గోడల మధ్య సమావేశమయ్యాయి. ఆర్జేడీ నుంచి సీఎం అభ్యర్థి ఉండడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. దీంతో ఆ పార్టీ కాంగ్రెస్ తలపై తుపాకీ పెట్టి.. తేజస్వి యాదవే సీఎం అభ్యర్థి అని బలవంతంగా ప్రకటించేలా చేసింది. ఎన్నికల ముందే తీవ్ర విభేదాలు తలెత్తాయంటే.. ఎన్నికల తర్వాత తలలు పగలగొట్టుకుంటారు' అని విరుచుకుపడ్డారు. ఆర్జేడీ హయాంలో బీజేపీలో 'కట్టా (తుపాకీ), క్రూరత, కటుతా (కాఠిన్యం), కుశాసన్ (దుష్పరిపాలన), కరప్షన్ (అవినీతి)'తో కూడిన ఆటవిక రాజ్యం నడిచేదన్నారు. ఇప్పుడు చొరబాటుదార్లకు మద్దతివ్వడం ద్వారా, వారి కోసం యాత్రలు చేయడం ద్వారా బిహార్ గుర్తింపును మటుమాయం చేయాలని, చొరబాటుదార్లను ఎలాగైనా కాపాడుకోవాలని కాంగ్రెస్ కూటమి చూస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ఇప్పుడున్న రూ.6 వేల నుంచి రూ.9 వేలకు పెంచుతున్నట్లు ప్రధాని ప్రకటించారు. మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టోను అబద్ధాల పుట్టగా అభివర్ణించారు.

బిహార్‌లో హింసను సహించం: సీఈసీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి హింసాత్మక సంఘటనలనూ సహించబోమని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అన్నారు. శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఓటర్లందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బిహార్‌లో 243 మంది ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అదే సంఖ్యలో పరిశీలకులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు పరిశీలకులు, ఎన్నికల ఖర్చు పరిశీలకులు అందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బిహార్ ఎన్నికలు పారదర్శకత, సామర్థ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఉదాహరణగానే గాక మొత్తం ప్రపంచానికి ఒక నమూనాగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

18న సీఎంగా ప్రమాణం చేస్తున్నా

» బిహార్‌లో గెలుపుపై తేజస్వి ధీమా

» నేరస్థులంతా జైల్లో ఉంటారని ప్రకటన

పట్నా, నవంబరు 2: బిహార్ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి గెలుపు ఖాయమని ఆ కూటమి సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలుడిన నాలుగు రోజులకే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నానని చెప్పారు. మొకమా నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై ఆర్జేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ అరెస్టు నేపథ్యంలో తేజస్వి ఆదివారం పట్నాలో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఈనెల 14న ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు. 18న ప్రమాణ స్వీకారం ఉంటుంది. ఇది జరిగి తీరుతుంది. ఎందుకంటే అంత తీవ్రమైన ఘటన జరిగింది' అన్నారు. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్‌సురాజ్ పార్టీ మద్దతుదారుడైన దులార్ చంద్ యాదవ్ హత్యకు గురైన నేపథ్యంలో అనంత్ సింగ్‌ను అరెస్టు చేశారు. 'బిహార్‌లో ప్రతి రోజూ తీవ్రమైన నేరాలు జరుగుతున్నాయి. మహాగఠ్‌బంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగానే పరిస్థితి మారుతుంది' అన్నారు. కుల, మతాలకు అతీతంగా నేరస్థులందరూ జైళ్లలో ఉంటారని, వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అమెరికాలో ఆకలి కేకలు!

» షట్‌డౌన్‌తో అక్కడి పేదలకు నిలిచిపోయిన ప్రభుత్వ సాయం


మసాచుసెట్స్‌లోని చెల్సియాలో ఉచిత ఆహార కేంద్రంలో సహాయం పొందుతున్న అమెరికన్లు

వాషింగ్టన్, నవంబరు 2: అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్‌తో ఆకలి కేకలు మొదలయ్యాయి. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాల నిధులు నిలిచిపోవడంతో అక్కడి పేద ప్రజలు అల్లాడుతున్నారు. కొన్ని రోజులుగా ఉచితంగా ఆహారం, సరుకులు పంచే కేంద్రాల వద్ద బారులు తీరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన బడ్జెట్‌ను అక్కడి చట్ట సభ సెనేట్ ఆమోదించకపోవడంతో.. ప్రభుత్వంలో ప్రతిష్టంభన (షట్‌డౌన్) పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పలు కేటాయింపులను, అంశాలను మార్చాలని సెనేట్ కోరుతోంది. దానికి అధికార రిపబ్లికన్ల నుంచి సానుకూలత వ్యక్తం కావడం లేదు. షట్‌డౌన్ పరిస్థితి నెలకొన్నప్పుడు పలు అత్యవసర ఖర్చులకు మినహా ప్రభుత్వం ఎలాంటి వ్యయం చేయడానికి వీల్లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు కూడా నిలిచిపోతాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం నుంచి పేద ప్రజలు/అవసరార్థులకు 'సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్ఏపీ)' కింద ఇచ్చే నిధులు నిలిచిపోయాయి. ఎస్ఎన్ఏపీ కింద అమెరికాలో సుమారు 4.2 కోట్ల మందికి.. వారి పరిస్థితిని బట్టి ప్రతినెలా 200 డాలర్ల నుంచి 900 డాలర్ల వరకు సాయం అందుతుంది. ఇప్పుడా సాయం అందక.. స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు, చారిటీ సంస్థలు ఆహారం, నిత్యావసరాలు పంచేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. చాలా చోట్ల ఈ కేంద్రాలు త్వరగా ఖాళీ అవుతున్నాయి. దీనితో తెల్లవారుజామునే క్యూ కడుతున్నారు.

ఎస్ఎన్ఏపీ సాయం ఆపకండి

పేదలకు ఇచ్చే ఎస్ఎన్ఏపీ సాయం ఆపవద్దని మసాచుసెట్స్ జిల్లా జడ్జి ఇందిరా తల్వానీ, రోడ్ ఐలాండ్ ఫెడరల్ జడ్జి జాన్ మెక్‌కానెల్ తాజాగా ట్రంప్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని వాదించడం సరికాదని, ఇతర మార్గాల్లో నిధులు సేకరించిన పేదలకు సాయం పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. నవంబర్ 5వ తేదీ నాటికి కొంత మొత్తమైనా ఎస్ఎన్ఏపీ సాయం పంపిణీ చేసి, వివరాలు తమకు అందజేయాలని ఆదేశించారు. కాగా, అమెరికాలో 31 రోజులుగా కొనసాగుతున్న షట్‌డౌన్‌తో ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.62 వేల కోట్ల (700 కోట్ల డాలర్లు) నష్టం జరిగినట్టు ఆ దేశ ప్రతినిధుల సభ బడ్జెట్ కార్యాలయం ప్రకటించింది.





మణుగూరులోని కార్యాలయంలో ఫర్నిచర్‌ను బయట పడేసి నిప్పు పెడుతున్న కాంగ్రెస్ శ్రేణులు, ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

బీఆర్‌ఎస్ X కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

తొలగించి కాంగ్రెస్ జెండాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. దీంతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం ఉదయాన్నే వందలాది సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రదర్శనగా బీఆర్‌ఎస్ ఆఫీసుకు వెళ్లారు. అనంతరం లోపలికి ప్రవేశించి.. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను విరగ్గొట్టారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ నేతలను బయటికి తోసేసి ఫర్నిచర్‌ను బయట పడేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. జై కాంగ్రెస్.. జై జై కాంగ్రెస్.. ఎమ్మెల్యే పాయం నాయకత్వం వర్ధిల్లాలి.. అంటూ బిగ్గరగా నినాదాలు చేసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌కు చెందిన ఒకరిద్దరు కార్యకర్తలపై పిడిగుద్దులు కురిపించి.. కార్యాలయం నుంచి బయటకు గెంటేశారు. ఈ దాడిలో ఓ బీఆర్‌ఎస్ కార్యకర్తకు గాయమైంది. ఆగ్రహావేశాలతో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు కార్యాలయ భవనం పైకి ఎక్కి బీఆర్‌ఎస్ జెండాలను పీకేసి.. కాంగ్రెస్ జెండాలను ఏర్పాటు చేశారు. మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి, సీఐ నాగబాబు, ఎస్సై శ్రావణ్ కుమార్ ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే వందల సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవడంతో.. పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నాయకులు.. భవనంపై ఉన్న గులాబీ రంగు పెయింట్లను తొలగించి, ఇందిరమ్మ భవనం అంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అనంతరం కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. మరోవైపు.. ఫర్నిచర్ దహనంతో మంటలు చెలరేగి, దట్టమైన పొగలు రావడంతో.. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఏడేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తమ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుని బీఆర్‌ఎస్ భవనంగా మార్చారని, ఏడేళ్ల నుంచి నిరీక్షించిన తమకు ఈ రోజుతో కార్యాలయాన్ని తిరిగి హస్తగతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు మరోమారు కార్యాలయంలోకి ప్రవేశించే యత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఎస్పీ వెంటనే మణుగూరుకు స్పెషల్ పార్టీ బలగాలను పంపించి, బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా మణుగూరులో 144 సెక్షన్ విధించారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన

తమ కార్యాలయంలో విధ్వంసానికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులను వెంటనే ఇక్కడి నుంచి వెనక్కి పంపించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మణుగూరులోని ప్రధాన రోడ్డుపై ఆందోళన చేశారు. వారికి సర్దిచెప్పేందుకు మణుగూరు సీఐ నాగబాబు, ఇతర పోలీసు అధికారులు ఎంత ప్రయత్నించినా.. ఫలితం కనిపించలేదు. కాంగ్రెస్ నేతలను పంపితేనే తాము వెళ్తామంటూ.. బీఆర్‌ఎస్ నాయకులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య కొంత దూరాన్ని ఏర్పాటు చేసి స్పెషల్‌పార్టీ బలగాలు.. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా చూశాయి.

ఎంతో సంతోషంగా ఉంది: ఎమ్మెల్యే పాయం

తమ శ్రమతో పైసా పైసా కూడబెట్టుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కాంగ్రెస్ కార్యాలయంగా ఇందిరమ్మ భవనాన్ని నిర్మించుకుంటే దాన్ని కబ్జా చేసి తెలంగాణ భవన్‌గా మార్చారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిరిగి తమ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. వారి శ్రమకు ప్రతిఫలం దక్కిందని, తమకు ఇది ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

దాడులు, బెదిరింపులకు మేము భయపడబోం: మాజీ ఎమ్మెల్యే రేగా

కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని, రాష్ట్రంలో ఇలాంటి గొడవలు చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఇలాంటి దాడులకు, బెదిరింపులకు తాను భయపడబోమన్నారు. గత ఎన్నికల ప్రచారంలో నేటి సీఎం రేవంత్ రెడ్డి.. తనను గుడ్డలూడదీసి తన్నిస్తానని హెచ్చరికలు చేశారని, అందుకే ఇలా దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. భవనానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కోసం అవసరమైతే కొత్త భవనాన్ని నిర్మించి ఇస్తానని తెలిపారు.

ముమ్మాటికీ కాంగ్రెస్ కార్యాలయమే

మణుగూరులోని ప్రధాన రహదారి పక్కన ఉన్న పార్టీ కార్యాలయం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీదేనని స్థల దాత వారసుడు పీకేఎస్ హరిబాబు అన్నారు. 1980లో తన తండ్రి పిక్కారిశెట్టి సత్యనారాయణ వద్దకు నాటి ఎమ్మెల్యే చందాలింగయ్య, మండల కాంగ్రెస్ నాయకులు బత్తుల వీరయ్య, పోలమూరి రాజు వచ్చి కాంగ్రెస్ కార్యాలయం కోసం స్థలం అడిగారని తెలిపారు. కాంగ్రెస్‌పై అభిమానంతో తన తండ్రి ఈ స్థలాన్ని కేటాయించగా.. అక్కడ భవనాన్ని నిర్మించి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తర్వాత నాయకులు పార్టీలు మారారని, ఆ తర్వాత కార్యాలయాన్ని మార్చారని చెప్పారు.

నేపథ్యం ఇదీ..

కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై తొలిసారి 2009, ఆ తర్వాత 2018 చివర్లో జరిగిన ఎన్నికల్లో మరోసారి పినపాక ఎమ్మెల్యేగా రేగాకాంతారావు గెలిచారు. అనంతరం 2019లో ప్రజా అభివృద్ధే ధ్యేయంగా టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బీఆర్‌ఎస్)లో చేరుతున్నట్లు ప్రకటించి పార్టీ మారారు. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా ఉన్న ఈ భవనాన్ని ఆ తర్వాత టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంగా రేగా కాంతారావు మార్చారు. దీంతో అప్పుడే ఈ విషయాన్ని తీవ్ర స్థాయిలో ఖండించిన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరాహార దీక్షలను కూడా చేపట్టారు. ఈ విషయంపై జరిగిన ఆందోళనలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ.. అప్పటి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ బలరామ్, తదితరులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. మణుగూరు మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులను ప్రశ్నించారు. ఖచ్చితంగా ఇది కాంగ్రెస్ పార్టీకే చెందాలని చెప్పి వెళ్లారు.



వలస బతుకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, పరకాల ప్రభాకర్, రాఘవాచారి తదితరులు

పాలమూరు కూలీల బతుకులు మారలేదు!

- పని కావాలంటే వలస వెళ్లాల్సిందే: జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- మరికల్‌లో 'వలస బతుకు' పుస్తకావిష్కరణ

మరికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కూలీల బతుకులు మారలేదని, పని కావాలంటే ఇప్పటికీ వలస వెళ్లాల్సిందేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరుకు వలస జిల్లాగా పేరుందన్నారు. గతంలో గుంపు మేస్త్రీలు కూలీలను వలస తీసుకెళ్లి చాలీచాలని జీతమిచ్చి ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణాలను చేయించేవారన్నారు. నారాయణపేట జిల్లా మరికల్‌కు చెందిన దివంగత నర్సన్న రచించిన 'వలస బతుకు (పాలమూరు వలస కూలీ జీవన గాథ)' పుస్తకావిష్కరణ సభకు ఆయనతో పాటు, పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రచయిత తనయుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాములు ఆధ్వర్యంలో మరికల్‌లో ఆదివారం నిర్వహించిన ఆవిష్కరణ సభలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. వలస కూలీగా నర్సన్న తన అనుభవాలను పుస్తక రూపంలో తీసుకొచ్చారన్నారు. ఆనాడు నర్సన్న, భార్యతో పాటు వలస వెళ్లి ప్రత్యక్షంగా అనుభవించిన సంఘటనలపై పుస్తకం రచించడం గర్వకారణమని చెప్పారు. ఈ పుస్తకం చదివిన వారిలో కొద్దిగైనా మార్పు వస్తుందని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. కుతుబ్‌షాహీల కాలంలో మొదలైన కూలీల వలసలు, నేటికీ కొనసాగుతున్నాయన్నారు. లక్షలాది మంది వలస కూలీలుగా, తరతరాలుగా కష్టపడి దేశ నిర్మాణంలో భాగస్వాములయ్యారని తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా వలసలు ఆగలేదని చెప్పారు. నాటి ప్రభుత్వాలు చొరవ తీసుకుంటే పాలమూరు తలరాత ఎన్నడో మారేదన్నారు. పుస్తక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ జిల్లాలో ఎంతో మంది కవులు, రచయితలున్నా వలస మీద ఒక్కటంటే ఒక్క నవల రాలేదని.. లక్షల కూలీల్లో ఒకరైన నర్సన్న తన వలస బతుకునే పుస్తకంగా రాశారని చెప్పారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ.. కళారంగంలో ఇలాంటి వారు తమ అనుభవాలను రచించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, డీజీ హైమావతి, ఎండీ ఇక్బాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో వైసీపీ 'డ్రగ్స్' దందా!

- వైసీపీ నేత కొండారెడ్డి సహా నలుగురి అరెస్టు, మరొకరి కోసం గాలింపు

విశాఖపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఐటీ రాజధానిగా విలసిల్లుతున్న విశాఖలో వైసీపీ నేత డ్రగ్స్ దందా నడిపిస్తున్నారు. విద్యార్థులే లక్ష్యంగా మాదక ద్రవ్యాల విక్రయాలు సాగిస్తున్నారు. డ్రగ్స్ దిగుమతి, విక్రయం కేసులో విశాఖ జిల్లా వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. చరణ్ అనే యువకుడి ద్వారా బెంగళూరు నుంచి ఎల్ఎస్‌డీ బోల్ట్స్ డ్రగ్స్‌ను నగరానికి చేరవేస్తున్నట్టు సమాచారం అందుకున్న ఈగల్ టీమ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఆదివారం విశాఖ రైల్వే స్టేషన్‌లో చరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా 36 ఎల్ఎస్‌డీ బోల్ట్స్ లభ్యమయ్యాయి. కొండారెడ్డి కోసమే బెంగళూరు నుంచి తెస్తున్నట్టు చరణ్ వెల్లడించాడు. దీంతో పోలీసులు కొండారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించ గా.. వాటిని నగరంలోని ఒక విద్యా సంస్థలో చదువుతున్న హర్షవర్ధన్‌నాయుడు, హైదరాబాద్‌కు చెందిన సంతానం, విశాఖకు చెందిన శరత్‌లకు విక్రయించేందుకు తెప్పించినట్టు అంగీకరించాడు. దీంతో ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు హర్షవర్ధన్‌నాయుడు, శరత్‌లను అదుపులో కి తీసుకుని 4వ పట్టణ పోలీసులకు అప్పగించారు. వీరిపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించారు. సంతానం కోసం పోలీసులు గాలిస్తున్నారు. విశాఖలోని మద్దిలపాలెంలో ఉంటున్న కొండారెడ్డి వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధినేత జగన్, మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డిలకు కొండారెడ్డి అత్యంత సన్నిహితుడు. కొండారెడ్డి హైదరాబాద్, బెంగళూరు, గోవాల నుంచి డ్రగ్స్‌ను తెప్పించి నగరం, ఇతర ప్రాంతాల వారికి విక్రయిస్తుంటాడని పోలీసులు గుర్తించారు.

రహదారి భద్రతకు రోడ్‌మ్యాప్

- విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి
- 15 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్
- కసరత్తు ప్రారంభించిన పోలీసు బాస్

హైదరాబాద్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి) : ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ రోడ్‌మ్యాప్ తయారీ ప్రక్రియను ప్రారంభించింది. తెలంగాణలో గత 11 ఏళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 86వేల మందికి పైగా మృతి చెందారు. ఈ మరణాల్లో అత్యధిక శాతం అతి వేగం వల్లే సంభవించాయని విశ్లేషించారు. ఏటా సగటున 6-8వేల మంది ఈ ఘటనల్లో బలవుతున్న విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ క్రమంలో వీటిని నివారించడం, మరణాల శాతాన్ని తగ్గించడానికి డీజీపీ శివధర్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లకు రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు చేపట్టాల్సిన ప్రత్యేక విధులను నిర్దేశించారు. తీవ్రగాయాలు, మరణం సంభవించినపుడు ఆయా ప్రాంతాలకు ఇన్‌స్పెక్టర్ తప్పనిసరిగా వెళ్లాలని, ఎస్ఐలు, కానిస్టేబుళ్ల మీద బాధ్యత వదిలేస్తే సహించబోమని కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ప్రమాదం తీరుపై ఇన్‌స్పెక్టర్లు విశ్లేషించాలని అక్కడ మరో ఘటన జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో రికార్డు చేయాలన్నారు. పోలీసులు కనిపిస్తుంటే మితిమీరిన వేగంతో వెళ్లేవారు కూడా భయపడతారన్నారు. ఇది విజిబుల్ పోలీసింగ్‌ను పెంచడం ద్వారానే సాధ్యపడుతుందని డీజీపీ శివధర్‌రెడ్డి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏసీపీలు, డీఎస్పీలు రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు వాహన తనిఖీలు చేయాలన్నారు. వచ్చేనెల 15 నుంచి రాష్ట్రంలో రెండువారాల పాటు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అలైవ్, అరైవ్ స్లోగన్‌తో కార్యక్రమాలు చేపట్టాలని డీజీపీ పేర్కొన్నారు.

కోల్‌కతాలో మరో గ్యాంగ్ రేప్.. ముగ్గురి అరెస్టు

కోల్‌కతా, నవంబరు 2: కోల్‌కతాలో మరో సామూహిక అత్యాచారం సంఘటన చోటుచేసుకుంది. డమ్‌డమ్ ఏరియాలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారం జరగగా, పోలీసులు ముగ్గుర్ని అరెస్టు చేశారు. ఏడో తరగతి చదువుతున్న ఆమె శనివారం ట్యూషన్‌కు వెళ్తుండగా పార్కు వద్ద మాటు వేసిన ముగ్గురు వ్యక్తులు ఆమెను బలవంతంగా ఈ-రిక్షాలోకి ఎక్కించి వేరే చోటికి తీసుకెళ్లారు. ఆ ముగ్గురిలో ఒకడు ఆమెకు పరిచయం ఉన్న వ్యక్తే కావడం గమనార్హం. ఆమెను అక్కడ హింసించి అత్యాచారం చేశారు. తప్పించుకొని ఇంటికి చేరిన ఆమె తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.



యాదగిరిగుట్ట ప్రధానాలయ ఉత్తర తిరువీధిలో భక్తుల సందడి

భక్తజన సందోహం యాదగిరి క్షేత్రం

- 65వేల మంది భక్తుల రాక

యాదగిరిగుట్ట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం, ఆదివారం సెలవు రోజు కావడంతో సుమారు 65 వేలమంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. 1,372 మంది దంపతులు సత్యదేవుని వ్రతాల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల ద్వారా రూ.66,76,776 ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి ఈవో ఎస్. హరీష్ తెలిపారు.



కుటుంబసభ్యులతో కోటమ్మ

అమ్మ తిరిగొచ్చింది..

- మతిస్థిమితం లేక తప్పిపోయిన తల్లి
- స్వచ్ఛంద సంస్థ చొరవతో పదేళ్ల తర్వాత ఇంటికి

పినపాక, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేక పదేళ్ల క్రితం ఇంటి నుంచి తప్పిపోయిన ఓ తల్లి.. తన బిడ్డలను చేరుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన జల్లారపు కోటమ్మకు ముగ్గురు సంతానం. ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేసింది. కొడుకు వద్ద ఉంటూ.. ఓ రోజు బహిర్భూమికని వెళ్లి తప్పిపోయింది. ఏళ్లు గడిచినా తల్లి జాడ తెలియకపోవడంతో.. చనిపోయి ఉండొచ్చని భావించిన ఆమె బిడ్డలు గతేడాది కర్మకాండలు కూడా జరిపించారు. అలా పదేళ్ల క్రితం తప్పిపోయిన కోటమ్మ మహారాష్ట్రలోని నాగపూర్‌కు చేరుకుంది. అక్కడ ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ కుందా కాతేఖాయ బిఢ్కర్ ఆమెను చేరదీసి వైద్యం అందించారు. మతిస్థిమితం వచ్చిన కోటమ్మ.. తన పూర్వపరాలు తెలుపడంతో.. ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావు సాయంతో ఆదివారం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. తల్లిని చూసి ఆ కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

పంట దెబ్బతిన్నదని రైతు ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో మరో అన్నదాత మృతి



సుధాకర్, భూపాల్‌రెడ్డి (ఫైల్)

వాంకిడి, చేవెళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంట దెబ్బతిన్నదన్న మనస్తాపంతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రానికి చెందిన రైతు బుట్లే సుధాకర్(34) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు పంట కుళ్లిపోవడంతో కౌలు భూమికి, పత్తి పంటకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన చెంది శనివారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగప్పగూడలో ఆదివారం విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. చేవెళ్ల మండల పరిధిలోని సింగప్పగూడకు చెందిన పడమాటి భూపాల్‌రెడ్డి(56) ఆదివారం వరిపంటకు నీళ్లు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. ఆ పొలం పక్కనే అతని తమ్ముడు రవీందర్‌రెడ్డి తన పొలంలోకి పందులు రాకుండా చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. దాన్ని గమనించని భూపాల్‌రెడ్డి కాలుకు విద్యుత్ వైర్ తగలడంతో షాక్‌తో చనిపోయాడు.

జవసత్వాలతోనే వారసత్వం సాధ్యం

- తండ్రి ఆస్తులు పంచుకోవడం కాదు
- జానమద్ది శతజయంత్యుత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కడప (మారుతీనగర్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వారసత్వం అంటే తండ్రి సంపాదించిన ఆస్తులను పంచుకోవడం కాదని, వారసత్వం అందుకోవాలంటే నిజమైన జవసత్వాలు పొందగలిగినపుడే సాధ్యమవుతుందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కడపలో సీపీ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణకర్త డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంత్యుత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. జానమద్ది చాలా మంచి గొప్ప వ్యక్తి అని, సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని నిర్మించేందుకు ఒక యజ్ఞం లాగా ఆయన తపించారని తెలిపారు. "ఒక విదేశీయుడు(సీపీ బ్రౌన్) మన రాష్ట్రానికి వచ్చి, మన తెలుగు భాష కోసం కృషి చేశారు. ఆ మహోన్నతుడికి శతకోటి అభినందనలు. బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించాలని చాలా కాలంగా అనుకున్నా.. ఇప్పటికి ఆ భాగ్యం కలిగింది. ప్రతి ఊరికి ఒక దేవాలయం, విద్యాలయం, సేవాలయం, గ్రంథాలయం నెలకొల్పేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ముఖ్యంగా దేశ సమైక్యతకు, దేశ అభివృద్ధికి, విలువలను కాపాడేందుకు.. నేటి యువత కీలకపాత్ర పోషించాలి. మాతృభాషలోనే పాఠ్యాంశాలు, ఉత్తర్వులు, ప్రత్యుత్తరాలతో పాటు న్యాయవాదులు కూడా తెలుగులోనే వాదించాలి. ప్రధాని మోదీ కూడా ఉన్నత విద్యను మాతృ భాషలోనే అందించే ఆలోచనలో ఉన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో కొంత సమయాన్ని కేటాయించాల్సిన అవసరం ఉంది." అని తెలిపారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, అవధాన సరస్వతి మేడసాని మోహన్, లక్షలాది గ్రంథాల సంరక్షకుడు మరెఅంకెగౌడ, ప్రముఖ సాహితీవేత్త రేవూరు ఆనందపద్మనాభలకు జానమద్ది పురస్కారాలు అందజేశారు.



దహెగాం మండలంలోని కర్జిలో ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు(ఫైల్)

గుడుంబాపై సమర శంఖం!

- నిషేధిస్తూ గ్రామాల వారీగా తీర్మానాలు. ప్రజలతో ప్రతిజ్ఞలు
- విక్రయాలు, వినియోగిస్తే జరిమానా హెచ్చరికలు
- కుమరం భీం జిల్లాలో యువత, మహిళల ముందడుగు

ఆసిఫాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుడుంబా, నాటుసారా అమ్మకాలు, వినియోగాన్ని అరికట్టేందుకు కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో యువత, మహిళలు నడుం బిగించారు. విక్రయాలు, వినియోగాలపై నిషేధానికి సమర శంఖం పూరించారు. కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్న గుడుంబా ఇతర మత్తు పదార్థాలను నిషేధిస్తూ గ్రామాల వారీగా తీర్మానాలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని దహెగాం, పెంచికల్‌పేట మండలాల్లోని పలు గ్రామాల్లో యువత ముందుకొచ్చి ప్రజలకు గుడుంబా అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో గుడుంబాను నిషేధిస్తున్నామని ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. ఇటీవల దహెగాం మండలం కర్జిలో గుడుంబాకు బానిసై రాజన్న అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గుడుంబా మహమ్మారిని రూపుమాపాలనే సంకల్పంతో యువత ముందుకొచ్చింది. ఆ గ్రామయువకులు ఇంటింటికీ తిరుగుతూ గుడుంబా, నాటుసారా తాగడంతో కలిగే అనర్థాలను వివరించారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా పోలీసులకు సమాచారమిస్తామని హెచ్చరించారు. అనంతరం నాటుసారాను నిషేధించాలని ప్రతిజ్ఞ చేశారు. దహెగాం మండలం రాంపూర్‌లో యువకులు మత్తు పదార్థాల వినియోగాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గ్రామంలోకి మత్తు పదార్థాలు తీసుకొస్తే రూ. 50 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పెంచికలపేట మండలం అగర్‌గూడ గ్రామంలోనూ యువకులు అంతా ఏకమై గుడుంబాను పూర్తిగా గ్రామంలో నిషేధిస్తున్నామని తీర్మానించి ప్రతిజ్ఞ చేశారు.

భార్యపై అనుమానంతో దారుణం

ఆమెతో పాటు కూతురు, వదినను చంపి తాను ఆత్మహత్య

- నిద్రిస్తున్న వారిపై కత్తితో ఘాతుకం
- తప్పించుకున్న పెద్ద కూతురు
- వికారాబాద్ జిల్లా కులకచర్లలో ఘటన



యాదయ్య, భార్య అలవేలు, కూతురు శ్రావణి (చిన్ననాటి ఫొటో), వదిన హన్మమ్మ (ఫైల్)

కులకచర్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో ఆమెను, చిన్న కుమార్తెను, వదినను నరికిచంపాడు. పెద్ద కుమార్తె గాయాలతో తప్పించుకుని బయటపడింది. ఆపై ఆ వ్యక్తి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కులకచర్లకు చెందిన వేపూరి యాదయ్య (38)కు పాలమూరు జిల్లా హన్వాడ మండలం పగిడ్యాల్‌కు చెందిన అలవేలు(34)తో 15 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి కుమార్తెలు అపర్ణ (13), శ్రావణి (10) ఉన్నారు. దంపతులిద్దరూ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. యాదయ్య అలవేలుపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచూ గొడవ పడుతుండేవారు. పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. పోలీసు స్టేషన్ వరకు కూడా వెళ్లారు. శనివారం సాయంత్రం కూడా స్థానిక ఓ ప్రజాప్రతినిధి వద్ద పంచాయితీ జరగగా.. గొడవలు పడకుండా ఉండాలని ఆ ప్రజాప్రతినిధి నచ్చజెప్పి పంపించాడు. అయితే అనుమానంతో భార్యపైన, తమ మధ్య గొడవలో అడ్డు వస్తోందని వదిన (అలవేలు అక్క) హన్మమ్మ (40)పై యాదయ్య పగ పెంచుకున్నాడు. హన్మమ్మది కోస్గి మండలం బలభద్రయపల్లి గ్రామం. శనివారమే పంచాయితీ కోసం వచ్చింది. పంచాయితీలో హన్మమ్మ మాట్లాడిన తీరుపై యాదయ్య కోపంతో రగిలిపోయాడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాత్రి అందరూ కలిసి భోజనం చేసి పడుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో యాదయ్య నిద్రిస్తున్న హన్మమ్మపై తాటి ముంజెలు తీసే కత్తితో దాడి చేశాడు. దీంతో ఉలిక్కిపడి లేచిన భార్య, పిల్లలు అతడిని అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారు. తర్వాత యాదయ్య భార్యపైన, ఆపై చిన్న కూతురు శ్రావణిపైనా కత్తితో దాడి చేసి చంపాడు. పెద్ద కూతురు అపర్ణనూ చంపేందుకు ప్రయత్నించగా.. ఆమె గాయాలతో తప్పించుకుంది. గ్రామంలో ప్రభు అనే వ్యక్తి ఇంటికెళ్లి జరిగిన విషయం చెప్పింది. ప్రభు, అతని సోదరుడు పెంటయ్యను నిద్రలేపి యాదయ్య ఇంటికి వచ్చి చూడగా అప్పటికే హన్మమ్మ, అలవేలు, శ్రావణి రక్తపుమడుగులో నిర్జీవంగా పడి ఉన్నారు. యాదయ్య ఉరేసుకుని కనిపించాడు. యాదయ్య భార్యపై అనుమానంతో పాటు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, దాన్ని నిలదీసినందుకే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. అలవేలు అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాపం.. అపర్ణ

తల్లి, తండ్రి, పెద్దమ్మ, చెల్లిని కోల్పోయిన అపర్ణ అనాథగా మారింది. గాయపడిన ఆమె పరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అపర్ణ భవిష్యత్తు ఏమిటని, తల్లిదండ్రులు లేని లోటును ఎవరు తీరుస్తారని పలువురు కంటతడిపెట్టారు.

నలిగిన పాదాలు



నాన్న చిటికెన వేలు పట్టుకొని
జాతరలు ఊరేగడం గుర్తేలేదు
కడపిక్కలు పట్టేసిన
నాగలి కాళ్ళంట
కణతలు దేరిపోయిన పాదాల కింద
గడ్డి పరకలు ఏరుకొని
బతుకు నూకలు పోగేసుకోవడమైతే
ఇప్పుడిప్పుడే మరిచిపోయినట్టు లేదు

'పగులు లోయ గుండా
ప్రవహిస్తున్న నది' అన్నప్పుడల్లా
తరగతి గదిలో, నాన్న అరికాళ్లే
కళ్ళ ముందు మెదులాడుతాయి
నాన్న పాదాలు–
నదీ వ్యవస్థను ఉదహరించడానికి
ఇంతకంటే నమూనా ఉండదేమో!
కాకపోతే, నీళ్ళ జాగాలో
చెమట, నెత్తురు కనిపిస్తుందంతే

ఏ సుక్కపొద్దు యాలకో
కుండా మండ చల్లారబెట్టి,
నాన్న పాదాల ప్రవాహాలలో
వేడి నూనొత్తులతో
అమ్మ కట్టిన ఆనకట్టలన్నీ
తెల్లారి మెరక పొలంలో
ఏ దుబ్బుగడ్డికో లోకువైపోతుండేవి

కవితల్లో అల్లినట్టుగా
కథల్లో చెప్పినట్టుగా
సుకుమారమైన నాన్న చేతులెప్పుడూ
మా తలలను నిమరలేదు
బండలు పగలేసిన చేతులు కదా!
రాళ్ళదేరిపోయి, రాయీ రప్పల్లోనూ

వెన్నపూసలాంటి మనసులే
నాన్న చేతులు చూపించాయి

నాన్నైతే ఇప్పుడు లేరు
అంతోటి నాగలి కొండెక్కింది
ఉన్నవన్నీ బతుకు పాఠాలే
నాన్న ఈదుకొచ్చిన సంసారమంతా
నాలుగు స్తంభాలై
అమ్మని నిలబెడుతున్నప్పుడు
అమ్మ పాదాల్లోనూ నాన్నే కనిపిస్తాడు
నాగలి లేని సంసారాన్ని
ఒడ్డుకు చేర్చిన అమ్మ పాదాలు
ఇప్పుడు ఏ వెన్నపూసకు
ఇసుమంతైనా లొంగడం లేదు!

■ వినోద్ కుత్తుం
✆ 96343 14502

ప్రమాణాల్లేని నేటి విమర్శ

కవి లేదా రచయిత తీసుకున్న వస్తువు అందరిచేత ఆమోదం పొందాలని భావించి రచనకు పూనుకుంటాడు. ఎక్కువమంది పాఠకులు దాన్ని ఆమోదించినప్పుడు ఆ రచన విలువ పెరుగుతుంది. ఆ విలువను ఖరారు చేయగలిగిన వాడు విమర్శకుడు. విమర్శకుడు ఒక రచనను అంచనా వేయడంలో సాహిత్య విలువలను, సామాజిక విలువలను దృష్టిలో ఉంచుకోవాలి.

ఒక రచనను విమర్శ చేసే సందర్భంలో విమర్శకుడు ఏ ప్రలోభాలకు లొంగని న్యాయమూర్తి పాత్ర పోషించాలి. రచనని ఆకాశానికి ఎత్తేస్తూ వ్యాసం రాయడం విమర్శ కాదు. రచనను పాతాళానికి తోసేస్తూ మాట్లాడటమూ విమర్శ కాదు. ప్రతి రచనా ప్రభావవంతంగా ఉండాలని రచయితలు ఆశిస్తారు. కొన్ని సందర్భాల్లో రచన ప్రభావంతంగా లేనప్పుడు, రచయిత ఉన్నతిని కోరుకునే విధంగా విమర్శకుడి భాష ఉండాలి.

గత పదిహేను సంవత్సరాలుగా తెలుగు విమర్శను పరిశీలించినప్పుడు సరికొత్త సిద్ధాంతాల ప్రకటనలు ఏమీ లేవని అర్థమవుతుంది. కేవలం మార్క్సిస్టు విమర్శ, ద్రవాధునికత, పోస్ట్ మోడర్నిజం ప్రాతిపదిక మీదగా మాత్రమే చాలామంది విమర్శకులు వ్యాసాలు రాస్తున్నారు. ఆ వస్తున్న వ్యాసాల్లోనూ సారం తక్కువ. ఈ కాలపు సాహిత్య విమర్శలో కేవలం విశ్లేషణ మాత్రమే మనం చూస్తున్నాం. మరి కొంతమంది కేవలం లోపాలు చెప్పడం మాత్రం విమర్శ అనే భ్రమలో ఉన్నారు. ఏదైనా ఒక విమర్శను చేసినప్పుడు అందులో విమర్శకుడు తన పరికరాలు ఏమిటో, నిరూపణలు ఏమిటో చెప్పాలి. సాహిత్య విమర్శలలో వివరణలు ఉండవచ్చు. విశ్లేషణ ఉండవచ్చు. వివేచన ఉంటుంది. సమన్వయం ఉంటుంది. మూల్యాంకనము ఉంటుంది. ఇట్లాంటి లక్షణాలు కలిగిన విమర్శకులు రావాలి.

సాహిత్య వికాసంలో విమర్శ ఒక భాగం. ఒక కవిత సంపుటిని లేదా కవిత్వాన్ని విలువ కట్టడానికి ఇవాళ విమర్శకులు కొత్త ప్రమాణాలను రూపొందించినట్లు కనబడదు. కేవలం వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం ఈ నాలుగు మాటలతో వ్యాసం రాస్తే అది విమర్శ అని సాహిత్య లోకంలో ఇప్పుడు చెలామణిలో ఉంది.

గతంలో విమర్శకులు ఒక రచనను అంచనా వేసే క్రమంలో కొన్ని ప్రమాణాలను, సిద్ధాంతాలను పాటించే వారు. కట్టమంచి రామలింగా రెడ్డి దగ్గర నుంచి త్రిపురనేని మధుసూదన రావు వరకు విమర్శ పద్ధతిగా సాగింది. ఆ తర్వాత వచ్చిన అనేకమంది విమర్శకులు ఆ పునాదిగా మాట్లాడారు కానీ కొత్త సిద్ధాంతాలను ప్రకటించడం లేదా సరికొత్త పరికరాలను అన్వేషించడం చేయలేదు. ప్రాచీన సాహిత్యాన్ని అంచనా వేయడానికి అనేకమంది తెలుగు విమర్శకులు పూనుకుని ప్రణాళిక ఇచ్చారు. ఆ తర్వాత అభ్యుదయ సాహిత్య విమర్శ దళితవాద విమర్శ స్త్రీవాదవిమర్శ, ప్రాంతీయవాదం వీటిల్లో కూడా కొంతమేర కృషి జరిగింది. ప్రపంచీకరణ ప్రభావం కూడా విమర్శలో కనిపించింది. జి. లక్ష్మీనరసయ్య దళిత కళాతత్వ విమర్శ లోనూ దేశీయ మార్క్సిజం ఆలోచన చేశారు. మేడిపల్లి రవికుమార్ తనదైన కోణాల నుంచి విమర్శ చేశారు కానీ ఆయన ఎక్కడ దాన్ని సమగ్రంగా రాత రూపంలో తీసుకు రాలేదు. పాపినేని శివశంకర్ ద్రవాధునికత మీద మాట్లాడారు. రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మార్క్సిస్ట్ పునాదుల మీద మాట్లాడారు. తిరుపతి రావు ఆధునికోత్తరవాదం గురించి చర్చించారు. సీతారాం పర్యావరణ కోణంలో సాహిత్య విమర్శకు కృషి చేస్తున్నారు.

అయితే ఈ కాలంలో విమర్శ పరిస్థితి ఏంటి? విమర్శకుడు అనే భ్రమలో వ్యాసాలు రాస్తున్న వాళ్ళ పరికరాలు ఏమిటి? తమవైన సిద్ధాంతాల ప్రాతిపదిక ఏమైనా ఉందా? సాహిత్య విమర్శకి సిద్ధాంత భూమిక వుండి తీరాలి. అప్పుడే కళకి సంబంధించిన లోతులనీ ఎత్తులనీ విశ్లేషణ చేయగలం. ఇందుకు భిన్నంగా తక్షణ స్పందన కోసం విమర్శ పేరుతో సామాజిక మాధ్యమాలలో వ్యాసాలు రాయడం చూస్తున్నాం.

ఒక రచన మీద స్పందన విమర్శ రూపంలో తెలపడం తప్పు కాదు గానీ, మాట్లాడుతున్న వారి భూమిక ఏంటో స్పష్టంగా తెలియాలి. తీవ్రమైన అధ్యయనం తర్వాత మాత్రమే విమర్శ రంగంలోకి అడుగు పెట్టాలి. మారుతున్న సమాజంలో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శను కూడా మనం స్వీకరించాలి. ఐతే అది విమర్శ అయి ఉండాలి. కువిమర్శ కాకూడదు. సమీక్ష పాఠకుడిని రచన దగ్గరకు తీసుకెళ్లగలదు. కానీ విమర్శ రచనని పాఠకుల లోపలికి తీసుకెళ్లగలగాలి.

ఈ కాలంలో విమర్శ పరిస్థితి ఏంటి? విమర్శకుడు అనే భ్రమలో వ్యాసాలు రాస్తున్న వాళ్ళ పరికరాలు ఏమిటి? తమవైన సిద్ధాంతాల ప్రాతిపదిక ఏమైనా ఉందా? ఒక కవిత్వ సంపుటిని లేదా కవిత్వాన్ని విలువ కట్టడానికి ఇవాళ విమర్శకులు కొత్త ప్రమాణాలను రూపొందించినట్లు కనబడదు. కేవలం వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం ఈ నాలుగు మాటలతో వ్యాసం రాస్తే అది విమర్శ అని సాహిత్య లోకంలో ఇప్పుడు చెలామణిలో ఉంది.



మారుతున్న సామాజిక విలువలను, మానవ సంబంధాల్లోని అసమతుల్యతను మన సాహిత్యం కళాత్మకంగా చిత్రీకరించగలుగుతుందా లేదా వంటి పరిణామాల మీద విమర్శకుడు దృష్టి పెట్టాలి. విమర్శకుడు రచన కంటే ముందుండాలి. గత పదిహేను సంవత్సరాలుగా దేశంలో రాష్ట్రంలో జరిగిన అనేక పరిణామాలను సాహిత్యం చిత్రీకరించగలిగిందా? కేవలం సాహిత్య విలువలు కలిగిన రచనలు మాత్రమే వచ్చాయా? సాహిత్యంలో సమాజం ఎట్లా ప్రతిబింబించింది? సౌందర్యాత్మక రచనల ప్రతిఫలనాలు ఏమిటి? ఈ కాలపు విమర్శకులు ఎట్లాంటి సాధనాలతో అంచనా వేయగలిగారో, వేయగలరో చూడాలి. సృజన ఉంటేనే విమర్శ. ఒక కాలపు సృజన లేదా ఒక రచయిత సృజన ఆధారంగానే విమర్శ పరికరాలను సిద్ధం చేసుకోవాలి.

■ సుంకర గోపాలయ్య
✆ 94926 38547

'ప్రకాశకిరణాలు' ఆవిష్కరణ

పొత్తూరి సుబ్బారావు రాసిన సంపాదకీయాల సంపుటి 'ప్రకాశ కిరణాలు' ఆవిష్కరణ సభ నవంబర్ 6 సా.6 గం.లకు హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికపై జరుగుతుంది. ఆవిష్కర్త: కె.వి. రమణాచారి, అధ్యక్షత: పి. విజయబాబు. కళా వి.ఎస్. జనార్దనమూర్తి, వంశీ రామరాజు, బైస దేవదాసు, మౌనశ్రీ మల్లిక్, పెద్దూరి వెంకటదాసు, పొత్తూరి జయలక్ష్మి పాల్గొంటారు.

జి.వి.ఆర్. ఆరాధన
కల్చరల్ ఫౌండేషన్

రెండుతరాల కవిసంగమం

రెండు తరాల కవిసంగమం సిరీస్– 45 నవంబర్ 8న సా.6గం.లకు నిజాం కాలేజి, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పాల్గొంటున్న కవులు: చెమన్, గట్టు రాధికమోహన్, తలారి సతీష్ కుమార్, జాదవ్ అంబదాస్, నితిన్ చౌహాన్ (నిజాం కాలేజి బి.ఏ విద్యార్థి).

యాకూబ్

కొడాలి గోపాలరావు శతజయంతి

సాహిత్య అకాడమీ, వివేక సర్వీస్ సొసైటీ సంయుక్త నిర్వహణలో కొడాలి గోపాలరావు శతజయంతి సదస్సు నవంబర్ 9 ఉ.10గం.ల నుంచి వివేక సర్వీస్ సొసైటి ఆవరణ, బాపట్లలో జరుగుతుంది. స్వాగతోపన్యాసం సి. మృణాళిని, ప్రారంభోపన్యాసం వల్లూరు శివ ప్రసాద్, కీలకోపన్యాసం డి.యస్. యస్. మూర్తి, అధ్యక్షత అంబటి మురళీకృష్ణ.

సాహిత్య అకాడమీ

సోమవారం 3 నవంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

ఖమ్మం ఈస్తటిక్స్ అవార్డు ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ పోటీలో కవిత్వ విభాగంలో పలమనేరు బాలాజీ కవితా సంపుటి 'లోపలేదో కదులుతున్నట్టు' రూ.40 వేల బహుమతికి, రేణుక అయోల కవితా సంపుటి 'రవిక', పాయల మురళీకృష్ణ 'గచ్చం చెట్టుకు అటూ ఇటూ' ప్రత్యేక ప్రశంసకు ఎంపికయ్యాయి. కథల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా వి.ఆర్.రాసాని 'తేనె కల్లు' (రూ.25వేలు), ఆలూరి అరుణ్ కుమార్ 'అంజమ్మ' (రూ.15వేలు), యాములపల్లి నర్సిరెడ్డి 'కావలి' (రూ.10 వేలు) గెలుచుకున్నాయి. సాధారణ బహుమతికి ఎంపికైన మరో తొమ్మిది కథలతో ఒక కథా సంపుటి వస్తుంది. నవంబర్ 9 న ఖమ్మంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందిస్తారు.

రవి మారుత్

ఒద్దిరాజు పురస్కారం

సహృదయ సాంస్కృతిక సాహిత్య సంస్థ వరంగల్ వార్షికోత్సవ సందర్భంగా ప్రతి ఏటా కథ, నవల, పద్యకావ్యం, వచనకావ్యం, సాహితీ విమర్శలలో ఒకదానికి ఆవృతంగా ఇచ్చే ఒద్దిరాజు సోదర కవుల స్మారక సాహితీ పురస్కారం 2025ను అంబల్ల జనార్ధన్ 'ముంబయి చూపుతో' కథా సంపుటికి లభించింది. రూ.10వేల నగదుతో పురస్కార ప్రదానం నవంబరు 15న హనుమకొండలో జరుగుతుంది.

గిరిజామనోహర బాబు

నాడు అందరూ ఆకాంక్షించిన దిశలో నేను ప్రయాణించలేదు

'రేవు చూడని నావ' అన్న కవితా సంపుటి – ప్రచురించాలన్న ఆలోచన ఎలా వచ్చిందో గుర్తులేదు కానీ వచ్చాక మొదట ఆచార్య తిరుమలగారి అభిప్రాయం అడిగాను. ఆయన "చాలా బావున్నాయి, తప్పకుండా పుస్తకం వేయవచ్చు" అంటూ ముందుమాట కూడా రాసి ఇచ్చారు. మాధవి ప్రింటర్స్ గురించి కూడా ఆయనే చెప్పినట్లున్నారు.

తర్వాత చంద్రగారిని ముఖచిత్రం వేసి ఇవ్వమని అడిగాను. ఆయన మొత్తం కవితలన్నీ చదివి, ఒక్కొక్క కవితనీ అందులోని పదాలనీ చాలా మెచ్చుకుంటూ మాట్లాడారు. అందమైన ముఖచిత్రాన్నీ గీసి ఇచ్చారు. ఆ ముఖచిత్రాన్ని చూసి సింగిల్ కలర్లో అంత అందమైన ముఖచిత్రం రావడం అరుదని చాలామంది అన్నారు.



సినారెగారి అభిప్రాయం కూడా తీసుకోమని చంద్రగారే చెప్పారు. పరిచయం లేదని నేను సందేహిస్తుంటే "పరిచయం అక్కర్లేదు, అడగండి" అని మరీమరీ చెప్పడంతో నారాయణరెడ్డి గారికి ఫోన్ చేశాను. సారస్వత పరిషత్ దగ్గర పుస్తకం అందిస్తే ఆయన ఒక్క వారంలోనే ముందుమాట రాసి పోస్టులో పంపారు.

'నాస్నేహితుడు' కథకు రచయిత్రిగా వచ్చిన గుర్తింపు వలన మా కంపెనీ ఎమ్.డి. డాక్టర్ డి.ఎన్.రావుగారు "ఈ ప్రాజెక్టని డ్యూక్ ఆర్నిక్స్ సపోర్ట్ చేస్తుంది" అంటూ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. పుస్తకం ప్రింటుకి ఇచ్చాం.

నా మొదటి పుస్తకం

టి. శ్రీవల్లీ రాధిక



తీరా పుస్తకం తెచ్చుకుందామని వెళ్ళేసరికి షాపు మూసేసి ఉంది. ఆ ప్రింటింగ్ ప్రెస్ ఊట్ల కొండయ్య గారిది. మొదట మాట్లాడి పని తీసుకున్నది వారి అబ్బాయి. తర్వాత వారిద్దరి మధ్య ఏవో విభేదాలు రావడంతో కొండయ్యగారు షాపుకి తాళం వేసేశారు. "అమ్మాయి దిగులు పడుతుందేమో, మీరు ఓదార్చండి" అంటూ దుర్వార్త చెప్పే డాక్టరు ధోరణిలో మావారికి విషయం తెలియచేసి, షాపు తెరిచే ప్రసక్తి లేదని కచ్చితంగా చెప్పారు. అయితే నేనేమీ కంగారు పడినట్లూ, దిగులు పడినట్లూ గుర్తు లేదు. ఎలా సర్దుబాటు చేసుకున్నారో తెలియదు కానీ ఒక నెల తర్వాత మళ్ళీ షాపు తెరిచి పుస్తకాలు అందించారు.

ఆవిష్కరణసభ 1997 జనవరిలో నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. తిరుమల అధ్యక్షులు. సి. నారాయణరెడ్డి ఆవిష్కర్త. చిల్లర భవానీదేవి, తేళ్ళ అరుణ పుస్తకం గురించి మాట్లాడారు. ఎందరో ప్రముఖ రచయితలు, బంధువులు, స్నేహితులతో హాలు క్రిక్కిరిసి పోయింది. సభలో అందరూ చిన్న వయసులోనే మంచి పుస్తకం తెచ్చానన్న అబ్బురాన్నీ, రచయితగానూ, జీవితంలోనూ కూడా చాలా ఉన్నత స్థితికి ఎదుగుతానన్న ఆకాంక్షనీ వ్యక్తం చేస్తూ మాట్లాడారు. ఆ తర్వాత ఆంధ్రప్రభలో విశ్వనాథ పావనిశాస్త్రి, వార్తలో నాగభైరవ కోటేశ్వరరావు చక్కని సమీక్షలు రాశారు. ఆంగ్లపత్రిక హిందూలో కూడా మంచి సమీక్ష వచ్చింది.

ముప్పై ఏళ్ళ తర్వాత అదంతా గుర్తు చేసుకుంటూ ఉంటే రెండు విషయాలు అర్థమవుతున్నాయి. ఒకటి ఆరోజున సాహితీవేత్తలూ బంధువులూ ఆశించిన విధంగా నేను ఎదగలేదు. వారు ఆకాంక్షించిన దిశలో నేను ప్రయాణించలేదు. అందరూ పెదవి విరిచే దారిలో ఒంటరిగా చాలా దూరం వచ్చేశాను. రెండు, అప్పటిది ఏ పరిస్థితినైనా అనుకూలంగా మార్చుకోగలనన్న దూకుడు. ఇప్పుడున్నది ఏ పరిస్థితి అయినా ఆనుకూల్యమే అనుకోగలిగిన నిలకడ.

తెలంగాణ పాట ట్రెండ్ మారింది!

పాటకు పర్యాయపదం తెలంగాణ. ఇక్కడ పాటే ప్రశ్న అయితది. చెమట చెలిమైతది. పాడి పంటైతది. మార్కెట్ మర్మం చెప్తది. ఏరులా నిరంతరం పారుతనే ఉంటది. పాల్కురికి ద్విపదగా వినబడి, అక్కమహాదేవి వచనమై, వీరబ్రహ్మంగారి పలుకై జాతి జనులకు వెలుగైతది. వేమన పద్యమై జీవన సారాన్ని కాచి వడబోస్తది. పండుగ సాయన్న చైతన్యపు భజన బృందగానమైతది. దున్న ఈద్దాసు అచలాన్ని అలుముకుంటది. ఈ పరంపర నుండి బండి యాదగిరి, వయ్యా రాజారాం, సుద్దాల హన్మంతు, ఉగ్రూతలూగించే నాజర్ బుర్రకథలో అందెల స్వరాల వెల్లువైతది. ఇట్లా తెలంగాణలో పాట ఒక్కో దశలో ఒక్కో పాత్రను పోషించింది.

పాటది తెలంగాణతో పేగుబంధం. తమ కష్టాలకు కారకులైన వారిపై మార్మిక సాహిత్యాన్ని బొడ్డెమ్మ, కోలాట పాట రూపంలో ప్రజలు అల్లుకున్నారు. ఆ తర్వాత 1940ల నాటికి దక్కన్ పీఠభూమిపై చాలా ఉద్యమాలు వచ్చాయి. ఆ సందర్భంలో పాట మరో రూపంలోకి మారింది. ఇందులో బుర్రకథలు, బాగోతాలు, సుద్దులు, భజన పాటలు, కోలాటం ఇట్లా చాలా రూపాల్లో తమ బాధలకు పరిష్కారం పాటల్లో చెప్పుకున్నారు. నేడు ఉన్నట్లుగా జ్ఞానపు సమాచారం నాటి వారికి అందుబాటులో లేదు. అయినా తమ జీవిత కోణం నుండే ప్రపంచాన్ని చూశారు. బతుకు కేంద్రంగానే పాటలు అల్లుకున్నారు. సరికొత్త బాణీలతో పాటలు అల్లుకున్నరు.

సామాజిక, రాజకీయార్థిక ప్రభావాలు పాటపై బలమైన ప్రభావాన్ని చూపించాయి. 1970ల నుండి కొత్త తరం కలాలు, గళాలు పుట్టుకొచ్చాయి. నాటి సమాజ క్లేశాన్ని నిలేసినవారే ఈ వరుసలో ఎక్కువున్నరు. బి. నర్సింగరావు, గూడ అంజన్న, ఆ తర్వాత గద్దర్, మాష్టార్జీ, గోరెటి వెంకన్న, మిత్ర, విమలక్క, సంధ్య, అందెశ్రీ, జయరాజు, సిద్దారెడ్డి, సుద్దాల అశోక్ తేజ, ఏపూరి సోమన్న, అరుణోదయ నాగన్న; రాసి, పాడి, ఆడిన వారిలో దేశపతి శ్రీనివాస్, రసమయి బాల్ కిషన్, అంతడ్పుల నాగరాజు, మధుప్రియ, నిసార్, అంబటి వెంకన్న, ఈ పరంరపరలోనే సాయిచంద్, మిట్టపల్లి సురేందర్, కోదారి శ్రీను, పైలం సంతోష్, వరంగల్ శ్రీనివాస్, దరువు ఎల్లన్న, దరువు అంజన్న, చింతల యాదగిరి, యశ్ పాల్... ఈ వరుస కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాటనే కోట్లాది ప్రజల గుండెలను తట్టి లేపింది. రాజకీయ నాయకుల మైకులు మౌనం దాల్చినప్పుడు పాటే పోరాట రూపమైంది. విస్మరణకు గురైన కళారూపాల గురించి, కళాకారుల గురించి, సాహితీ ప్రముఖుల గురించి కె. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సామిడి జగన్ రెడ్డి, జిలుకర శ్రీనివాస్ వంటి వారు కొంత రాశారు. పసునూరి రవీందర్ పాటపై ప్రామాణికమైన పరిశోధన చేసి, పాట లోతుపాతులపై ముందు తరాలకో అవగాహనను అందించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాట వాడి వేడిలో స్తబ్దత నెలకొన్న మాట వాస్తవం. కానీ నాడైనా, నేడైనా జానపదుల పాటల్లో పుష్కలంగా జీవిత రమణీయత, కమనీయత సూర్యోదయమంత అద్భుతంగా కొనసాగుతూనే ఉన్నది. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత తెలంగాణ పాట ఖండాంతరాలు దాటింది. సుమారు దశాబ్ద కాలంగా తెలంగాణ జానపదం సోషల్ మీడియాను షేక్ చేస్తున్నది. దేశంలోని అన్ని భాషల ప్రజలను తన వైపు తిప్పుకున్నది. ప్రపంచ సెలబ్రిటీలు సైతం "రాను ముంబైకి రాను...." పాటకు రీల్స్‌లో స్టెప్పులు వేయాల్సిందే. అంతే కాదు "సిన్ని సిన్ని సింతల్ల బావయ్యో..." అంటూ తెలంగాణ యాస లొలికించే స్వరానికి కోటానుకోట్లమంది చెవులప్పగించాల్సిందే. "బుల్లెట్టు బండెక్కి వచ్చేస్త పా...." పాట సృష్టించిన సంచలనం గురించి తెలుగు వారికి చెప్పాల్సిన పనే లేదు. మునుపటి కంటే కాస్త మెరుగైన జీవితానుభవం వల్లనే ఈ పాటలకు జనం నుండి ఇంత ఆదరణ ఉందనే భావన చాలా మందిలో ఉంది.

తెలంగాణ పాట కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటున్నది. ఒకప్పుడు తిండికిలేని పేదల ఇంటి చుట్టూ తిరిగింది. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం సాధనను లక్ష్యంగా చేసుకున్నది. ఇప్పుడు ట్రెండ్ మార్చి సోషల్ మీడియా ఆసరాగా ప్రపంచ ఖ్యాతిని అందుకుంటున్నది. నేటి పాటకు దిశ సరిగ్గా ఉందా లేదా అనే దాని కంటే, పాట సజీవంగా ఉందా లేదా అన్నది ముఖ్యం. నేటి తెలంగాణ పాటలో తెలంగాణ యాస, జీవనమార్గం బలంగా ఉన్నాయి.



2000 సంవత్సరం నాటి కల్లా దక్షిణ తెలంగాణా నుండి జంగిరెడ్డి, ఉత్తర తెలంగాణ నుండి విజయ, రమాదేవి, నెర్నేల కిషోర్ వంటి వారు తెలంగాణ ఉద్యమ పాటలతో పాటు జానపదాలను అందుకున్నారు. అప్పుడప్పుడే ప్రజలకు పరిచయం అవుతున్న కమ్యూనికేషన్ టెక్నాలజీ ద్వారా పాటను ప్రజలకు అందించే ప్రయత్నం చేశారు. మాట్ల తిరుపతి, మానుకోట ప్రసాద్, రాము రాథోడ్ వంటి వారు రాసిన జానపదాలకు కోట్ల సంఖ్యలో వ్యూస్ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు 20కోట్లమంది వరకు ఉండొచ్చు. కానీ ఒక్కో పాటకు వీక్షణలు 50 కోట్లకు పైబడే ఉన్నాయి. అంటే పాట కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటున్నది. ఒకప్పుడు తిండికిలేని పేదల ఇంటి చుట్టూ తిరిగింది. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం సాధనను లక్ష్యంగా చేసుకున్నది. ఇప్పుడు ట్రెండ్ మార్చి సోషల్ మీడియా ఆసరాగా ప్రపంచ ఖ్యాతిని అందుకుంటున్నది.

కొత్తతరం గాయనీగాయకులు, రచయితలు వస్తున్నారు. కనకవ్వ లాంటి ఎందరో యూట్యూబ్‌లోకి వచ్చారు. కోటానుకోట్లమంది హృదయాల్లో స్థానం సంపాదించుకుంటున్నారు. "తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పాట మార్కెట్‌కు అనుగుణంగా రుపాంతరం చెందింది. పాట గతి తప్పింది," అంటున్నవారు ఉన్నారు. కానీ నేటి పాటకు దిశ సరిగ్గా ఉందా లేదా అనే దాని కంటే, పాట సజీవంగా ఉందా లేదా అన్నది ముఖ్యం. నేటి తెలంగాణ పాటలో తెలంగాణ యాస, జీవనమార్గం బలంగా ఉన్నాయి. జానపద బాణీ భక్తిపాటల రూపంలో, జీవిత ప్రేమానురాగాల రూపంలో ముందు తరాలకు చేరుతున్నది.

■ గోర్ల బుచ్చన్న
✆ 87909 99116

మళ్లో మెలుకువ...

ఏదోగా ఉంటుంది
అంతా ఏమిటోగా ఉంటుంది
అర్ధరాత్రి
సముద్రాన్ని కప్పుకున్న ఒంటరి పడవ
ఆకాశాన్ని మోస్తున్న విమానం
జీవన సంధ్యలో
భూమిపైన మొలుస్తున్న చుక్కలు
ఒక కల నడుస్తున్నట్లే ఉంటుంది
ఏళ్ల తరబడి మౌనీకరించబడ్డ శబ్దం
అకస్మాత్తుగా పేలిపోతుంది
ఏదోగా ఉంటుంది
అంతా ఏమిటోగా ఉంటుంది
నిశ్శబ్దంగా
ఒంటరిగా
కుటీరంలో నివసిస్తున్న
ఏకాంత వాసికి
అర్ధరాత్రి ఎవరో దర్శనమిస్తారు

జీవన పోరాటంలో
అలసిపోయానని చెబుతున్నా వినక
ఇంకా పోరాటం చేయాల్సి ఉందని
ప్రబోధిస్తారు
అనుకోని అతిథికి
రెండు పద్యాలని వడ్డించి
మౌనంగా కూర్చుంటాను
కొంతకాలం గడుస్తుంది
కొన్ని యుగాలు వెనక్కి వెళ్తాయి
ఎక్కడో ఎప్పుడో దాచుకున్న
కొన్ని స్వప్నాలు
నిశ్శబ్దాన్ని చీల్చుకుని
బయటకు వస్తాయి
బాటసారి ఇంకొంచెం కవిత్వం
మధురసం తాగి
బయలుదేరుతాడు
మళ్లీ కళ్ళు తెరుస్తాను

వర్తమానపుటెండ నెగడు
తలకు చుట్టుకుంటుంది
తెగిపోయిన చెట్టుకొమ్మ
ఒకటి ఎగురుతూ వచ్చి
రక్తదాహపు ప్రభుత్వాలు
పడిపోతాయని రహస్యం చెబుతుంది
భూగర్భ కుహరాల్లో
అప మృత్యువుకు బలైపోయిన
దుఃఖిత ప్రాణవాయువులు
కొత్త పద్యాలై జీవం పోసుకుంటాయి.
ఎంత వృద్ధాప్యం వచ్చినా
నడవక తప్పదని తెలుస్తుంది
జీవితానికి కొత్త అర్థం
పురుడు పోసుకుంటుంది.

■ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
✆ 96760 96614





పరకాల బిడ్డకు ప్రతిష్ఠాత్మక అవార్డు


- కేసు దర్యాప్తులో ఐపీఎస్ శ్రవణ్ దత్ అసమాన ప్రతిభ
- అభినందించి అవార్డు అందజేసిన కేంద్ర ప్రభుత్వం

7

వరం'గన్'!

ఓరుగల్లులో రెచ్చిపోతున్న గన్ గ్యాంగ్

- భూపాలపల్లిలో హత్య కోసం సుపారీ
- శాయంపేటలో లారీ డ్రైవర్‌కు బెదిరింపులు
- ములుగులో పాన్‌షాపు వద్ద తుపాకీతో హల్‌చల్
- వరుస సంఘటనలతో ఉలిక్కిపడుతున్న ఉమ్మడి జిల్లా జనం
- హైదరాబాద్‌లో శాయంపేట పోలీసులకు చిక్కిన రౌడీషీటర్ సూరి
- బిహార్ నుంచే తుపాకులు సరఫరా అయినట్లుగా గుర్తింపు
- పోలీసుల నిఘా వైఫల్యంతో రెచ్చిపోతున్న రౌడీషీటర్లు



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లులో తుపాకులు హల్ చల్ చేస్తున్నాయి. హత్యలకు రౌడీలు సుపారీ తీసుకుంటున్నారు. గంజాయి తాగిన షైకంలో గన్‌తో బెదిరించి.. దాడులకు దిగుతున్నారు. రోడ్డుపై బహిరంగంగా గన్‌లతో రౌడీషీటర్లు బెదిరింపులకు దిగుతున్నారు. ఒక్కసారిగా గన్‌కల్చర్ తెరపైకి రావటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జిల్లా నెక్కొండ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సురేందర్ అలియాస్ సూరి హైదరాబాద్ నుంచి వరంగల్‌కు మకాం మార్చి.. తన గన్ గ్యాంగ్‌తో హత్యకు ప్లాన్ చేశారనే ప్రచారం కలకలం రేపింది. భూపాలపల్లి, ములుగు, శాయంపేటలో క్రిమినల్స్ చర్యలు ప్రజలు ఉలిక్కిపడేలా చేసింది. ఇప్పటికే పొలిటికల్ రౌడీలతో అవస్థలు పడుతున్న ప్రజలకు కొత్తగా క్రిమినల్స్ కూడా అడుగుపెట్టడంతో గన్ కల్చర్ పెరుగుతుందనే భయాందోళనలో ఉన్నారు. దీనిపై పోలీసుల నిఘా వైఫల్యం కనబడుతోందనే విమర్శలున్నాయి.

గన్ గ్యాంగ్ కలకలం

కొన్నాళ్లుగా రౌడీల హత్యలు.. గుండాల బెదిరింపులు లేకుండా ప్రశాంతంగా ఉన్న ఓరుగల్లులో గన్ గ్యాంగ్ కలకలం సృష్టించింది. ములుగు, శాయంపేట, భూపాలపల్లిలో గన్ గ్యాంగ్ చేసిన దాడులు పోలీసువర్గాల్లో కలకలం రేపాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. గన్‌గ్యాంగ్ బాగోతంపై ఆరా తీసి కంగుతిన్నాయి. వరంగల్ జిల్లా నెక్కొండ ప్రాంతానికి చెందిన సురేందర్ అలియాస్ సూరి అలియాస్ మునీర్ హైదరాబాద్ కేంద్రంగా నాలుగైదు ఉమ్మడి జిల్లాల్లో దందాలు సాగిస్తున్నారని తెలుస్తోంది. అయితే ఇటీవల సూరిపై రౌడీషీట్ ఓపెన్ చేయటంతో పాటు నగరం నుంచి పోలీసులు బహిష్కరించటంతో తన అనుచరులతో కలిసి హనుమకొండకు మకాం మార్చినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో ఇటీవల భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ యువకుడు మేడారంలో హత్యకు గురయ్యాడు. భూపాలపల్లికి చెందిన ఆరుగురికి ఈ హత్యతో సంబంధం ఉన్నట్లుగా పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్ట్ కూడా చేశారు. అయితే నిందితులపై ప్రతీకారం తీర్చుకునేందుకు హత్యకు గురైన వ్యక్తి బంధువు ఒకరు సూరి గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చినట్లుగా తేలింది. హనుమకొండ నగరంలో మకాం వేసిన సూరి గ్యాంగ్ గత నెల రెండో వారంలో భూపాలపల్లిలో రెక్కీ నిర్వహించాడు. నిందితులు జైలులో ఉన్నట్లు తెలియటంతో హత్యకు గురైన యువకుడి సమాధి వద్దకు వెళ్లి గన్‌తో కాల్పులు జరిపి హల్‌చల్ చేసినట్లుగా సమాచారం.

ఈ సంఘటన మరువక ముందే గత నెల 18వ తేదీన శాయంపేట మండలం మందారిపేట వద్ద ఈ రౌడీషీటర్ల ముఠా గంజాయి తాగిన షైకంలో వరంగల్ వైపు వస్తున్న లారీని ఆపి డ్రైవర్‌ను చితక్కొట్టారు. తుపాకీ గురిపెట్టి డ్రైవర్ నుంచి డబ్బులు గుంజుకున్నట్లుగా సమాచారం. ఈ విషయంపై శాయంపేట పోలీసుస్టేషన్‌లో డ్రైవర్ ఫిర్యాదు చేయటంతో ఈ గన్ గ్యాంగ్ ముఠా వ్యవహారం తెరపైకి వచ్చింది. దీంతో శాయంపేట పోలీసులు గన్ గ్యాంగ్ కోసం వేటాడుతున్న క్రమంలోనే ప్రధాన నిందితుడు సూరి హైదరాబాద్‌లో పోలీసులకు చిక్కారు. ఈ క్రమంలో శాయంపేట ఎస్సై పరమేశ్వర్‌పై రౌడీషీటర్ ఎదురుదాడికి ప్రయత్నించినట్లుగా సమాచారం. చాకచక్యంగా ఎస్సై తన సిబ్బందితో కలిసి సూరిని అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిసింది. నిందితుడితో పాటు

(మిగతా 7లో..)

ఓరుగల్లులో రౌడీషీటర్ తన గ్యాంగుతో మకాం వేసి, హత్యలకు సుపారీ తీసుకుని, బహిరంగంగా తిరుగుతుంటే.. నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే వరంగల్ నగరంలో చాలామంది చోటామోటా పొలిటికల్ రౌడీలు బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవలకాలంలో పోలీసులు రౌడీలపై నిఘా పెట్టి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ అక్కడక్కడ రౌడీషీటర్ల దందాలు సాగుతూనే ఉన్నాయి. రాజకీయ అండతో వారు రెచ్చిపోతున్నారు. భూతగాదాలు, కుటుంబ సమస్యలు, అప్పులు ఇతరత్రా

నిఘా వైఫల్యమేనా..?

వాటితో హత్యలు జరుగుతున్నప్పటికీ రౌడీలు సుపారీ తీసుకుని హత్యలు చేసిన సంఘటనలు ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్దగా లేవు. అయితే సూరి గ్యాంగ్ భూపాలపల్లి జిల్లాలో ఆరుగురి హత్యకు సుపారి తీసుకున్నారనే ప్రచారం కలకలం రేపుతోంది. భూపాలపల్లిలో హత్యకు గురైన యువకుడి సమాధి వద్ద తుపాకులు కాల్పులు జరిపినా పట్టించుకోలేదని, చింతగట్టు సమీపంలో ఎన్‌హెచ్ 163 రహదారిపై రౌడీషీటర్ గ్యాంగ్ బహిరంగంగా పార్టీలు చేసుకున్నా.. పసిగట్టలేకపోయారనే చర్చ జరుగుతోంది. మందారిపేట ఘటనపై డ్రైవర్ ఫిర్యాదు ఇచ్చే వరకు కూడా క్రిమినల్స్ నడవడికపై నిఘా వర్గాలు దృష్టి పెట్టలేకపోయాయా? అనే చర్చ జరుగుతోంది. ములుగులో బహిరంగంగా తుపాకీతో బెదిరించే వరకు గన్‌గ్యాంగ్ అగడాలు విస్తరించాయని.., వీటన్నింటినీ కూడా నిఘా వర్గాలు గుర్తించి పోలీసులను అలర్ట్ చేయలేకపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తానికి గన్ గ్యాంగ్ హల్‌చల్‌తో మరోసారి ఓరుగల్లులో గన్‌కల్చర్ తెరపైకి వచ్చిందనే చర్చ జరుగుతోంది.

వరద ప్రాంతాల్లో వ్యాధులను నివారించాలి..

- వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి..
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ సంచాలకుడు రవీంద్రనాయక్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రనాయక్

వరంగల్ మెడికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ ఆదేశించారు. ఆదివారం హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ ఎ.అప్పయ్య, డాక్టర్ బి.సాంబశివరావులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. అక్కడ తీసుకుంటున్న చర్యలు, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అమరావతినగర్, వడ్డెపల్లి ప్రాంతాల్లో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ డీఎంహెచ్‌ఓ కార్యాయలంలో డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలుషిత నీరు, ఆహార పదార్థాల వల్ల, దోమలవల్ల వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రోగ్రామ్ అధికారులు క్షేత్రస్థాయిలో గృహ సర్వే, వైద్య శిబిరాల నిర్వహణ పర్యవేక్షించాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇక్తధర్ అహ్మద్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ మంజుల, వి.అశోక్‌రెడ్డి, డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ కొమురయ్య, డాక్టర్ మోహన్‌సింగ్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ఉదయ్‌రాజ్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంత ప్రజలకు సహాయం అందిస్తాం..

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్‌తో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటన



రామన్నపేటలో పర్యటిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అన్ని విధాలా సహకారం అందిస్తామని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం వరద ప్రభావిత ప్రాంతాలలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌తో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎన్‌టీఆర్‌కాలనీ, రామన్నపేట, సంతోషిమాత కాలనీ ఫేజ్ -1, ఫేజ్ 2, గంగపుత్ర కాలనీ, డీఆర్‌నగర్, ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతాల్లో పర్యటించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. వరదల వల్ల నష్టపోయిన ఇండ్లను గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. వదతతో కూలిన కాలనీలలో రోడ్లపై నిలిచిన బురదను తొలగించాలన్నారు. 5 వరంగల్ 6 హనుమకొండలో జేసీబీలు బురదను శుభ్రం చేస్తున్నాయని అన్నారు. వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ సిబ్బంది నీట మునిగిన కాలనీలను క్షేత్రస్థాయిలో పర్యటించి పారదర్శకంగా వివరాలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు సరైన వసతులు కల్పించాలి..

- మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్ సత్యశారద
- కిచెన్‌లో అపరిశుభ్రతపై ఆగ్రహం
- ఇద్దరికి షోకాజ్ జారీ చేయాలని ఆదేశాలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

సంగెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బాలికల వసతి గృహంలో సరైన వసతులు కల్పించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద సూచించారు. ఆదివారం మండలంలోని గవిచర్ల గ్రామంలో గల మోడల్ స్కూలులోని బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలోని బాత్‌రూంలు, వంట గది, స్టోర్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్టోర్‌రూమ్‌లోని వంట సామగ్రి, కూరగాయలు, బియ్యం నిల్వలు, పాల శీతలీకరణ చేసుకోవాలని కోరారు. కూరగాయలు పుచ్చిపోయి ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహంలోని పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై సిబ్బంది పని తీరును దుయ్యబట్టారు. మీ ఇంటి పరిసరాలను ఇలాగే ఉంచుకుంటారా..? అంటూ ప్రశ్నించారు. వార్డెన్, హాస్టల్ ఇన్‌చార్జికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిప్యూటీ డైరెక్టర్ పుష్పలతకు ఆదేశించారు. అలాగే వసతి గృహం చెట్లతో నిండి ఉండడం, ఆదేవిధంగా చీమల పుట్ట ఉండటంతో తొలగించాలని చెప్పారు. బాత్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండకుండా నిత్యం శుభ్రపర్చాలని అన్నారు. పౌష్టికాహారాన్ని బాలికలకు అందించాలని, లేకుంటే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయిల్ వాడకాన్ని తగ్గించి వంటలు చేయాలని, బాలికల శారీరక ఎదుగుదలకు

(మిగతా 6లో..)

బహుజనులు ఏకమైతేనే రాజ్యాధికారం

- అరుణోదయ సాంస్కృతిక మండలి రథసారథి విమలక్క
- కొప్పులలో వైభవంగా వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహావిష్కరణ



కొప్పులలో చిట్యాల ఐలమ్మ విగ్రహావిష్కరణలో విమలక్క

శాయంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆదివాసీలు అంతా ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని అరుణోదయ సాంస్కృతిక మండలి రథసారథి విమలక్క అన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో ఆదివారం విమలక్క, విశ్రాంత కరీంనగర్ విద్యాశాఖ డైరక్టర్ కొల్లూరు మల్లేశం, విగ్రహ స్థల దాత వంగాల నారాయణరెడ్డిలతో కలిసి వీరనారి చిట్యాల ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కార్యక్రమ నిర్వాహకుడు, విగ్రహదాత కొప్పుల గ్రామానికి చెందిన వైనాల రాజేందర్(రాజు) అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో విమలక్క మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అంతమొందించి, కొందరికి అడవి సంపదను దోచిపెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రశ్నించేవారు ఉండకూడదని, ప్రశ్నిస్తే మట్టుబెడతామనే వ్యవస్థ వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా అందరం ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. బానిసత్వం నుంచి ముందుకొచ్చామని, నవసమాజం కావాలని ఆకాంక్షించారు. ఒక్కో సంవత్సరం ఒక్కో అంశంపై ముందుకువస్తున్నామని, ప్రకృతి రక్షణపై ప్రజలను చైతన్యం చేస్తున్నామని, ఈ క్రమంలోనే అడువుల రక్షణకు పూనుకున్నామన్నారు. తెలంగాణ అమవీరుల ఆశాయలకనుగుణంగానే పోరాడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగించాలంటూ, తన పాటలతో గ్రామస్తులను చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్, అసిస్టెంట్ డైరక్టర్ జువైనల్ హైదరాబాద్ అలువాల రాజేందర్, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కలెక్టరేట్లలో ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్‌లలో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు, నష్ట ప్రభావంపై ప్రాథమిక అంచనా కోసం సర్వే చేస్తున్న కారణంగా ప్రజావాణి కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు వారు తెలిపారు. రెండు జిల్లాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రజావాణికి రావొద్దని సూచించారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందన్నారు.

కార్పొరేషన్ ప్రజావాణి సైతం

వరంగల్ కార్పొరేషన్: ఇటీవల కురిసిన వర్షం కారణంగా నగరంలో శానిటేషన్ సమస్యల పునరుద్ధరణలో భాగంగా సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు గమనించి సోమవారం కార్యాలయానికి రాకూడదన్నారు. తిరిగి వచ్చే సోమవారం ప్రజావాణి నిర్వహిస్తామని కమిషనర్ వెల్లడించారు.

కన్నీటి పంట!

- అకాల వర్షాలతో చిత్తవుతున్న అన్నదాత
- మొంథా తుఫాన్‌తో చేతికొచ్చిన పంటలు నేలపాలు
- తీవ్రంగా నష్టపోయిన నాలుగు జిల్లాల రైతులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 97వేల ఎకరాలు నేలపాలు
- పంటల బీమా లేక నష్టాలతో బేజారు
- ప్రీమియం చెల్లించడంలో సర్కారు నిర్లక్ష్యం
- రూ.పది వేల పరిహారంపై రైతుల అసంతృప్తి



కొత్తగూడ మండలం పాగుళ్లపల్లిలో నీటిలో మునిగిన వరి

7

వాహనం బోల్తా - డ్రైవర్‌కు గాయాలు


పత్తి లోడుతో బోల్తా పడిన వాహనం ఇదే

వర్ధన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పత్తిలోడుతో వస్తున్న టాటా ఏస్ వాహనం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన ఆదివారం వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని డీసీ తండాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తొర్రూరు నుంచి పత్తి లోడుతో వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించడానికి వెళ్తున్న టాటా ఏస్ వాహనం డీసీ తండాకు చేరుకోగానే అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఊర చెరువు కట్టకు మరమ్మతులు పూర్తి

పూర్తి చేసిన నీటిపారుదల శాఖ అధికారులు


గోపాల్‌పూర్ ఊర చెరువు కట్టకు మరమ్మతులు చేసిన దృశ్యం

వడ్డెపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ మండలం గోపాల్‌పూర్ ఊర చెరువు కట్టకు అధికారులు మరమ్మతులు చేశారు. గత అక్టోబరు 29న తుఫాన్ కారణంగా కురిసిన భారీవర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి సామర్థ్యాన్ని మించి వరద నీరు చేరడంతో చెరువు కట్ట తెగిపోయింది. దీంతో వరద నీరు వివేక్‌నగర్, అమరావతి నగర్, సమ్మయ్య నగర్‌తో పాటు పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఈక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం మేరకు నీటి పారుదల శాఖ అధికారులు డీఈఈ కిరణ్‌కుమార్, డీఈ హర్షవర్ధన్, ఏఈ నజ్మాఖానం క్షేత్రస్థాయిలో గోపాల్‌పూర్ ఊర చెరువు మరమ్మతు పనులను పర్యవేక్షించారు. దీంతో ఆదివారం చెరువు మరమ్మతులు పనులు పూర్తయ్యాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లా
పద్మశాలి ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

వరంగల్ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. హంటర్‌రోడ్డులోని బీసీ నేత హాస్టల్‌లో ఈ ఎన్నిక నిర్వహించినట్లు ఎన్నికల అధికారి పిట్ట ఉమాదేవి తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా కోడం రవిప్రకాష్, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా కుసుమ సత్యనారాయణ, బొద్దున వెంకటేశ్వర్లు, కొండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా తాటి దామోదర్, చిదం లింగమూర్తి, వల్లాల మధుసూదన్, డాక్టర్ అర్చన క్రాంతి, ప్రధాన కార్యదర్శిగా గుర్రపు రాజమౌళి, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా కొండబత్తుల రాజమౌళి, సహాయ కార్యదర్శులుగా చింతకింద శ్రీనివాస్, సిరిపురం శేఖర్, డాక్టర్ వైద్యం విక్రమ్, ఆడెపు నాగరాజు, బింగి హేమలత, కోశాధికారిగా బుర్ర తిరుపతయ్య, ప్రచార కార్యదర్శిగా కోడూరి రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కుడికాల సత్యనారాయణ, గోరంటల అశోక్, మాచర్ల శివప్రసాద్, ముడతనపల్లి రమేష్, గోరంటల అనురాధ, కార్యాలయ కార్యదర్శిగా గుండు రవీందర్, కార్యవర్గ సభ్యులుగా గడ్డం రాజ్‌కుమార్, రామ దీపక్, వడ్నాల వెంకటస్వామి, పాశికంటి కనకరాజు, పోరండ్ల అనూష, బేతి రాజేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, దేవులపల్లి సాయిరాజ్, బింగి సురేష్ అభినందించారు.


నూతనంగా ఎన్నికైన పద్మశాలి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

మిర్చి పరిశోధన కేంద్రం జాడేది?

● కన్నారావుపేటలో శిలాఫలకానికే పరిమితం ● భారీ ఎత్తున నష్టపోతున్న వైనం ● ఆశతో ఎదురు చూస్తున్న అన్నదాతలు



దెబ్బతిన్న చపాట మిర్చి పంటను చూపిస్తున్న రైతు, పరిశోధన కేంద్రం శిలాఫలకం(ఫైల్)

నల్లబెల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కన్నారావుపేట శివారులోని సర్వే నెంబరు 58 పరిధిలో 54 ఎకరాల స్థలాన్ని సేకరించింది. 2023లో మిర్చి పరిశోధన కేంద్రం నిర్మించేందుకు శంకుస్థాపన కూడా చేశారు. శంకుస్థాపన చేసినా ఆయా మిర్చి పరిశోధన కేంద్రం చేసిన శిలాఫలకానికే పరిమితమైంది. ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న మిర్చి రైతులకు నిరాశే ఎదురయ్యేలా ఉంది. పెట్టుబడి ఎక్కువైనా మిర్చి పంటను రైతు అపురూపంగా సాగు చేస్తాడు. పంట బాగా పండితే రైతుకు కూడా లాభదాయకంగా ఉంటుంది. డివిజన్‌లో మిర్చి పంట బాగానే సాగవుతుంది. అయితే ప్రస్తుతం శంకుస్థాపన చేసిన స్థలంలో మట్టి దందా నడుస్తోంది. ఇష్టానుసారంగా ఎర్ర మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతుండటంతో భారీగా గోతులు కూడా ఏర్పడ్డాయి.

రైతులకు ప్రయోజనం జరుగుతుందిలా..?

మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటైతే, మిర్చి పంటకు ఏ సమస్య వచ్చిన శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండి పంటను పరిశీలించి రైతులకు తగిన సూచనలు తెలియజేస్తారు. ఈ ఏరియాల్లో ఎక్కువగా పండే మిర్చి చపాట, తేజ, సింగిల్‌పట్టి, వండర్‌హాట్ వంటి పంటల రకాలపై శాస్త్రవేత్తలు మరింతగా పరిశోధన చేయవచ్చు. అలాగే సొంతగా విత్తనాలను అభివృద్ధి చేసేందుకు పరిశోధన కేంద్రం ఉపయోగపడేంది. పంటకు ఎలాంటి తెగుళ్ల సోకినా నిపుణులైన శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండి తగిన సలహాలు, సూచనలు చేసేందుకు వీలుంటుంది. రైతుల మిర్చి పంటలకు ఎలాంటి నష్టం రాకుండా పరిశోధన కేంద్రం ఉపయోగపడేంది. గుంటూరులో మాదిరిగా ఎక్కడ ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనం జరుగుతుంది.

తెగుళ్లు సోకి తీవ్రంగా నష్టపోతున్నాం

నాగంపెల్లి కిరణ్‌కుమార్, రైతు, రేలకుంట గ్రామం



మిర్చి పంటకు తెగుళ్ల సోకి మిర్చి పంటను తీవ్రంగా నష్టపోతున్నాం. పెట్టుబడి ఎక్కువగా అయ్యే మిర్చి పంటకు తెగుళ్ల సోకి పంట పూర్తిగా దెబ్బతినడంతో పంటకు పెట్టిన పెట్టుబడి రాక రైతు అప్పుల పాలవుతున్నాడు. మనోవేదనతో కుంగిపోతున్నాడు. పంట తెగుళ్లకు సరైన సూచనలు ఇచ్చే అధికారులు ఉండడం లేరు. మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటు అయితే మిర్చి పంట తెగుళ్లకు సలహాలు, సూచనలు ఇచ్చే శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు. వెంటనే మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి. కోల్డ్ స్టోరేజీలు కూడా ఏర్పాటు చేసి మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు


జూడో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



జిమ్నాస్టిక్స్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

గెలుపే లక్ష్యంగా పోటీ పడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14, 17 ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ జూడో పోటీలు రెండవ రోజు క్రీడాకారులు మధ్య హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆదివారం జేఎన్ఎస్‌లోని జిమ్నాస్టిక్స్ హాల్, డీఎస్ఏ బాక్సింగ్‌హాల్‌లో అండర్- 14, 17 బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిమ్నాస్టిక్స్ జూడో పోటీల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పతకాల సాధన కోసం పోటీపడ్డారు. రెండురోజులుగా నిర్వహిస్తున్న జిమ్నాస్టిక్స్ జూడో పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ చెమటోడ్చుతున్నారు. అండర్-14, 17 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్‌లో టేబుల్‌వాల్ట్, ఆన్ ఈవెన్ బార్స్, ఫామెల్‌హార్స్, హారిజంటల్ బార్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, రోమన్‌రింగ్స్, బాలెన్సింగ్ బీమ్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 హనుమకొండ జిల్లా నిర్వహణ కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు. అదే విధంగా జూడోలో బాలబాలికల బరువులు ఆధారంగా పోటీలు నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు (టీజీపేట) శీలం పార్థసారధి, క్రీడా పోటీల కన్వీనర్లు సీహెచ్. పెద్దిరాజు, ఎం.సురేష్‌బాబు, వి.రాణి, కోచ్‌లు నీలం సురేష్, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్.సుభాష్, జి.రవీంద్రప్రసాద్, రెఫరీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో మోసపోయిన రైతులు


నాసిరకం విత్తన సంచులను చూపిస్తున్న డీసీ తండా రైతులు

వర్ధన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాసిరకం వరి విత్తనాలతో మోసపోయామని అన్నదాతలు ఆందోళనకు దిగిన ఘటన వర్ధన్నపేటలో చోటు చేసుకుంది. వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని డీసీ తండాకు చెందిన సుమారు పది మంది రైతులు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాప్‌లో విత్తనాలు కొనుగోలు చేశారు. పంట కోసే సమయానికి దిగుబడి రాకపోవడంతో రైతులు ఆందోళన బాట పట్టారు. గింజశాతం తక్కువ ఉండి తాలు శాతం ఎక్కువ ఉన్న విత్తనాల కారణంగా తాము నష్టపోయామని సదరు ఫర్టిలైజర్ యజమానితో వాగ్వాదానికి దిగారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని నమ్మించి ఓ పట్టణ కేంద్రానికి చెందిన ఓ ఎరువుల షాపు యాజమాని అంటగట్టి తమను నిండా ముంచారని రైతులు వాపోయారు. నష్టపోయిన తమను అటు అధికారులు పట్టించుకోక ఫర్టిలైజర్ నిర్వాహకులు దాటి వేసేందుకు ప్రయత్నం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలతో మోసపోయిన తమకు న్యాయం చేయడంతో పాటు రైతుల అమాయకత్వాన్ని అసరాగా చేసుకొని నకిలీ వితనాలు అంటగట్టిన ఫర్టిలైజర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

వరద బాధితులకు సరుకుల వితరణ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న లయన్స్ నాయకులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో అవసరార్థులను ఆదుకునే సంస్థే తమ లయన్స్ ఫౌండేషన్ అని, ఇటీవల ఓరుగల్లులో కురిసిన భారీ వర్షానికి అతలకుతలమైన బాధితులకు తమ లయన్స్ సంస్థ ద్వారా రూ.15లక్షల విలువజేసే నిత్యావసర సరుకులను అందజేసినట్లు 320 ఎఫ్ జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా చెప్పారు. ఎల్‌సీఐఎఫ్ తక్షణ సహాయంగా అందించిన నిధులతో వరద బాధిత ప్రాంతాల్లో నేరుగా బాధితులకు తమ సంస్థ ద్వారా వస్తువులను అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. వరంగల్‌లోని లెనిన్ నగర్, జక్కలొద్ది, తిమ్మాపురం, మరియాపురం, వడ్లకొండ, చౌటపల్లి, బొల్లికుంట, ఐనవోలు గ్రామాల్లో 450 కుటుంబాలకు, శివనగర్, సమ్మయ్యనగర్, మైసయ్యనగర్‌లో వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లతోపాటు బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఇంకా ములుగు జిల్లాలో 200 కుటుంబాలు, సమ్మయ్యనగర్‌లో 60 కుటుంబాలకు రూ.1500 విలువజేసే కిట్ బ్యాగులను అందించారు. జిల్లా ఉప గవర్నర్లు నరహరి సుధాకర్ రెడ్డి, హరికిషన్‌రెడ్డి, జిల్లా లయన్స్ సలహాదారు పొట్లపల్లి శ్రీనివాసరావుతో పాటు క్యాబినెట్ కార్యదర్శి రేణుకుంట్ల ప్రకాశం, చల్లా రఘునాథ్‌రెడ్డి, డాక్టర్ రాజేశ్వరి, మార్గం ప్రభాకర్, డాక్టర్ సురేశ్‌కుమార్, కటంగూరి రాంగోపాల్‌రెడ్డి, రేవూరి రమణారెడ్డి, డాక్టర్ దామోదరచారి, కానుగంటి సుభాష్, పద్మజాదేవి, వనజ, నిర్మల, రాఖీ కొలరియా పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు

పాలకుర్తిలో ఇద్దరికి గాయాలు

పాలకుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో ఇద్దరు తీవ్ర గాయాల పాలైన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. మండల కేంద్రానికి చెందిన చిదురాల నర్సయ్య, విజయ దంపతులు. ఉదయం విజయ ఇడ్లీ చేసి గ్యాస్‌ను ఆఫ్ చేసింది. వంట గది నుంచి గ్యాస్ లీకై వాసన వస్తుండడంతో రెగ్యులేటర్‌ను ఎంత ఆపేందుకు ప్రయత్నం చేసినా లీకేజీ ఆగలేదు. వంట గదిలో పక్కనే ఉన్న దేవుడి వద్ద దీపం వెలిగించగా, ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలతోనే సిలిండర్ ను బయటికి తీసుకొచ్చి విసిరేశాడు. మంటలు చెలరేగిన క్రమంలో నర్సయ్యతోపాటు ఇంటిలో ఉన్న బంధువు బాలిక రిషికకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం స్థానికులు మంటలను ఆర్పేశారు. గాయపడిన నర్సయ్య, రిషికను పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అనంతరం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రిషికకు ఇంటికి తీసుకురాగా, తీవ్రంగా గాయపడిన నర్సయ్య ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడుతాం..


సంఘీభావం తెలుపుతున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సాధనకు యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి అన్నారు. ఆదివారం హనుమకొండలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతి మాట్లాడుతూ.. సోమవారం నుంచి ప్రైవేటు కళాశాలలు చేపట్టిన బంద్‌కు సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందన్నారు. రూ.7,200కోట్ల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నాయన్నారు. అనంతరం వివిధ సంఘాల నుంచి యూఎస్ఎఫ్ఐలో చేరిన నాయకులను కండువా కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు, యూఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్‌నాయక్, మనోజ్, రాకేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ● ధర్మసాగర్ రిజర్వాయర్, వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్ పరిశీలన


వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీ చేస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర ప్రజలకు అందించే మంచినీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి కోరారు. ఆదివారం వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌తోపాటు ధర్మసాగర్ రిజర్వాయర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ పనిచేసే అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తాగునీరు రంగు మారి వస్తోందని నగరంలోని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. భారీ వర్షాలవల్ల ఎగువన ఉన్న మురికినీరు పైపులలో చేరి నీరు రంగు మారి వస్తోందని, ఇకపై ఈ సమస్య రాకుండా చూడాలన్నారు. నీరు కలుషితం కాకుండా సిబ్బంది పనిచేయాలన్నారు. తర్వాత హనుమకొండలోని వివేక్‌నగర్, సమ్మయ్యనగర్, అమరావతి నగర్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో దోమల నివారణకు మందును పిచికారి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఈలు రాజ్‌కుమార్, సారంగం, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు సరైన వసతులు కల్పించాలి..

(5వ పేజీ తరువాయి)

పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ ప్రకారం భోజనాన్ని బాలికలకు అందించాలని ఆదేశించారు. వసతి గృహంలోని బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలను వెచ్చిస్తుందని, వాటి వినియోగంపై బాలికలందరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వసతి గృహంలోని సమస్యలను నేరుగా కానీ, ఫిర్యాదులను ఫిర్యాదుల పెట్టెలో వేయాలని సూచించారు. భోజనం వడ్డించే విషయంలో విద్యార్థులతో కమిటీ వేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి పుష్పలత, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో కాసర్ల రవీందర్‌లు పాల్గొన్నారు.

నదీనాలాను పరిశీలించిన కలెక్టర్


కాకతీయ టెక్స్‌టైల్‌పార్కులో నదీనాలను, రాళ్లమాటు కుంటను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

గీసుగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాయంపేట హవేలిలో గల కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని నదీనాలాను కలెక్టర్ సత్యశారద ఆదివారం పరిశీలించారు. ఇటీవల మొంథా తుఫాన్‌తో వరద ఉధృతి పెరిగి నదీనాలా ఉప్పొంగి పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. నదీనాలాకు దిగువున గల కైటెక్స్ కంపెనీ గతంలో ముంపునకు గురై కంపెనీ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కాగా, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కు సందర్శనకు వచ్చిన సందర్భంగా ఆయన దృష్టికి అధికారులు, కంపెనీ ప్రతినిధులు తీసుకువచ్చారు. పార్కులో డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగా లేదని తెలపడంతో నదీనాలాను పటిష్టంగా నిర్మాణం చేపట్టాలని సీఎం అప్పటికపుడు ఆదేశించారు. దీంతో నదీనాలా నిర్మాణ పనులు చేపట్టారు. అయితే కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సంగెం మండలంలోని బొల్లికుంట, కోట వెంకటాపూర్ పలు గ్రామాల నుంచి వచ్చే వరద నీరు, శాయంపేట, వంచనగిరి తదితర గ్రామాల నుంచి కూడా వర్షం నీరు పెద్దఎత్తున ఈ నదీనాలా నుంచి రాళ్లమాటు చెరువు మీదుగా ప్రవహించి ఎల్గూరు రంగంపేట చెరవులోకి చేరుకుంది. కాగా, ఈ వరద నీటి ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించారు. త్వరగా నిర్మాణ పనులు చేపట్టి వరద నీరు సాఫీగా నదీనాల నుంచి పోయే విధంగా పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆమె సూచించారు. పార్కు పక్కగా ఉన్న కాకతీయ కెనాల్ అండర్ టన్నెల్ (యూటీ) ద్వారా వచ్చే వరద నీరును కూడా కలెక్టర్ పరిశీలించారు. పార్కులో తుఫాన్ వల్ల రోడ్ల ధ్వంసం తదితర నష్టంపై పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆమె చెప్పారు. కలెక్టర్ వెంట గీసుగొండ, సంగెం తహసీల్దార్‌లు రియాజుద్దిన్, రాజ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ సునీత, ఆర్‌అండ్‌బీ డీఈ వేణు ఉన్నారు.

నీటి తొట్టిలో పడి వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఇదే

సంగెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోహిత గ్రామంలో నీటి తొట్టిలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. లోహిత గ్రామానికి సైకిల్‌పై వచ్చిన గుర్తు తెలియని వృద్ధుడు (65) గామంలోని చావడి వద్దకు చేరుకోగానే అదుపుతప్పి నీటి తొట్టిలో పడిపోయాడు. గ్రామస్థులు పడిపోయిన వృద్ధుడిని పరిశీలించగా మృతి చెందినట్లు భావించి సంగెం ఎస్సై వంశీకృష్ణకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తొట్టిలో నుంచి తీసి ఒడ్డున చేర్చారు. మృతదేహాన్ని గుర్తు పట్టేందుకు లోహిత గ్రామ పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో వాట్సాప్‌ల ద్వారా ప్రచారం చేశారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు ఎస్సై వివరించారు.

వరం'గన్'!

(5వ పేజీ తరువాయి)

గన్ స్వాధీనం చేసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

మరోవైపు ములుగు జిల్లా కేంద్రంలో మూడు రోజుల కిందట కలెక్టరేట్ సమీపంలోని ఓ పాన్ షాపు వద్ద గన్‌తో బెదిరిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి గన్ స్వాధీనంతో పాటు ములుగు మండలానికి చెందిన వారిగా గుర్తించారు. వీరికి రౌడీషీటర్ సూరితో సంబంధాలు ఉన్నట్లుగా గుర్తించి విచారణ చేపట్టారు. శాయంపేట, ములుగు సంఘటనల్లో వరంగల్, ములుగు పోలీసులువిచారణ చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎక్కడెక్కడ ఎలాంటి దందాలు చేశారు..? ఎవరెవరు ఇంకేమైన హత్యలకు సుపారీలు ఇచ్చారా? అనే కోణంలో విచారిస్తున్నారు.

అవి.. బిహార్ తుపాకులే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా రోజులకు తుపాకుల కలకలం రేగింది. గన్ గ్యాంగ్‌కు ఎక్కడి నుంచి తుపాకులు వస్తున్నాయో పోలీసులు విచారణ తేలింది. బిహార్ నుంచి గన్ గ్యాంగ్‌కు తుపాకులు సరఫరా అవుతున్నట్లుగా గుర్తించారు. పోలీసులు అదుపులో ఉన్న నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు తుపాకులు సరఫరా చేస్తున్న వారిని కూడా పోలీసులు గుర్తించినట్లుగా సమాచారం. తుపాకులు సరఫరా చేస్తున్న వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బిహార్‌లో ఎక్కడి నుంచి ఏ రూట్లో తుపాకులు తీసుకువస్తున్నారో విచారిస్తున్నారు. సూరి గ్యాంగుకే తుపాకులు ఇచ్చారా..? ఇంకా ఎవరెవరికి బిహార్ నుంచి తుపాకులు విక్రయించారో ఆరా తీస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, కామారెడ్డి, మెదక్ తదితర జిల్లాల్లో తుపాకులు మోత మోగాయి. విచ్చలవిడిగా బిహార్ రాష్ట్రం నుంచి తుపాకులు తెలంగాణకు సరఫరా అవుతున్నాయని నిఘా వర్గాలు గుర్తించాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంకా ఎవరి చేతిలోకి బిహార్ తుపాకులు వెళ్లాయో..? అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

తిరుమలగిరిలో ఆధ్యాత్మిక శోభ

- బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న బుగులోని వెంకటేశ్వర స్వామి
- రేపటి నుంచి జాతర ప్రారంభం
- రెండో తిరుపతిగా ప్రసిద్ధి చెందుతున్న పుణ్యక్షేత్రం
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం





తిరుమలగిరి శివారులోని పాండవుల గుట్టలు, ఉత్సవ విగ్రహాలు

రేగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండో తిరుపతిగా ప్రసిద్ధి చెందింది తిరుమలగిరి పుణ్యక్షేత్రం. చుట్టూ రాతి కొండలు, పచ్చని ప్రకృతి అందాల నడుమ కొలువైన బుగులోని వెంకటేశ్వర స్వామి అశేష భక్తజనుల పూజలు అందుకుంటున్నాడు. ఏటా కార్తీక మాసంలో ఇక్కడ ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు ఇక్కడ జాతర జరగనుంది.

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులో వేల ఏళ్ల కిందట ముక్కుడి గుడి గడ్డ ప్రాంతంలో స్వామి వారు పూజలు అందుకున్నట్టు స్థానికులు చెబుతారు. రెండేళ్ల క్రితం వరకు ఇక్కడ శిథిలమైన ఆలయం ఉంది. గ్రామంలో మహిళలు బియ్యం దంచుతుండగా రోకల్లు, చాటల శబ్దాలకు స్వామివారు గుట్టపైన ఉన్న గుహలో దాక్కున్నారని గ్రామస్థులు చెబుతుంటారు. గుహలో లోతుగా ఉన్న సందులో రాతిబండకు స్వామి వారు స్వయంభూగా ఏర్పడ్డారని భక్తులు నమ్ముతుంటారు. లోతుగా ఉండే ప్రాంతాన్ని ప్రాచీన భాషలో బుగులు అని పిలుస్తారు. అందుకే.. స్వామి వారు బుగులోని వెంకటేశ్వరుడిగా ప్రసిద్ధి చెందారు.

పర్యాటకులను ఆకర్షించే ప్రకృతి సౌందర్యం

బుగులోని వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలకు వచ్చే భక్తులను అక్కడి ప్రకృతి సౌందర్యం ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. చుట్టూ ఎటు చూసినా ఎత్తైన



స్వామి వారి స్వాగత తోరణం

కొండలు, పచ్చని చెట్లు, పక్షుల కిలకిలరావాలు మానసిక ఆహ్లాదాన్నిస్తాయి. నిత్యం యాంత్రిక జీవనంలో మునిగిపోయేవారు ఇక్కడికి వచ్చి ఎంతో ఉల్లాసంగా గడుపుతారు. బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరకు ఆనుకుని దేశంలో జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందిన పాండవుల గుట్టలు ఉంటాయి. జాతరకు వచ్చిన భక్తులు పాండవుల గుట్టలపై ట్రెక్కింగ్ చేసి రాతికొండల రమణీయతను ఆస్వాదిస్తారు. అక్కడ ఉన్న పురాతన రాతి చిత్రాలు కూడా వీక్షిస్తారు. హిమాలయాల కంటే పూర్వం ఏర్పడ్డ అరుదైన శిలాతోరణం కూడా పాండవుల గుట్టల్లో ఉన్న అరుదైన సంపదను చూడొచ్చు.

4 నుంచి 8 వరకు జాతర

కార్తీక మాసంలో నవంబరు 4న బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 8న ముగుస్తాయి. 4వ తేదీన స్వామి వారిని తిరుమలగిరి నుంచి గుట్టవద్దకు ఊరేగింపుగా తీసుకొస్తారు. 5న నిత్య పూజలు, 6న ఏనుగు, గుర్రం వాహనాలఊరేగింపు, 7న నిత్య పూజలు, మొక్కుబడులు, 8న నిత్యపూజలు, మొక్కుబడులు ఉంటాయి. అనంతరం సాయంత్రం స్వామి వారిని తిరుమలగికి ఊరేగింపుగా తీసుకొస్తారు.

భక్తులకు సకల సౌకర్యాలు

బుగులోని వెంకటేశ్వరసామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రూ.7.90 కోట్లు కేటాయించారు. ఎన్నడూలేని విధంగా జగ్గయ్యపేట, తిరుమలగిరి గ్రామాల నుంచి బుగులోని జాతరకు, అలాగే పాండవుల గుట్టల నుంచి బుగులోని జాతర వరకు రూ.5 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రూ.2 కోట్లతో మెట్ల వెడల్పు, ఆర్‌వోఆర్ వాటర్‌ప్లాంటు, కోనేరు, బావిని ఏర్పాటు చేశారు. రూ.90 లక్షలతో సెంట్రల్ లైటింగ్, కల్యాణ కట్ట, కల్యాణ మండపం, మరుగుదొడ్లను నిర్మించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిధులు మంజూరు చేసి శాశ్వత ఏర్పాట్లు చేశారు.

స్వామి వారి ఆశీస్సులు పొందాలి

– గంగుల రమణారెడ్డి, బుగులోని జాతర చైర్మన్



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో ఇప్పటి వరకూ ఏ ఎమ్మెల్యే చేయని విధంగా బుగులోని వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక్కడికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధ్యాత్మిక అనుభూతి, ప్రకృతిలో పరవశించి ఆనందం పొందేలా సౌకర్యాలు సమకూర్చాం. ప్రతి ఒక్కరూ వచ్చి స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరుతున్నాం.

ఎస్‌జీఎఫ్‌ఐ పోటీల్లో గందరగోళం

- సరైన వసతులు లేక ఇబ్బందుల్లో క్రీడాకారులు
- జూడో మ్యాట్లకు బదులు కబడ్డీ మ్యాట్ల ఏర్పాటు
- పోటీల్లో గాయపడ్డ అండర్-17 జూడో క్రీడాకారిణి కారుణ్య

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్-14, 17 ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్‌ఎస్‌తోపాటు డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాలబాలికల జిమ్నాస్టిక్స్, జూడో పోటీల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆదివారం డీఎస్‌ఏ బాక్సింగ్‌హాల్లో రెండో రోజు జరిగిన జూడో పోటీలను తూతూమాత్రంగా నిర్వహించారని క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్‌లు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులకు భోజన, బస, ఇతర సౌకర్యాలను కల్పించాల్సిన నిర్వాహకులు ఆ దిశగా ఏర్పాట్లను చేయలేదంటూ వివిధ జిల్లాలకు చెందిన క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. నామమాత్రపు మ్యాట్లు, కబడ్డీ మ్యాట్లను ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తున్నారు. దీంతో నల్లగొండ జిల్లాకుచెందిన అండర్-17జూడో క్రీడాకారిణి కారుణ్య జూడో పోటీల్లో తలపడే సమయంలో కిందపడిపోవడంతో ఎడమ చెయ్యికి బలమైన గాయమైంది. దీంతో ఆక్రీడాకారిణిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తమ బంధువులు తీసుకెళ్లి చికిత్స అందించారు. ఎస్‌జీఎఫ్‌ఐ నిర్వాహకులు నిర్లక్ష్యం కారణంగా క్రీడాకారిణి ఆస్పత్రి పాలు కావాల్సి వచ్చిందని నల్లగొండ జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి, జిల్లా బాలుర జూడో టీం కోచ్ షేక్ పర్వేజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌జీఎఫ్‌ఐ నియమ నిబంధనల ప్రకారం కొన్ని నెలల ముందే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహణ కోసం తేదీలను రూపొందిస్తూ స్పోర్ట్స్ క్యాలెండర్‌ను విడుదల చేస్తారు. దీంతో వివిధ జిల్లాలకు చెందిన ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శులు జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. కాగా, హనుమకొండ జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ-14,17 క్రీడా పోటీల కార్యదర్శి స్పోర్ట్స్ క్యాలెండర్ తేదీలను పరగణలోకి తీసుకోకుండా వివిధ క్రీడా సంఘాల బాధ్యులకు సమన్వయం, సమాచారం లేకుండానే అరకొర వసతులతో పోటీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో తాగునీరు లేక ఖాళీ నీళ్ల క్యాన్లతో క్రీడాకారులు

మేడారంలో సందడి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



పార్కింగ్ స్థలాలను చదును చేస్తున్న దోజర్

వనదేవతలకు భక్తుల మొక్కులు

తాడ్వాయి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకొని సమ్మక్క-సారలమ్మల నామస్మరణలతో గద్దెలకు చేరుకున్నారు. ఎత్తు బంగారం (బెల్లం), కొబ్బరికాయలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 10వేల మందికి పైగా భక్తులు తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

గద్దెల దర్శనం దారి మళ్లింపు

మేడారం వనదేవతల దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ముఖ ద్వారాలను తొలగించారు. ఈ క్రమంలో ప్రతి రోజూ వస్తున్న భక్తులకు దర్శన సౌకర్యార్థం అధికారులు దేవస్థానం వెనుకాల నుంచి దారి మళ్లించారు. దీంతో పలువురు భక్తులు దారి తెలియక అయోమయానికి గురయ్యారు. వారిని, వీరిని అడుగుతూ ముందుకు సాగారు. దారి మళ్లించినప్పుడు సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తే తమకు సౌకర్యంగా ఉండేదని భక్తులు అంటున్నారు.

పోలీస్ పార్కింగ్ స్థలాల ఏర్పాటు

మేడారం ప్రీ జాతరకు ముందుగానే వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలగకండా పోలీస్ అధికారులు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. జంపన్నవాగు నుంచి గద్దెల సమీపం వరకు 1500 వాహనాలు నిలిచేలా పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానంలో పునరుద్ధరణ పనులు కొనసాగుతుడటంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

ఆధునిక పద్ధతిలో బావుల పూడికతీత

మహా జాతరకు భక్తుల సౌకర్యాల ఏర్పాటులో భాగంగా జంపన్న వాగులో ఉన్న ఇన్ఫిల్ట్రేషన్ బావుల పూడికతీతను అధికారులు ప్రారంభించారు. గత జాతరలో విధంగా కాకుండా ఆధునిక పద్ధతిలో పూడికతీత మోటార్లను వినియోగిస్తున్నారు. కార్మికులు నీటిలో మునిగి ఇసుకను తీయకుండా ఈ మోటార్లతో నీటితో పాటు ఇసుకను బయటకు తొలగిస్తున్నారు.

పరకాల బిడ్డకు ప్రతిష్ఠాత్మక అవార్డు

- కేసు దర్యాప్తులో ఐపీఎస్ శ్రవణ్ దత్ అసమాన ప్రతిభ
- అభినందించి అవార్డు అందజేసిన కేంద్ర ప్రభుత్వం



పరకాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నందూరు బార్ జిల్లా ఎస్పీగా పని చేస్తున్న శ్రవణ్ దత్‌కు కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. 2025 సంవత్సరానికి ఉత్తమ దర్యాప్తు విభాగంలో కేంద్ర గృహ మంత్రి దక్షత పతకాన్ని న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల పట్టణానికి చెందిన సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రవణ్ దత్.. తొలుత ఆరున్నర ఏళ్లపాటు ఐటీ రంగంలో పనిచేశారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో రెండేళ్లు పనిచేసి ఉద్యోగం వదులుకొని సివిల్స్ రాశారు. 2015లో సివిల్స్ విజేతగా నిలిచి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2016 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి శ్రవణ్ దత్ సివిల్స్‌కు ఎంపికైన తరువాత మహారాష్ట్ర కేడర్‌లో పర్భణి జిల్లా జింతూరులో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరి ఒక క్లిష్టమైన నేరకుట్ర, హత్య కేసును అత్యంత నైపుణ్యంతో దర్యాప్తు చేసినందుకు గాను అవార్డుకు ఎంపికయ్యారు.

2021, మే నెలలో రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించినట్లు కేసు నమోదు అయింది. ఇదే కేసు అదే ఏడాది జూలై నెలలో శ్రవణ్ దత్‌కు విచారణకు వచ్చింది. ఫోరెన్సిక్, డిజిటల్, భౌతిక ఆధారాల సమగ్ర విశ్లేషణ ద్వారా నేరకుట్ర, హత్య అని నిర్ధారించారు. దీనిపై ఐపీసీ 302, 120బీ సెక్షన్లు చేర్చి మూడు వారాల్లోనే నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. 70 రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును బాంబే హైకోర్టు (ఔరంగబాద్ బెంచ్) పర్యవేక్షణలో విచారణకు వెళ్లింది. 2024లో నలుగురు నిందితులను హత్య, నేరకుట్ర నేరాల కింద రెండు జీవితఖైదు శిక్షలకు దోషులుగా పర్భణి సెషన్స్ కోర్టు తేల్చింది. అప్పటి ఏసీపీ శ్రవణ్ దత్ దర్యాప్తును ప్రత్యేకంగా ప్రశంసించింది. సంఘటనల గొలుసును శాస్త్రీయంగా పునర్నిర్మించిన విధానాన్ని అభినందించింది. ఇలాంటి అసాధారణ దర్యాప్తు నైపుణ్యం, కర్తవ్య నిష్ఠ, వృత్తి ప్రావీణ్యానికి గుర్తింపుగా అవార్డు దక్కింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాల పట్టణానికి చెందిన సోద శ్రవణ్ దత్‌కు కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కం పట్ల కుటుంబీకులు, చిన్ననాటి స్నేహితులు, పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డీఆర్‌డీవో ఆదేశాలు బేఖాతరు

- వీవోఏలను తొలగించాలనే తీర్మానంపై నిర్లక్ష్యం
- ఏపీఎం, వీవోలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

శాయంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కాట్రపల్లి, శాయంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గత రబీ సీజన్‌లో రూ.కోట్లలో అక్రమాలు జరిగాయి. దీంతో నిందితులపై శాయంపేట పీఎస్‌లో కేసు నమోదైన విషయం విదితమే. అనంతరం శాఖాపరమైన చర్యల్లో భాగంగా శాయంపేట, కాట్రపల్లి గ్రామాల సెంటర్ ఇన్‌చార్జులైన వసుంధర గ్రామైఖ్య సంఘం వీవోఏ బలభద్ర హైమావతి, జ్యోతి గ్రామైక్య సంఘం వీవోఏ అల్లె అనితలను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను గత అక్టోబరు 18న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సంబంధిత వీవోఏల వద్ద పుస్తకాలు స్వాధీనపరుచుకుని, వీవో పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వీవోఏలను తొలగిస్తూ చేసిన తీర్మానాలను వెంటనే జిల్లా కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

ఈ ఆదేశాలు మంజూరు చేసి 15 రోజులు గడిచినా ఇప్పటికీ అక్రమాలు చేసిన వీవోఏలను తొలగిస్తూ తీర్మానాలు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్‌డీవో ఉత్తర్వులు జారీ చేసినా పట్టింపు లేకుండా ఉన్నారని మండలంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


కన్నీటి పంట!

- అకాల వర్షాలతో చిత్తవుతున్న అన్నదాత
- మొంథా తుఫాన్‌తో చేతికొచ్చిన పంటలు నేలపాలు
- తీవ్రంగా నష్టపోయిన నాలుగు జిల్లాల రైతులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 97వేల ఎకరాల్లో నష్టం

హనుమకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో పంటలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రధానంగా చేతికొచ్చిన పంటలు నేలపాలయ్యాయి. చేతికాడికి వచ్చిన బువ్వ నోటికి అందకుండా పోయింది. ప్రాథమిక అంచనాల ప్రకారం వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో 1,23,045 ఎకరాల మేర పంట నష్టం జరిగింది. ఇందులో అత్యధికంగా దెబ్బతిన్నది వరి పంటనే. 86,131 ఎకరాల వరి పంట చేతికి రాకుండా పోయింది. 24,609 ఎకరాల్లో పత్తి ధ్వంసం అయింది. 12,304 ఎకరాల మొక్కజొన్న ఇతర పంటలు అక్కరకురాకుండా పోయాయి. వరంగల్ జిల్లాలో 35,000 ఎకరాలు, హనుమకొండ జిల్లాలో 35,000 ఎకరాలు, జనగామ జిల్లాలో 25,816 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 26,029 ఎకరాల మేర పంట నష్టమైంది. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో తుఫాన్ ప్రభావం తక్కువగా ఉండడంతో ఇక్కడ పెద్దగా పంట నష్టం జరగలేదు. ములుగు జిల్లాలో 600 ఎకరాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 600 ఎకరాల వరకు పంటలకు నష్టం జరిగింది.

రూ.10వేలు ఏ మూలకు..

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు తీవ్ర నష్టం జరిగినప్పుడు అన్నదాతలను ఆదుకునేది పంటల బీమా మాత్రమే. దీనిని అమలు చేయడంలో రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10,000 చెల్లించనున్నట్టు ఇటీవల వరంగల్ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ సాయం ఏమూలకు సరిపోతుందని రైతులు వాపోతున్నారు. పంటల సాగుకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఇతర సస్యరక్షణ చర్యలపైన రైతులు ఎకరానికి రూ.20 నుంచి రూ.30వేల వరకు ఖర్చు చేశారు. యూరియా దొరక్క ఆగచాట్లు పడ్డారు. వ్యవసాయ పనుల కోసం రైతులు ఒళ్లంతా హూనం చేసుకున్నారు. అయినా ఫలితం దక్కలేదు. పంటలకు నష్టం జరిగినప్పుడల్లా ఎకరాకు రూ.10,000 విదిల్చడం ప్రభుత్వానికి పరిపాటి అయింది.



మహబూబాబాద్ జిల్లా గార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు (ఫైల్)





చెన్నారావుపేట మండల కేంద్రంలో నీట మునిగిన పత్తి పంట, ఎల్కతుర్తి మండలంలో వరి పొలాల పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు

పంటల బీమా ఏదీ?

వాతావరణ ఆధారిత బీమా పథకాని దేశ వ్యాప్తంగా పాడి, మత్స్య రంగాలకు వర్తింపజేయాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మన రాష్ట్రంలో 2020 నుంచి ఫసల్ బీమానే అమలు కావడం లేదు. తాము అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని అమలు చేస్తామని గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇవ్వగా.. నాలుగు సీజన్లు గడిచినా ఇప్పటివరకు అమలులోకి రాలేదు. గతంలో బీమా కంపెనీకి రైతులు 50 శాతం, కేంద్రం 25శాతం, రాష్ట్రం 25శాతం చొప్పున ప్రీమియం చెల్లించేవి. కాగా, మొత్తం ప్రీమియం రైతుల పక్షాన ప్రభుత్వమే భరిస్తుందని హామీలో పేర్కొన్నారు. ఆ హామీని అమలు చేస్తేనే ఇలాంటి సమయంలో ఊరట కలుగుతుంది.

అందని పరిహారం

గతంలో రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో ఉమ్మడి జిల్లాలో 9 పంటలకు బీమా అమలైన ఉదంతాలున్నాయి. 2020 వరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా ద్వారా వరి, మొక్కజొన్న, వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, వాతావరణ ఆధారిత బీమా ద్వారా మామిడి, వానాకాలంలో పత్తి, మిరపకు కూడా బీమా భరోసా ఉండేది. కొన్ని సీజన్లుగా బీమా పథకం అమలు చేయకపోవడం వల్ల ఈదురుగాలులు, అకాల వర్షాలు, వరదలు, వడగళ్లు, ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు తదితర ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు ఆసరాకరువైంది. పంటలుదెబ్బతిన్నప్పుడు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుండగా.. అరకొర వివరాల నమోదు, నష్టం 33 శాతం దాటిన పంటలకే వర్తింపజేయడంతో సాయం అందడం లేదు. 2023 వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 50వేల ఎకరాల్లో పంట నష్టపోతే కేవలం 1082 ఎకరాలకు మాత్రమే పరిహారం అందడం చూస్తే రైతులకు ఏమాత్రం సహాయం అందుతున్నదో అర్థమవుతుంది. గతంలో మండలం, జిల్లా యూనిట్‌గా పంటల బీమా అమలు చేయకగా సరైన పరిహారం అందలేదు. న్యాయంగా సాయం అందాలంటే రైతువారీగా లేదా కమతం, సర్వే నెంబర్ల వారీగా బీమా పథకం అమలు చేయాల్సి ఉంది. ఈయాసంగిలో పంటల బీమాను అమలు చేయాలంటే డిసెంబర్ 15లోగా నోటిఫికేషన్ వెలువరించాల్సి ఉంటుంది. పంటలకే కాకుండా కుటుంబసభ్యులకు రూ.2లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం సంభవిస్తే రూ.1.25 లక్షల పరిహారం, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితరాలకు పరిహారం ఇచ్చేలా అమలులో ఉన్న యూనిఫైడ్ బీమా పథకాన్ని కూడా అమలు చేస్తేనే తమకు ఊరట కలుగుతుందని రైతులు కోరుతున్నారు.

శరవేగంగా సర్వే

మొన్నటి భారీ, అతిభారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల సర్వే ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. మంగళవారం నాటికి సర్వేను పూర్తి చేసి నివేదికలను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు వ్యవసాయ విస్తరణాధికారులు, సహాయ వ్యవసాయ విస్తరణాధికారులు వర్షప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి సమాచారం తీసుకుంటున్నారు. ఈసారి దెబ్బతిన పంటల సర్వే కచ్చితంగా, పారదర్శకంగా అవకాశం ఉంది. గతంతో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించకపోయినా తమకు తోచిన వివరాలను రాసి పంపేవారు. ఈ సారి అలా కుదిరేలా లేదు. ఇటీవలే పంటల లెక్క పక్కాగా జరిగింది. ఈ డిజిటలైజ్ సర్వే సందర్భంగా ప్రతీ పంట విస్తీర్ణం, పంట రకం, సర్వే నెంబర్, రైతుల పూర్తివివరాలతోపాటు పంట ఫొటోను కూడా క్యాప్చర్ చేసి ప్రత్యేక యాప్‌లో నమోదే చేశారు. ఇవన్నీ కంప్యూటర్‌లో స్పష్టంగా నిక్షిప్తమై ఉన్నాయి. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను ఈ వివరాలతో పోల్చితే పంట దెబ్బతిన్నదీ లేనిది స్పష్టంగా తెలిసిపోతుంది. ఒక వేళ పంట నష్టం జరిగినా జరగలేదని నమోదు చేస్తే రైతు ఫిర్యాదు మేరకు క్రాప్ బుకింగ్ సందర్భంగా తీసి ఫొటోలే సాక్ష్యంగా నిలుస్తాయి. భారీవర్షాలకు ముందు పచ్చగా ఉన్న పొలం.. వర్షాల తర్వాత నేలపాలై ఉన్నా ఆదేం లేదని రాస్తే ఆ విషయాన్ని క్రాప్ బుకింగ్ సందర్భంగా తీసిన ఫొటోలే రుజువు చేస్తాయి. దీంతో ఏఈవోలు, ఏఏఈవోలు.. ఏ మాత్రం తేడా రాకుండా సర్వే చేస్తున్నారు. సర్వే అనంతరం పంటల నష్టం ఏమేరకు ఉందనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దెబ్బతిన్న పంటల విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అభిప్రాయపడుతున్నారు.

వారాల కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలి

- వారాల కుల సంఘం వరంగల్ జోనల్ అధ్యక్షుడు రవీందర్

హసన్‌పర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వారాల కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని వారాల కుల సంఘం వరంగల్ జోనల్ అధ్యక్షుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. హసన్‌పర్తిలోని వారాల కుల సంఘం కమ్యూనిటీ భవనంలో ఆదివారం జరిగిన వరంగల్ జోనల్‌స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వారాల కులాన్ని బీసీ 'డి' క్రమ సంఖ్య (43)గా గుర్తించారని, కేంద్రంలో ఓబీసీ జాబితాలో వారాల కులాన్ని చేర్చకపోవడంతో నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి వారాల కులాన్ని ఓబీసీ జాబితాలోచేర్చి నిరుపేద కులాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో వరంగల్ జోనల్ కమిటీ కార్యదర్శి కందుకూరి సంజీవ్, కోశాధికారి గంట నాగేశ్వర్, ఉపాధ్యక్షులు మొలుగూరి రాజమౌళి, అమిరిశెట్టి సుధాకర్, సంయుక్త కార్యదర్శి గంట సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పావుశెట్టి నర్సింహరాములు, కార్యవర్గ సభ్యులు పాపిశెట్టి కృష్ణవేణి, గుండమీది వెంకటేశ్వర్లు, హసన్‌పర్తి కుల సంఘం ప్రధాన కార్యదర్శి గుండమీది కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ పార్క్ కబ్జా

- రెవెన్యూకాలనీ పార్క్‌లోని చెట్ల నరికివేత
- మునిసిపల్ కమ్యూనిటీ హాల్ సైతం ఆక్రమణ
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సొసైటీ బాధ్యులు
- కార్పొరేషన్ అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు



రెవెన్యూకాలనీలోని పార్క్ స్థలం ఆక్రమించి శాబాదురాళ్లు పరిచిన దృశ్యం

హనుమకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రెవెన్యూకాలనీలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం ఆనుకొని ఉన్న పార్క్ స్థలం కబ్జా అవుతోంది. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ కాలనీవాసులు నాలుగైదుసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వారు పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.

పార్క్, కమ్యూనిటీ హాల్

హనుమకొండ రెవెన్యూకాలనీ శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని ఆనుకొని ఉన్న 2,730 చదరపు గజాల స్థలాన్ని 1985లో రెవెన్యూ, ఇతర డిపార్టుమెంట్ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ పార్క్ కోసం మున్సిపాలిటీకి అప్పగించింది. ఈమేరకు మున్సిపాలిటీ 1990లో ఈ స్థలంలో ప్రజల కోసం పార్క్‌ను నిర్మించింది. దీనితోపాటు కాలనీవాసులు వివాహాది శుభకార్యాలు, ఆయా పర్వదినాల్లో ఉత్సవాలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకుగాను ఒకకమ్యూనిటీ హాల్‌ను కూడా నిర్మించింది. ఈ రెండింటినీ కలుపుతూ చుట్టూ కాంపౌండ్‌వాల్‌ను నిర్మించి బోర్డు కూడా పెట్టింది. అయితే.. ఇంతవరకు బాగానే ఉంది. క్రమంగా కాలనీ విస్తరించింది. అనేక కొత్త భవనాలు వెలిశాయి. కాలనీలో స్థలం విలువ గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో కాలనీలోని కొందరు వ్యక్తులు రంగ ప్రవేశం చేసి సొసైటీని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మున్సిపల్ పార్క్‌పై కన్నేసి ఇటీవల 150 అడుగుల పార్క్ కాంపౌండ్‌వాల్‌ను కూలగొట్టారు. ఇందులో ఎన్నో ఏళ్లుగా ఏపుగా పెరిగిన పెద్ద పెద్ద చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేయించారు. పార్క్ స్థలంలోని గ్రీనరీని తొలగించి ఆ స్థానంలో శాబాదురాళ్లను పరిచారు. పార్క్‌కు ఉన్న గేటును కాదని కొత్తగా రెండు గేట్లను అమర్చారు. పైగా పార్కు ముందు, కమ్యూనిటీ హాల్ ముందున్న బోర్డును కూడా తొలగించి శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం అని కొత్తగా బోర్డు పెట్టారు. కాగా, మున్సిపల్ ఆస్తులకు, పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని అడ్డుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు అభ్యర్థించారు.



పార్క్‌కు కొత్తగా పెట్టిన గేటు

విరాళాలకు లెక్కలు లేవు..

శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఏటా శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఇందుకు ఆలయ ధర్మకర్తల మండలి దాతల నుంచి రూ.30నుంచి రూ.40లక్షల వరకు విరాళాలు సేకరిస్తుంది. అయితే వీటికి ఇప్పటివరకు లెక్కలు చూపడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరును అడ్డుకట్ట వేయడానికి ఈ ఆలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ తన ఆధీనంలోకి తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీ, వాసవీ కాలనీ, హంటర్‌రోడ్డు ఆంజనేయుల టెంపుల్, ట్రీవిల్లాస్ ఏరియాలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వర కు, వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ, జీఎంఆర్ అపార్ట్మెంట్స్, విజయపాల్‌కాలనీ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తమవంతు ఆర్థిక సహాయాన్ని అందించాలని, జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందాలను పంపాలని కోరారు. సుమారు 100కు పైగా కాలనీలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు, కుటుంబాలతో సహా నీటిలో చిక్కుకపోయిన పరిస్థితుల్లో ఎల్‌డీఆర్‌ఎఫ్ బృందాలు రాత్రింబవళ్లు సహాయక చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో పూర్తి సహాయం అందించడం కష్టంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా హనుమకొండకు చేరుకొని ముంపునకు గురైన కాలనీలను పరిశీలించి ప్రజల సమస్యలను విన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముంపు ప్రభావిత కుటుంబాల పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించనుందని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జూబ్లీహిల్స్ ప్రచారంలో జిల్లా కాంగ్రెస్ నేతలు



యూసఫ్‌గూడలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నేత తొట్ల రాజు

మడికొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్ ఆదివారం ప్రచారాన్ని నిర్వహించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని యూసఫ్‌గూడలోని బూత్ నంబర్ 203, 209లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు కందికొండ రాజ్‌కుమార్, పుట్ట మహేందర్, చిలుపూర్ అశోక్, రఘుచందర్, రాహుల్, అక్బర్, ఖలీల్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావుకు పరామర్శ



సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

హనుమకొండ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట శాసన సభ్యుడు, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం వరంగల్ జిల్లాకు చెందిన మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు పొలపల్లి రాంమూర్తి, బుద్దె వెంకన్న హైదరాబాద్‌లోని నానకరాంగూడలోని స్వగృహంలో హరీష్‌రావును కలిసి తండ్రి సూర్యనారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- భిక్షాటన చేసిన ఎస్ఎఫ్ఐ విద్యార్థులు



భిక్షాటన చేస్తున్న ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, స్టాలిన్

కేయూ క్యాంపస్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఆదివారం ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో వినూత్న నిరసన చేపట్టారు. హనుమకొండ జులైవాడలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ ఆధ్వర్యంలో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా స్టాలిన్, శ్రీకాంత్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించకుండా సీఎం రేవంత్‌రెడ్డి మొండి వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మూడేళ్లుగా ఫీజుల బకాయిలతో విద్యార్థులు సర్టిఫికెట్లు కళాశాలల నుంచి పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. గతంలో బకాయిలపై బంద్‌కు పిలుపునిస్తే ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలకు రూ.1200 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ, రూపాయి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయి, అభిషేక్, అనుపు కుమార్, పవన్‌కుమార్, సూరజ్, రాహుల్, రణదీప్, అరుణ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సిద్ధం

- టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్

వరంగల్ మెడికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక ఉద్యోగుల డిమాండ్ సీపీఎస్ రద్దుపై హనుమకొండలో టీఎన్‌జీవోల రాష్ట్రస్థాయి సభను నిర్వహించనున్నట్లు టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు. టీఎన్‌జీవో భవన్‌లో జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం టీఎన్‌జీవో ప్రచార కార్యదర్శిగా ఉప్పు భాస్కర్‌రావును నియమించారు. సహాయ కార్యదర్శులుగా సునీల్, సుదర్శన్, సాంస్కృతిక కార్యదర్శిగా రాంచంద్రంలను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సోమన్న, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, వేణుగోపాల్, రాజేశ్, రామునాయక్, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

అగ్గిరాజేసిన కాలనీ ఎన్నికలు

- రాత్రివేళ రిటైర్డ్ ఉద్యోగి కారు ధ్వంసం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

హసన్‌పర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి పద్మావతి కాలనీలో ఇటీవల జరిగిన కాలనీ ఎన్నికలు వివాదానికి దారి తీశాయి. కాలనీలో ఏర్పాటు చేసిన ఎన్నికల్లో ఒక వర్గం ఎన్నికల కమిటీ పేరుతో జాబితాను రూపొందించారు. మరో వర్గం వారు దీనిని వ్యతిరేకిస్తూ మరో కమిటీ వేసేందుకు కమిటీ పేర్లు విడుదల చేసేందుకు సిద్ధపడ్డారు. దీంతో రెండు వర్గాల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. శనివారం రాత్రి ఒక వర్గం వారు కాలనీలో వివాదానికి కారణం రిటైర్డ్ ఉద్యోగి పావురాల సమ్మయ్యనే అంటూ అతడి ఇంటిపై దాడి చేసి కారును ధ్వంసం చేయడంతో వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. ఈ క్రమంలోనే పావురాల సమ్మయ్య, అతడి కుటుంబ సభ్యులు తమ ఇంటిపై దాడి చేశారని రోడ్డుపైకి రావడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో కాలనీవాసులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో ఎస్సై కళ్యాణ్‌తో పాటు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకొని ఇరువర్గాలను ఒప్పించి వివాదం సద్దుమణిలా చేశారు. కాగా, పావురాల సమ్మయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కాలనీవాసులు నంది శ్రీనివాస్, మూల దేవేందర్‌గౌడ్, పావుశెట్టి దిలీప్, కనకపల్లి రాజశేఖర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ధ్వంసమైన కారు

దైవ భక్తితోనే ముక్తి మార్గం

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హసన్‌పర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దైవ భక్తితోనే ముక్తి మార్గమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మండలకేంద్రంలోని ముదిరాజ్‌ల కుల దైవం పెద్దమ్మ తల్లి ఆలయంలో పెద్దమ్మ తల్లి ఐదవ కల్యాణ వార్షికోత్సవ వేడుకలు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శీలం పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య పెద్దమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు హాజరైన కావ్యకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు, పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ నిర్వాహకులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవాలయాలు హిందువుల విశ్వాసానికి చిహ్నమన్నారు. కార్తీక మాసంలో జరిగే అత్యంత పవిత్రమైన ఉత్సవాలకు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. ఆలయాలు హిందువుల పవిత్ర స్థలాలని, వాటి అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. ఆలయ అభివృద్ధికి కావాల్సిన నిధులు ఎంపీ కోటా కింద మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు పెద్దమ్మ నర్సింహరాములు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, రవీందర్, వెంకన్న, సురేష్, అనూష, సాంబయ్య, గంగాధర్, కిరణ్‌కుమార్, మొగిళి, రాజు, రాజేందర్, సతీష్, సంపత్, కుల సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

పెన్షనర్ల ప్రయోజనాలను ఏకమొత్తంలో చెల్లించాలి

- టీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి

వడ్డేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లకు రావాల్సిన ప్రయోజనాలను ఏక మొత్తంలో వెంటనే చెల్లించాలని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఎస్‌జీఆర్‌ఈఏ) జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని టీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలను వెంటనే అందించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఆర్‌లు, బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని కోరారు. 2023 జూలై 1 నుంచి పీఆర్‌సీ అమలు చేస్తూ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 7న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద గల ధర్నా చౌక్‌లో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే భారీ నిరసన దీక్షకు పెన్షనర్లు స్వచ్ఛందంగా వేలాదిగా తరలిరావాలని గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎమ్డీ ఖాజానయీమొద్దీన్, హనుమకొండ యూనిట్ అధ్యక్షుడు మాదిరెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుల సంజీవరెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు ముదిగంటి వెంకటరెడ్డి, పి.సదానందచారి, రాజశేఖరం, సుభాష్‌చంద్రబోస్, పి.విద్యాసాగర్, నారాయణరావు, శ్రీరాములు పాల్గొన్నారు.



చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల నేతలు



ఆలయంలో కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా ధాత్రి నారాయణస్వామి కల్యాణోత్సవం

హనుమకొండ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసంలో ఆదివారం కార్తీకశుద్ధ ద్వాదశిని పురస్కరించుకొని వైభవంగా ధాత్రి నారాయణస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రాతఃకాల విధులు, నిత్యాహ్నికం నిర్వహించి రుద్రేశ్వర స్వామికి కరుణాకర్, దీప్తి దంపతుల సౌజన్యంతో అమరావతినగర్ నుంచి తెప్పించిన 21 రకాల పుష్పాలతో ప్రత్యేకంగా లక్ష పుష్పార్చన శివనామాలతో నిర్వహించారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో మండపారాధన చేసి ఉసిరిక వృక్షంకు ధాత్రి నారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని పంచారాత్ర ఆగమానుసారం వైభవంగా నిర్వహించారు. ఉసిరిక చెట్టును శ్రీమన్నారాయణుడిగా తులసీ చెట్టును మహాలక్ష్మీ అమ్మ స్వరూపంగా భావించి శాస్త్రోయుక్తంగా మంగళ వాయిద్యాల మధ్య కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణం అనంతరం కార్తీక సమారాధన పేరిన అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది మధుకర్, సుజాత, రామకృష్ణ తదితరులు విశేష సేవలందించారు. సోమవారం కార్తీక ద్వితీయ సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు లక్ష తులసీ దళార్చన, దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్ చెప్పారు.

బైక్ ఢీకొని మార్కెట్ ఉద్యోగి మృతి

- రోడ్డు దాటుతుండగా ఘటన
- ప్రమాదానికి కారణమైన పైపులను తొలగించాలని స్థానికుల ధర్నా

ఖిలావరంగల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ లేబర్ కాలనీ 100 ఫీట్ల రోడ్‌పై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్కెట్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లేబర్ కాలనీకి చెందిన సుధాకర్(55) వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం నాడు క్రిస్టియన్‌కాలనీలో జరిగిన సమాధుల పండుగకు వెళ్లి సాయంత్రం ఇంటికి నడిచి వస్తున్నాడు. ఈ క్రమంలో 100 ఫీట్ల రోడ్డుపై ఉన్న సిమెంట్ పైపుల మధ్య నుంచి దాటుతుండగా అవతలివైపు నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను స్థానికులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్లుగా రోడ్డుపైనే పైపులు..

లేబర్‌కాలనీ 100ఫీట్ల రోడ్‌పై 5 సంవత్సరాలుగా భారీ సిమెంట్ పైప్‌లు ఉంటున్నాయి. దీంతో స్థానికులు రోడ్డు దాటుతున్న క్రమంలో అటువైపు నుంచి వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా ఇప్పటి వరకు అనేక మంది మృతి చెందారు. కాళ్ళు చేతులు విరిగి మంచానికి పరిమితమైన వారు ఎందరో ఉన్నారు. ఆదివారం జరిగిన ఘటనతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులను వెంటనే తొలగించాలని రోడ్డుపై గంటపాటు ధర్నా చేపట్టారు. దీంతో నర్సంపేట, వరంగల్‌నుంచి ఏనుమాముల మార్కెట్‌కు వచ్చే వాహనాలు మూడు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. మిల్స్‌కాలనీ పోలీసులు వచ్చి వారికి నచ్చచెప్పి ధర్నాను విరమింపచేశారు.



పైప్‌లను తొలగించాలని ధర్నా చేస్తున్న స్థానికులు, ఇన్‌సెట్‌లో సుధాకర్(ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

సంగెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ పరికరాలు మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని లోహిత గ్రామంలో జరిగింది. సంగెం ఎస్సై వంశీకృష్ణ అందించిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం సూర్యతండాకు చెందిన గుగులోతు రాజేందర్ (29) శనివారం ఇదే గ్రామానికి చెందిన భాగీత్ దేవేందర్‌తో కలిసి సంగెం మండలంలోని లోహిత గ్రామ శివారులో గల పెద్ద తండాలో విద్యుత్ స్తంభాల మరమ్మతు పనుల కోసం వెళ్లాడు. అక్కడ విద్యుత్ స్తంభానికి తీగలు బిగిస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. దీంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం మృతుని తల్లి గుగులోతు నీలమ్మ సంగెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

సెలబ్ టాక్

ఒకప్పుడు హిందీలో వరుస చిత్రాలతో అలరించిన నటుడు చంకీ పాండే. ఆయన వారసురాలు... భారతీయ సినీ ప్రేక్షకులకు సుపరిచితురాలు... అనన్యా పాండే. ఆరేళ్ల కిందట టైగర్ షరాఫ్ 'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ 2'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ... సరైన హిట్స్ లేక ఇంకా తడబడుతూనే ఉంది. కానీ సామాజిక మాధ్యమాల్లో కోట్ల మంది అభిమానులను సంపాదించుకుంది. బడా బ్రాండ్లకు ప్రచారకర్తగా కోట్లు సంపాదిస్తోంది. గత నెల ముప్పైన 27వ పుట్టిన రోజు జరుపుకున్న అనన్యా... 'నేను అన్నీ తెలిసిన అమ్మాయిని' అంటూ తన గురించి ఎన్నో విషయాలు పంచుకుంది.

నేను అన్నీ తెలిసిన అమ్మాయిని!



తండ్రి చంకీ పాండే ఒకప్పుడు బిజీ నటుడు. అమ్మ భావన కాస్ట్యూమ్ డిజైనర్. సినీ వాతావరణంలో పెరిగిన అనన్యా... వెండితెరపై వెలిగిపోవాలని చిన్నప్పటి నుంచీ కలలు కన్నది. ముంబయి 'ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె... ఆ తరువాత చదువుకు స్వస్తి చెప్పింది. "ఉన్నత విద్య అభ్యసించనందుకు మీకు బాధగా లేదా?" అని ఒక సందర్భంలో విలేకరులు అడిగితే... "షూటింగ్ సెట్స్ నాకు సినిమా స్కూల్" అంటూ బదులిచ్చింది. దీన్నిబట్టి ఆమె సినిమాను ఎంతగా ప్రేమిస్తుందో అర్థమవుతుంది. అనుకున్నట్టుగానే 2019లో 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. కానీ ఆ తరువాత చెప్పుకోతగ్గ హిట్స్ లేక అవస్థలు పడుతోంది. అయితే ఆమె బాధపడుతూ కూర్చోలేదు. వచ్చిన అవకాశాలు వచ్చినట్టు చేసుకొంటూ పోతోంది. ప్రయత్న లోపం లేకుండా వంద శాతం కష్టపడుతోంది. "జయాపజయాలు మన చేతుల్లో ఉండవు. ఎంతటి స్టార్ అయినా ప్రేక్షకుల ఆదరణ ఉన్నంతవరకే నిలబడగలరు. ఆ విషయం నాకు ఆరంభంలోనే అర్థమైంది. అందుకే అభిమానులు మెచ్చేలా పాత్రలు ఎన్నుకోవడానికి, వారిని మెప్పించడానికి కృషి చేస్తున్నాను. అమ్మా, నాన్న, చెల్లి రైసా... వీరే నా విమర్శకులు. చుట్టూ చప్పట్లు కొట్టేవారు ఉంటే వాస్తవాలు ఏమిటో తెలుసుకోలేం. కానీ నా సినిమా బాగోకపోయినా, నా నటన నచ్చకపోయినా చెల్లి ముఖం మీదే చెప్పేస్తుంది. అమ్మా నాన్నా కూడా అంతే' అంటూ చెప్పుకొచ్చిన అనన్య... అక్టోబరు 30న తన పుట్టినరోజును ఘనంగా జరుపుకొంది.



ప్రేమానురాగాలు కురిసే రోజు...

"నా పుట్టినరోజును కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య చేసుకోవడం నాకు బాగా నచ్చుతుంది.. అందంగా ముస్తాబైన కేక్‌లు, రకరకాల బెలూన్లు, ఆహారాతులు అందించే బహుమతులు... వారు కురిపించే ప్రేమానురాగాలు... పుట్టినరోజు వేడుకలో ప్రతిదీ నాకు ఎంతో ఇష్టం. ఊహ తెలిసినప్పటి నుంచీ ఇలాగే కొనసాగుతోంది. బెలూన్లు, కేక్‌లు ఇష్టపడుతున్నంత మాత్రాన నాలో పరిణతి లేదనుకోవద్దు. నేను అన్నీ తెలిసిన అమ్మాయిని" అంటూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది అనన్య. ఈసారి తన జన్మదినం మరింత ప్రత్యేకమని, తన ప్రాణ స్నేహితురాలి పెళ్లి కూడా అదే రోజు జరగడమే అందుకు కారణమని పేర్కొంది.

గత రెండేళ్లలో...

ఆశించిన స్థాయిలో హిట్స్ లేకపోయినా... అవకాశాలు మాత్రం అనన్యను వెతుక్కొంటూ వస్తున్నాయి. ఆరేళ్ల కెరీర్‌లో దాదాపు పదిహేను చిత్రాలు చేసిన ఆమెకు... టెలివిజన్ సిరీస్ 'కాల్ మి బే'తో మంచి గుర్తింపు లభించింది. గత ఏడాది వచ్చిన ఈ షోలో ఆమె బెల్లా చౌదరి (బే)గా నటించింది. ఆ పాత్రకు అన్ని వర్గాల ప్రేక్షకులు, పరిశ్రమ పెద్దల నుంచి ప్రశంసలు అందుకుంది. "కార్తీక్ ఆర్యన్‌తో నటించిన 'తు మేరీ మై తేరా...' చిత్రం డిసెంబరు 31న విడుదలవుతుంది. ఇది పూర్తిస్థాయిలో అలరిస్తుందని, ఆ విజయంతో కొత్త సంవత్సరం ఉత్సాహంగా మొదలవుతుందని ఆశిస్తున్నా. దాంతోపాటు 'కాల్ మి బే' రెండో సీజన్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. తొలి సీజన్‌లానే ఇది కూడా తప్పకుండా ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఈ రెండు ప్రాజెక్టులు నా కెరీర్‌కు ఊపునిచ్చాయి. అందుకే గడిచిన రెండేళ్లూ నాకు ఎంతో ముఖ్యమైనవి. నటిగా నన్ను నిలబెట్టినవి" అంటూ సంతోషం వ్యక్తం చేసింది అనన్య.

నేర్చుకొంటూ ఎదుగుతున్నా...

"నాకు ప్రతి ప్రాజెక్ట్ ఒక అనుభవ పాఠం. పరిశ్రమలో నా ప్రయాణం చిన్నదే. అయినా ఎన్నో ఒడుదొడుకులు, సవాళ్లు ఎదుర్కొన్నా. వాటి నుంచి ఎంతో నేర్చుకున్నా. నేర్చుకొంటూనే ఉంటా. అనుభవాలను మెట్లుగా చేసుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని తపిస్తున్నా" అంటున్న అనన్యకు ఇన్‌స్టాగ్రామ్‌లో 2.6 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ప్రతి పోస్ట్‌కు లక్షల్లో లైక్‌లు, అంతకు మించి వ్యూస్. "కొత్తగా ఉండటం, కొత్త విషయాలు తెలుసుకోవడం ఇష్టం. ఫ్యాషన్ అంటే అమితమైన మక్కువ. ఇటలీలో ఒకసారి ఫ్యాషన్ షూట్‌కు వెళ్లాను. అదే సమయంలో ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ నుంచి పిలుపు వచ్చింది. అలా 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2'తో నటిని అయ్యాను" అని తన అనుభవాలను పంచుకున్న అనన్య... వారసత్వంతో తెరంగేట్రానికి అవకాశాలు వచ్చినా... ప్రతిభ లేకపోతే ఎవరూ ఇక్కడ నిలబడలేరని చెబుతోంది.

'లైగర్' తదితర భారీ బడ్జెట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో 'ఐరన్ లెగ్'గా ఆమెపై కొందరు ముద్ర వేశారు. "అసలు నటించడమే రాదు" అంటూ విమర్శలు ఎక్కుపెట్టారు. ఆ సమయంలో కొన్నాళ్లు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆస్వాదించిన రోజులు గుర్తు చేసుకొంటూ తనకు తాను మనోధైర్యం నింపుకొంది. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా... ప్రేక్షకుల అభిమానమే ఇంధనంగా ముందుకు సాగుతోంది.

అదే విలువైన బహుమతి...

పుట్టినరోజుకు సంబంధించి అనన్యకు ఎన్నో మధురానుభూతులు ఉన్నాయి. "పార్టీల్లో మునిగి తేలడం, స్విమ్మింగ్ చేయడం, రకరకాల ఆటలు ఆడడం, స్నేహితులతో కలిసి హిందీ పాటలకు ఒళ్లు అలిసిపోయేలా డ్యాన్స్ చేయడం... రోజంతా ఉరిమే ఉత్సాహమే. చిన్నప్పుడు స్కూల్లో అయితే జన్మదినం నాడు యూనిఫామ్‌కు బదులు మనకు నచ్చిన రంగురంగుల దుస్తులు వేసుకువెళ్లే వెసులుబాటు ఉండేది. అలా స్కూల్ యూనిఫామ్ వేసుకున్న తోటి విద్యార్థుల మధ్యలోకి ఫార్మల్స్‌లో వెళ్లడం... తరగతి గదిలో స్నేహితులకు, టీచర్లకు చాక్లెట్లు పంచిపెట్టడం... వేరే తరగతివారు వచ్చి శుభాకాంక్షలు చెప్పి వెళ్లడం... ఇవన్నీ 'నేనో ప్రత్యేకమైన వ్యక్తిని' అనే అనుభూతి కలిగించేవి" అంటూ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న అనన్యకు ఇప్పటివరకు అందిన పుట్టినరోజు బహుమతుల్లో అత్యుత్తమమైనది ఏదో తెలుసా..? 'కుక్కపిల్లలు' అంటుంది తను.

జీవనశైలి

సుఖ నిద్రకు మార్గం

రోజంతా కష్టపడినా రాత్రిళ్లు మంచి నిద్ర పట్టక అవస్థలు పడేవారు ఎందరో. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి... మన ఆహారపు అలవాట్లు. ముఖ్యంగా తీపి పదార్థాలు, పిజ్జాలు, బర్గర్ల లాంటి జంక్ ఫుడ్స్ ఎక్కువగా తినడంవల్ల సరైన నిద్ర కరువవుతుంది. సుఖ నిద్ర కావాలంటే మరి ఆహారంలో ఏముండాలి? న్యూట్రిషనిస్టుల సూచనలివే...

ఎలాంటి ఆహారం..?

పిండి పదార్థాలు, 'ట్రిప్టోఫాన్' అమినో యాసిడ్ ఉన్న పోషకాహారం తీసుకొంటే కంటి నిండా నిద్ర పడుతుంది. ట్రిప్టోఫాన్‌ను మెదడుకు చేరవేయడంలో కార్బొహైడ్రేట్స్ కీలకం. అందుకే కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉన్న ఆహారం తిన్న తరువాత కాస్త మత్తుగా ఉంటుంది. పాలు, పాల పదార్థాలు, నట్స్ లాంటివి ట్రిప్టోఫాన్‌కు బిల్డింగ్ బ్లాక్స్‌లా పనిచేస్తాయి. కనుక రాత్రి భోజనంలో తప్పనిసరిగా పోషకాలు, పిండి పదార్థాలు... అంటే పాలతో ఓట్స్, పీనట్ బటర్‌తో వీట్ బ్రెడ్ టోస్ట్ లేదంటే ఛీజ్, వెజిటబుల్ స్నాక్స్ ఉండేలా చూసుకొంటే మంచి నిద్ర పడుతుంది.

ఒమేగా-3 తక్కువైతే..!

శరీరంలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ తక్కువ స్థాయిలో ఉంటే పిల్లల్లో నిద్ర లేమి సమస్యలు వస్తాయి. సాలమన్ తదితర చేపల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. రాత్రి భోజనంలో ఇవి ఉండేలా చూసుకోండి. ఇంకా కోడి గుడ్లు, పౌల్ట్రీ ఉత్పత్తులు, వాల్‌నట్స్, సబ్జా గింజలు, బీన్స్, కాలీఫ్లవర్, బ్రసెల్ స్ప్రౌట్స్, బ్రకోలీ, బెర్రీస్, ఫ్లాక్స్, సోయాబీన్స్‌తోపాటు యోగర్ట్, పాలు, సోయా పాలల్లోనూ ఒమేగా-3 సమృద్ధిగా లభ్యమవుతుంది.

అరటి పండు: ఇందులో ట్రిప్టోఫాన్, మెగ్నీషియం పాళ్లు ఎక్కువ. ఈ రెండూ రాత్రి సుఖ నిద్రనివ్వడంలో దోహదపడతాయి.

ఓట్‌మీల్: వరి అన్నంలానే ఓట్‌మీల్‌లో కూడా అధికమొత్తంలో పిండి పదార్థాలుంటాయి. పడుకొనే ముందు దీన్ని తీసుకొంటే త్వరగా నిద్ర పడుతుంది. ఓట్స్‌లో మెలటోనిన్ శాతం ఎక్కువ.

ఛీజ్: కాటేజ్ ఛీజ్‌లో కేసియిన్ సమృద్ధిగా ఉంటుంది. పాలల్లోని ఈ ప్రొటీన్ కండరాల మరమ్మతుకు, ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

డార్క్ చాకొలెట్: ఇందులోని సెరోటోనిన్ మెదడు, నరాలను చల్లబరుస్తుంది. ఫలితంగా మంచి నిద్ర పడుతుంది. డార్క్ చాకొలెట్‌లో షుగర్ తక్కువగా ఉండడంతో పిల్లలు పెద్దగా ఇష్టపడరు. అయితే సాధారణ చాకొలెట్‌కు బదులు రాత్రి భోజనం తరువాత ఓ బైట్ ఇది తినగలిగితే చక్కని ఫలితాన్నిస్తుంది.

చెర్రీ పండ్లు: రాత్రి నిద్ర... ఉదయం లేవడం... ఈ సైకిల్‌ను సరైన రీతిలో నడిపించడంలో చెర్రీస్‌లోని మెలటోనిన్ పని చేస్తుంది.

'జంక్' వద్దు...

జంక్ ఫుడ్‌లో అధిక మొత్తంలో శుద్ధి చేసిన, సాధారణ పిండి పదార్థాలుంటాయి. దీనివల్ల కావల్సినన్ని పిండి పదార్థాలు శరీరానికి చేరవు. అంతేకాదు... శీతలమైన, శక్తినిచ్చే పానీయాలు ఎక్కువ మోతాదులో సేవించడం, ఉదయం అల్పాహారం తీసుకోకపోవడం, వేళాపాళా లేకుండా తినడం లాంటివి నిద్రపై తీవ్ర ప్రభావం చూపుతాయి.



ఔషధాల గని

బొప్పాయి పండు రోగనిరోధకశక్తిని పెంచడంలో ఔషధంలా పని చేస్తుంది. మన రోజువారీ ఆహారంలో దీన్ని చేర్చుకొంటే పలు వైరస్‌ల నుంచి కాపాడుతుందని నిపుణులు చెబుతున్నారు.

పోషకాలు, ఫైబర్

బొప్పాయిలో అనేక పోషకాలు, ఫైబర్‌లతో పాటు... ఫోలేట్, బీ6, క్యాల్షియం, మెగ్నీషియం, విటమిన్ ఏ, సీ, బీ1, బీ3, ఇ, కె, పొటాషియం ఉన్నాయి. బొప్పాయిలోని యాంటీఆక్సిడెంట్లు, యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు క్యాన్సర్ కారకాలను అడ్డుకొంటాయి. బొప్పాయి ఆకుల్లో కూడా చాలా ఔషధ గుణాలున్నాయి. డెంగ్యూ పేషెంట్లలో ప్లేట్‌లెట్ల కౌంట్ పెంచడంలో ఇవి బాగా పని చేస్తాయంటారు. బొప్పాయిని చాలా ఔషధాల్లో ఉపయోగిస్తారు.

ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ


బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు విరివిగా ఉండడం వల్ల రోగనిరోధకశక్తి పెరిగి, వైరస్‌లు, ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. ఇందులోని సీ, ఇ విటమిన్లు, బీటాకారోటిన్ లాంటి యాంటీఆక్సిడెంట్లు ఊపిరితిత్తులు, ముక్కు రంధ్రాలల్లో శ్వాససంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. జ్వరం, గొంతు మంట, నొప్పి, జలుబువల్ల కలిగే ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

మధుమేహం తగ్గించడంలో...

పొటాషియం సమృద్ధిగా ఉండటంవల్ల హైబీపీని నియంత్రణలో ఉంచుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు మధుమేహాన్ని తగ్గించడంలో దోహదపడతాయి. బొప్పాయిలో కేలరీలు తక్కువ. కనుక తింటే బరువు పెరుగుతామనే భయం అక్కర్లేదు.

గుండెను ఆరోగ్యంగా...

ఈ పండులోని సీ, ఇ విటమిన్లతో పాటు బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు శరీరంలో కొవ్వు తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో దోహదపడతాయి. రక్తనాళాలను శుభ్రం చేసి, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి.



కళామాధురి

బాల్యం నుంచి హస్తకళలపై ఉన్న ఆసక్తిని ఎన్ని అవరోధాలు ఎదురైనా మాధురి నేమా విడిచిపెట్టలేదు. బ్యాంకు ఉద్యోగాన్ని కూడా వదిలేసి తన కళాభిరుచిని కొనసాగిస్తున్నారు. ఎన్నో బహుమతులు, అవార్డులు గెలుచుకున్న ఆమె... మహిళలకు, విద్యార్థులకు శిక్షణ కోసం సొంత సంస్థను స్థాపించారు. ఆమె తన కళా ప్రయాణం గురించి 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి...





'చిన్నప్పటి నుండి నాకు హస్తకళలంటే చాలా ఇష్టం. మా నాన్నగారు వ్యవసాయ శాఖలో సైంటిస్ట్. ఆయన రచయితగా, వ్యాఖ్యాతగా కూడా పేరు పొందారు. మా తల్లిదండ్రులు కళల పట్ల మక్కువ కలిగేలా నన్ను, నా తోబుట్టువులను ఎంతగానో ప్రోత్సహించేవారు. పేపర్లతో బొమ్మలు చేయడం, చిత్రలేఖనం, రంగోలి, పెయింటింగ్స్‌లలో ఎక్కడ పోటీలు జరిగినా పంపించేవారు. అలా నాకు కళలపై ఆసక్తి పెరిగింది. మాది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సెహోర్. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పట్టా పొందాను. పెళ్లయిన తరువాత... 2013లో ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వచ్చాను. నా భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. నేను బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అధికారిణిగా పని చేశాను. ఆ సమయంలో పిల్లల పెంపకం, ఉద్యోగ బాధ్యతల కారణంగా నా కళాభిరుచిని కొనసాగించడానికి సమయం దొరికేది కాదు. ఈ నేపథ్యంలో... నా భర్త అనుమతితో ఉద్యోగాన్ని వదిలేశాను. నా కళకు మరింత పదును పెట్టాను.

పర్యావరణ హితంగా...

కార్డుబోర్డుతో రకరకాల బొమ్మల తయారీ, వాడిన పేపర్‌తో చూడచక్కని ఆకృతుల రూపకల్పన, డాట్ పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్, రంగోలీ డిజైనింగ్, వాల్ పెయింటింగ్స్, స్కెచ్ ఆర్ట్, మెహందీ డిజైన్లు, ఎంబ్రాయిడరీ. స్ట్రింగ్ ఆర్ట్, రెడీమేడ్ రంగోలీ, ఉడెన్ మ్యాట్ రంగోలీ, క్లే ఆర్ట్... ఇలా అనేక అంశాల్లో నాకు నైపుణ్యం ఉంది. ఉద్యోగాన్ని విడిచిపెట్టిన తరువాత.. ఇంట్లోనే కాగితం, కార్డు బోర్డులో బొమ్మలు తయారుచేసి, వాటితో ప్రదర్శనలు నిర్వహించాను. వాటిని కొనుగోలు చేయడానికి చాలామంది పోటీ పడేవారు. మరోవైపు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అనేక బహుమతులను గెలుచుకున్నాను, అవార్డులు కూడా అందుకున్నాను. చాలామంది తమ కోసం గిఫ్ట్‌లను, రకరకాల బొమ్మలను తయారు చేసి ఇవ్వాలని, మెహందీ పెట్టాలని కోరుతూ నా దగ్గరకు వస్తూ ఉంటారు. నేను తయారు చేసే బొమ్మల్లో ప్లాస్టిక్ ఉపయోగించను. తద్వారా పర్యావరణానికి హాని కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటాను. నాకు తెలిసిన కళను నాలోనే దాచిపెట్టుకోకూడదని నా ఉద్దేశం అందుకే... వేసవి సెలవుల్లో, ఇతర సెలవు దినాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను. వారితో పాటు మహిళలకు కూడా శిక్షణ ఇవ్వడానికి ఇటీవలే 'మాధురీస్ ఆర్ట్ స్పేస్' పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేశాను. తద్వారా శిక్షకురాలిగా కూడా గుర్తింపు పొందుతున్నాను. కళాకారులను తయారు చేసి, వారికి గుర్తింపు లభించేలా చేయడం, తద్వారా కళలను పరిరక్షించడం నా లక్ష్యం."

• వెనగంటి లక్ష్మణ్ యాదవ్

సత్కార్ కర్మిగా ఆమె...

శ్మశాన వాటికలకు మహిళలు వెళ్లడమే అరుదు. కానీ పదేళ్లుగా మృతదేహాల్ని దహనం చేసే వృత్తిలో కొనసాగుతున్నారు పశ్చిమబెంగాల్‌కు చెందిన తంపాదాస్. ఇప్పటివరకూ 8 వేలకు పైగా అంత్యక్రియలను ఆమె నిర్వహించారు. ఈ క్రమంలో ఎన్నో ఆక్షేపణలు ఎదుర్కొన్నారు. "ఇది నాకు జీవనోపాధి మాత్రమే కాదు... వారసత్వం కూడా" అంటున్న తంపాదాస్ అంతరంగమిది.

"సత్కార్ కర్మి... మా రాష్ట్రంలో శ్మశానంలో పని చేసే వారిని అలాగే పిలుస్తారు. మరణించినవారికి అంత్యక్రియలను శ్రద్ధగా నిర్వహించి, వారిని హుందాగా ఈ లోకం నుంచి సాగనంపడం మా విధి. ఇది నేను ఇష్టపడి ఎంచుకున్న వృత్తి కాదు. అవసరం నన్ను ఇటువైపు తీసుకువచ్చింది. అంతకుముందు నా జీవితం వేరు, నేను కన్న కలలు వేరు.

ఊరంతా అభ్యంతరం చెప్పింది...

మాది పశ్చిమబెంగాల్‌లోని పురంధర్‌పూర్. అమ్మ, నాన్న, నా చెల్లెలు, తమ్ముడు, నేను... ఇదీ మా కుటుంబం. మా నాన్న బాపిదాస్ ఊరు శ్మశాన వాటికలో సత్కార్ కర్మిగా పని చేసేవారు. నేను పదో తరగతి చదివాను. నర్సు శిక్షణ తీసుకొని... మా ఊర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగిగా చేరాను. ఎప్పటికైనా స్థిరమైన ఉద్యోగం సంపాదించాలి, జీవితంలో స్థిరపడాలి... ఇదీ నా లక్ష్యం. అయితే... బొటాబొటి ఆదాయంతో సాగుతున్న మా కుటుంబం... మా నాన్న హఠాత్తుగా మరణించారు. నాకు నర్సుగా వచ్చే జీతం అంతంతమాత్రం. అది కూడా కొన్ని నెలలపాటు అందేది కాదు. నలుగురు సభ్యులున్న కుటుంబాన్ని పోషించవలసిన బాధ్యత నా మీద పడింది. ఏం చేయాలో తోచలేదు. చివరకు... మా నాన్న వృత్తినే చేపట్టాలని నిర్ణయించుకున్నాను. సంప్రదాయికంగా శ్మశానంలోకి మహిళలు రారు. ఇక దహన కార్యక్రమాలు నిర్వహించేది కూడా పూర్తిగా పురుషులే. అలాంటిది... నేను ఆ పని చేస్తానంటే... మా కుటుంబ సభ్యులే కాదు, ఊరంతా అభ్యంతరం తెలిపింది. కానీ నాకు మరొక మార్గం కనిపించలేదు. నాన్న వారసత్వాన్ని స్వీకరించాను. గ్రామ పెద్దలను ఒప్పించి... 2014లో సత్కార్ కర్మిగా బాధ్యతలు చేపట్టాను.

నిద్రపట్టేది కాదు...

మొదట్లో రకరకాల సమస్యలు ఎదుర్కొన్నాను. గ్రామంలో మహిళలు ఈసడించుకొనేవారు. బంధువులు మా ఇంటికి రావడం మానేశారు. అప్పుడు మరణించినవారికన్నా జీవించి ఉన్నవారే భయంకరంగా అనిపించేవారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటలవరకూ శ్మశానంలోనే ఉండాలి. వేడి, పొగ... అన్నిటినీ మించి మృతుల ఆత్మీయుల రోదనలు... వాటన్నిటినీ తట్టుకోవడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. భయం కూడా వేసేది. రాత్రిపూట నిద్ర పట్టేది కాదు. కొన్ని రోజులు నా వెంట మా అమ్మ వచ్చేది. జనం విమర్శలకు క్రమంగా అలవాటు పడ్డాను. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా... నా పని నేను చేసుకుంటూ పోయాను. శ్మశానవాటికను శుభ్రంగా ఉంచడం, కట్టెలను పేర్చి చితులు తయారు చేయడం, చితాభస్మాన్ని సేకరించి మృతుల కుటుంబాలకు అప్పగించడం, మరణించినవారి వివరాలు నమోదు చేయడం, వాటిని పంచాయతీ కార్యాలయానికి తెలియజేయడం... ఇలా రకరకాల విధులను నేను నెరవేర్చాల్సి ఉంటుంది. దీనికోసం అదనపు షిఫ్టులతో కలిపి... పంచాయతీ నాకు ఇచ్చేది అయిదు వేల రూపాయలు. అయితే అప్పుడప్పుడు... మృతుల బంధువులు కొద్ది మొత్తాలు ఇస్తూ ఉంటారు. 2019లో కట్టెల చితులకు బదులుగా... విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేశారు. దీనితో కొంత భారం తగ్గింది. గతంలో కొన్ని గంటలు పట్టేది... ఇప్పుడు 45 నిమిషాలలోనే పూర్తవుతోంది. ఇప్పటివరకూ ఎనిమిది వేలకు పైగా మృతదేహాలకు దహన కార్యక్రమాలు నిర్వహించాను. డబ్బున్నవారు కావచ్చు, పేదలు కావచ్చు... ప్రతి మనిషి జీవితం ముగిసేది ఇక్కడే. సంపద, గర్వం, అహంకారం, కులాధిపత్యాలు.... అవన్నీ శ్మశానం బయటే ఆగిపోతాయి. మరణించినవారికి గౌరవప్రదంగా ఈ లోకం నుంచి సాగనంపుతున్నాననే భావన... ఆదాయం కన్నా ఎక్కువ సంతృప్తిని ఇస్తోంది.





పెళ్లి కుదరడం లేదు...

ఈ వృత్తి కారణంగా వ్యక్తిగత జీవితంలో ఎలాంటి సమస్యలు లేవా? అంటే ఉన్నాయనే చెబుతాను. ఇప్పుడు నాకు ఇరవై తొమ్మిదేళ్లు. పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. కానీ నా వృత్తి గురించి తెలియగానే... అన్నీ వెనక్కు పోతున్నాయి. అయినా నేను బాధ పడడం లేదు. మా తాత, నాన్న... ఇలా మా కుటుంబం ఈ వృత్తికి అంకితం అయింది. దాన్ని నేను వారసత్వంగా స్వీకరించాను. నేను నా తల్లితండ్రులకు మొదటి సంతానాన్ని. నేనే పురుషుడినైతే ఇన్ని ఆక్షేపణలు ఉండేవి కాదు. అలాగని సంప్రదాయాల్ని ఎదిరించడం లాంటి మాటలు నేను చెప్పను. మా నాన్న స్థానంలో ఆ పని ఎవరో ఒకరు చెయ్యాల్సిందే. నాకు స్థిరమైన ఉపాధి అవసరమైనప్పుడు... ఈ వృత్తి నన్ను ఆదుకుంది. లేకపోతే మా కుటుంబం చాలా ఇబ్బందులు పడేది. "ఈ పని తప్ప మరేం దొరకలేదా?" అని ప్రశ్నించేవారికి నేను చెప్పే సమాధానం ఒక్కటే... నేను దొంగతనం చేయడం లేదు. బిచ్చమెత్తుకోవడం లేదు. నా పని నిజాయితీగా చేస్తున్నాను. మరి నేనెందుకు సిగ్గుపడాలి? నాపట్ల గ్రామస్తుల ధోరణి కూడా మారింది. ముఖ్యంగా... కొవిడ్ కాలంలో నా నిబద్ధతను అందరూ గమనించారు. ఇప్పుడు నన్ను గౌరవంగా చూస్తున్నారు."

దిక్సూచి

క్యాట్ ఫైనల్ ప్రిపరేషన్
వేగం, కచ్చితత్వం ప్రధానం



ఐఐఎం సహా పేరొందిన మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్). ఈ టెస్ట్‌లో సాధించిన పర్సంటైల్‌తో నేరుగా ప్రవేశం లభించదు. అయితే ఆ కాలేజీలు అడ్మిషన్‌కు సంబంధించి పరిగణనలోకి తీసుకునే ప్రాతిపదికల్లో మొదటిది మాత్రం క్యాట్ పర్సంటైల్. తొలిసారి ఈ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒకవైపు ఫైనలియర్‌లో చివరి అంకమైన ప్రాజెక్ట్ వర్క్ పనిలో ఉంటారు. మరోపక్క గేట్, క్యాట్ వంటి ప్రవేశ పరీక్షలు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టెస్టుల బిజీలోనూ ఉంటారు. వీటిలో క్యాట్‌కు పట్టుమని నెల రోజుల గడువు కూడా లేదు. ఈ నేపథ్యంలో క్యాట్ తొలిసారి రాస్తున్నవారికి తోడు ఒకింత అవగాహనతో ముందుకు సాగుతున్న వారి వరకు అభ్యర్థులంతా టెస్ట్‌కు సమర్థంగా సన్నద్ధం కావచ్చు. అందుకు ప్రధానంగా... క్యాట్‌లో అడిగిన అన్ని ప్రశ్నలూ సాల్వ్ చేయాల్సిన అవసరం లేదు. 40 నుంచి 50 శాతం ప్రశ్నలను సాల్వ్ చేయగలిగితే చాలు, మంచి స్కోర్ సాధించవచ్చన్నది నిపుణుల సూచన. క్యాట్‌లో ప్రధానంగా మూడు విభాగాలు - వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ), డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(క్యుఎ) ఉంటాయి. ఒక్కో విభాగానికి సంబంధించి ప్రిపరేషన్ ఇలా ఉండేలా చూసుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (క్యుఎ)

- ఈ విభాగంలో వేగం అంతకు మించి కచ్చితత్వం ప్రధానం. ఆ రెంటికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి స్కోర్ సాధించాలి.
- అర్థమెటిక్, ఆల్జీబ్రా, జామెట్రీ, మోడ్రన్ మేథ్స్‌లోని కాన్సెప్ట్‌లను రివైజ్ చేసుకోవాలి. కాన్సెప్ట్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.
- ఈ విభాగం సెక్షనల్ మాక్ టెస్టులను వారానికి రెండు లేదా మూడు చొప్పున చేయాలి.
- అన్ని టాపిక్స్‌లో కలిపి ప్రతి రోజూ 30 నుంచి 40 ప్రశ్నలను సాల్వ్ చేయాలి.
- త్వరితగతిని గుర్తుకు తెచ్చుకునేందుకు వీలుగా ఫార్ములా నోట్ బుక్‌ను మెయింటైన్ చేయాలి.
- గతం నిర్వహించిన ప్రశ్నపత్రాల్లో తరచూ అడుగుతున్న ప్రశ్నలను పదేపదే సాల్వ్ చేస్తుండాలి.

డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్)

- రోజుకు కనీసం రెండు, మూడు సెక్షనల్ మాక్ టెస్టులను చేయాలి. ప్రతి సారి సాల్వ్ చేయడంలో కష్ట స్థాయిని పెంచుకుంటూ వెళ్ళాలి.
- డేటా టేబుల్స్, లాజికల్ పజిల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి సెట్‌కు టైమ్ సెట్ చేసుకోవాలి. అలా సాల్వింగ్ కోసం పట్టే సమయాన్ని తగ్గించుకోవాలి.
- ప్రతి మాక్ టెస్టులో దొర్లే తప్పులను విశ్లేషించుకోవాలి. సాల్వింగ్ నుంచి ఆలోచన, తుది నిర్ణయం వరకు ప్రతి చోట సాధారణంగా ఎదురవుతున్న తప్పులను ఒక దగ్గర నోట్ చేసుకోవాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- చివరి వారానికల్లా పది, పదిహేను నిమిషాల్లో ప్రతి సెట్‌ను పూర్తి చేయగలగడం అన్నది లక్ష్యంగా పెట్టుకోవాలి. అదే సమయం 80 నుంచి 90 శాతం మేర కచ్చితత్వాన్నీ సాధించాలి.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)

- రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడంలో సరైన పాటవానికి తోడు నిలకడ సాధించాలి.
- రోజుకు కనీసం మూడు రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడాన్ని అలవాటు చేసుకోవాలి.
- పారా జంబుల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- మాక్ టెస్టుల్లో అటు ఆ పరీక్ష, ఇటు వ్యక్తిగత ప్రతిభను సునిశితంగా విశ్లేషించుకోవాలి.

రైల్వేలో మెగా రిక్రూట్‌మెంట్

భారతీయ రైల్వే వివిధ పోస్టులకు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలు ఉన్నాయి. వివిధ అర్హతలకు తోడు నిర్దేశిత ఎంపిక ప్రక్రియ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. సంక్షిప్తంగా ఆ వివరాలు దిగువ ఇస్తున్నాం.



నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (అండర్ గ్రాడ్యుయేట్)

ఖాళీలు 3058

- కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: 2424
- అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 394
- జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 163
- ట్రైనీ క్లర్క్: 77

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 27

నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్)

ఖాళీలు 5810

- కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్: 161
- స్టేషన్ మాస్టర్: 615
- గూడ్స్ రైలు మేనేజర్: 3416
- జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: 921
- సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 638
- ట్రాఫిక్ అసిస్టెంట్: 59

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు ఇంగ్లీష్/హిందీ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్(టైర్ 1, టైర్ 2)కు తోడు టైపింగ్ స్కిల్‌టెస్ట్/కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

ఇంకొన్ని

ఖాళీలు 2569

జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకూ నోటిఫికేషన్ విడుదలైంది.
అర్హత: పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ డిగ్రీ పాసై ఉండాలి.
ఎంపిక: రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, రైల్వే మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

డిజైనింగ్ @ ఎన్ఐడి



దుస్తులు, పాదరక్షలు, వాచీ, హ్యాండ్‌బ్యాగ్ సహా ఏదైనా సరే, ఒక వస్తువుకు ఉండాల్సిన సాధారణ లక్షణాలు దెబ్బతినకుండా అందంగా, ఆధునికంగా మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడాన్నే డిజైనింగ్ అంటాం. ఈ అంశానికి సంబంధించి మన దేశంలో అత్యున్నత శిక్షణ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) అహ్మదాబాద్. దానికితోడు గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్ ఏర్పాటు చేశారు. తరవాతి రోజుల్లో విజయవాడ (ఆంధ్రప్రదేశ్), కురుక్షేత్ర(హర్యానా), భోపాల్(మధ్యప్రదేశ్), జోర్హాట్(రాజస్థాన్)లలో కూడా ఎన్ఐడి దేనికదిగా ఏర్పాటై గ్రాడ్యుయేట్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. వీటన్నింటికి కలిపి అడ్మిషన్లకు ప్రకటన విడుదలైంది.

కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి). డిజైన్ ఎడ్యుకేషన్, సంబంధిత పరిశోధనలో గ్లోబల్ లీడర్‌గా అవతరించాలన్నది ఎన్ఐడి లక్ష్యం. విభిన్న డొమైన్లు ఇక్కడ ఉన్నాయి. కోర్సు పూర్తయ్యేనాటికి సంబంధిత పరిశ్రమలో ఇమిడిపోయే వ్యక్తిగా విద్యార్థిని తీర్చిదిద్దుతారు.

బీ డిజైన్ సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 128 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2005 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్ - పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో అడుగుతారు. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు.

ఎం డిజైన్
ఎన్ఐడి, అహ్మదాబాద్ క్యాంపస్ గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్‌లో మాత్రమే ఎం డిజైన్ కోర్సును అందిస్తున్నారు. మొత్తం 14 డిసిప్లిన్లలో దీనిని అందిస్తున్నారు. వివరాలకు సంబంధిత బ్రోచర్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు రూ.2000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 1
- **డీఏటీ ప్రిలిమ్స్ తేదీ:** డిసెంబర్ 21
- **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

SCHOLARSHIP ALERT

Colgate Keep India Smiling Scholarship 2025-26

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.
Eligibility: Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for the MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.
Prizes & Rewards: Scholarship of INR 75,000
Last Date to Apply: 09-11-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CKISSP7
buddy4study.com

చిత్రజ్యోతి
SINCE 1965




దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను

సుధీర్‌బాబు


"జటాధర' చిత్రంలో నేను పోషించిన పాత్రను తెలుగులో ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు. నా సినిమా హిట్ అయితే అది నా కష్టంగా భావిస్తా. ఫ్లాప్ అయితే నా ఓటమిగా స్వీకరిస్తా' అని హీరో సుధీర్ బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రం 'జటాధర'. సోనాక్షి సిన్హా హీరోయిన్. ఉమేశ్‌కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఇందులో దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను. సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. శివుడి నేపథ్యంలో వచ్చే సీక్వెన్స్‌కు గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'జటాధర' సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది' అని శివిన్ నారంగ్ చెప్పారు. 'నాకు తెలుగు చిత్ర పరిశ్రమ అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం విషయంలో సహకారం అందించిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు' అని ప్రేరణ అరోరా పేర్కొన్నారు.

స్టైలిష్ క్లైమాక్స్‌కు సిద్ధం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్‌పై సాహుగారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ గురించి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందంపై స్టైలిష్ క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని, విజువల్‌గా అద్భుత అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో కథానాయకుడు వెంకటేశ్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

60వ వసంతంలోకి షారుక్



ఫరాఖాన్

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ తన 60వ పుట్టినరోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముంబైలోని ఆయన నివాసం మన్నత్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ఇతర సెలెబ్రిటీలతో కిక్కిరిసిపోయింది. ఫరాఖాన్, కరణ్ జోహర్, రాణి ముఖర్జీ తదితరులు షారుక్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటి లాగే ఈసారి కూడా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది అభిమానులు షారుక్ నివాసానికి తరలి వచ్చారు.

భయం కాదు.. విధ్వంసం

షారుక్ ఖాన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం షారుక్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఓ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ముందునుంచి ప్రచారంలో ఉన్న 'కింగ్' అనే టైటిల్‌నే అధికారికంగా నిర్ణయించారు. 'నేనెంత మందిని చంపానో గుర్తులేదు. వారు మంచివాళ్లా, చెడ్డవాళ్లా అన్నది నేనెప్పుడూ అడగలేదు. వారి కళ్లల్లో భయం మాత్రమే నాకు గుర్తుంది', 'వెయ్యికి పైగా హత్యలు చేసి, వందలాది దేశాల్లో మోస్ట్ వాంటెడ్ అయిన నాకు ఈ ప్రపంచం ఇచ్చిన పేరు.. కింగ్, 'నేను భయం కాదు.. విధ్వంసం' అనే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్‌మెంట్స్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాలో సరికొత్త షారుక్‌ను చూస్తారని మేకర్స్ హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లో భారీ ఈవెంట్

మహేశ్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రబృందం నుంచి అప్డేట్ వచ్చింది. ఈనెల 15న హైదరాబాద్‌లో గ్లోబ్ ట్రోటర్ పేరుతో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. అందులో సినిమా టైటిల్, గ్లింప్స్ వీడియోను ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఓ ఓటీటీ సంస్థ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. కాగా, సినిమా ప్రారంభమై రెండేళ్లు అవుతున్నా మేకర్స్ నుంచి అధికారికంగా ఒక్క అప్డేట్ కూడా రాలేదు. అయితే నవంబరులో అప్డేట్ ఇస్తామని గతంలో రాజమౌళి ఓ పోస్టు చేశారు. సినిమా టైటిల్‌తో పాటు మహేశ్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేస్తామని చెప్పడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే నవంబరు మొదలైనా ఎలాంటి అప్డేట్ రాలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు 'నవంబరులో మీరు మాకు ఒక హామీ ఇచ్చారు. దయచేసి ఆ మాట నిలబెట్టుకోండి' అని ట్వీట్ చేశారు. దీంతో జక్కన్న కూడా 'సరే మహేశ్.. నవంబరు మొదలైంది ఇప్పుడే కదా.. మేము తప్పకుండా ఒక్కొక్కటిగా వెల్లడిస్తాం' అని సమాధానం ఇచ్చారు.

పెళ్లి తర్వాత ప్రేమంటే?



ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ప్రేమంటే'. సుమ కనకాల కీలకపాత్ర పోషిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. టైటిల్‌కు తగ్గట్లుగానే ప్రేమలో ఉన్నప్పుడు పెళ్లి తర్వాత జీవితం గురించి కనే కలలు, వాస్తవ జీవితంలోని చిన్న చిన్న సమస్యలతో ఎలా మారుతుందో చూపిస్తూ ఆద్యంతం వినోదంగా సాగిన టీజర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్‌రెడ్డి.

మనం గర్వపడే సినిమా

రామ్ పోతినేని



రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రచార చిత్రాలు, టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ 'ఆంధ్రా కింగ్ తాలూకా' నేను గర్వపడే సినిమా. మనమందరం గర్వపడే సినిమా. నా కెరీర్‌లో ఇంత అందమైన సినిమా ఇచ్చిన మహేశ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కన్నడ నటుడు ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 28న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.

గెలుపు పాటతో మొదలు



కన్నడ హీరోలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి నటిస్తున్న మల్టీస్టారర్ '45 ది మూవీ'. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం. రమేశ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'గెలుపు తలుపు దొరికేవరకూ దిగులు పడకురా' అంటూ సాగే గీతాన్ని యూనిట్ ఆదివారం విడుదల చేసింది. దర్శకుడు అర్జున్ జన్య ఈ గీతాన్ని స్వరపరిచారు. రోల్ రైడా, వినాయక్ ఆలపించారు. సినిమాటోగ్రఫీ: సత్య హెగ్డే.

వసుదేవ సుతం



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. ధన లక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'వసుదేవ సుతం' అంటూ సాగే గీతాన్ని హీరో ఆకాశ్ జగన్నాథ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పల్లెటూరి వాతావరణంలో అందర్నీ కట్టిపడేసేలా చిత్రీకరించిన ఈ పాట నాకు బాగా నచ్చింది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకం ఉంది. చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరుకున్నారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు.

చాందినీ చిత్రం షురూ



చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు తరుణ్ భాస్కర్ క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రానికి వికాస్ దర్శకుడు. సహచారి ప్రొడక్షన్ పతాకంపై సృజన్ గోపాల్ నిర్మిస్తున్నారు. సుశాంత్ యాష్కీ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా సృజన్ గోపాల్ మాట్లాడుతూ 'సైన్స్ ఫిక్షన్ డార్క్ కామెడీ జానర్లో ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఎవరూ ఊహించని ఒక సూపర్ హీరోను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. వికాస్ మాట్లాడుతూ 'అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం కథ సాగుతుంది. కాన్సెప్ట్ వీడియోను త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

రైతుల వెతలే కథగా...



పులివెందుల మహేశ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి షన్ను కథానాయిక. గంగా భవాని నిర్మించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న సినిమా విడుదల కానుంది. ఇటీవలె నిర్వహించిన వేడుకలో చిత్ర దర్శకుడి తల్లిదండ్రులు ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సుమన్ మాట్లాడుతూ 'ఒక రైతు పాత్రలో రైతులకు అండగా నిలబడేలా నా క్యారెక్టర్ ఉండబోతుంది' అని తెలిపారు.



ప్రపంచం అందింది మనమ్మాయ్ నవ్వింది

భారత్‌దే వన్డే ప్రపంచ కప్

ఫైనల్లో దక్షిణాఫ్రికా చిత్తు

● దీప్తి, షఫాలీ ఆల్‌రౌండ్ షో ● కెప్టెన్ వోల్వార్ట్ సెంచరీ వృథా

డబ్బే డబ్బు.. భారత్‌కు - రూ. 39.50 కోట్లు | దక్షిణాఫ్రికాకు - రూ. 19.78 కోట్లు

మహిళల వన్డే వరల్డ్‌కప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఎక్కువ పరుగులు (4 ఇన్నింగ్స్‌లో 331) చేసిన బ్యాటర్‌గా హర్మన్‌ప్రీత్. బెలిండా క్లార్క్ (6 ఇన్నింగ్స్‌లో 330)ను అధిగమించింది.

పురుషుల, మహిళల క్రికెటర్లలో వరల్డ్ కప్ ఫైనల్లో ఫిఫ్టీ సాధించిన యంగెస్ట్ ప్లేయర్ (21 ఏళ్లు) గా షఫాలీ వర్మ.

1

మహిళల వరల్డ్‌కప్ ఎడిషన్‌లో భారత్ తరపున ఎక్కువ పరుగులు (434) సాధించిన బ్యాటర్‌గా స్మృతి మంధాన. 2017 వరల్డ్‌కప్‌లో మిథాలీ 409 పరుగులు సాధించింది. అలాగే ఒకే ఎడిషన్‌లో 200+ రన్స్, 20+ వికెట్లు తీసిన ఏకైక ప్లేయర్‌గా దీప్తి శర్మ నిలిచింది.

మహిళల వరల్డ్‌కప్ ఫైనల్లో 50+ రన్స్, 5 వికెట్లు తీసిన ప్లేయర్‌గా దీప్తి.

మహిళల వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో అత్యధిక స్కోరు (314/9) సాధించిన రెండో జట్టుగా భారత్. 2022 ఫైనల్లో ఇంగ్లండ్‌పై ఆసీస్ 356/5 స్కోరుతో టాప్‌లో ఉంది.

2

ఒకే వరల్డ్‌కప్ (పురుషుల, మహిళల) సెమీస్, ఫైనల్లో శతకాలు బాదిన రెండో ప్లేయర్‌గా వోల్వార్ట్. 2022లో అలీసా హీలీ మొదట ఈ ఫీట్ సాధించింది. అలాగే మహిళల వన్డేల్లో ఎక్కువ శతకాలు (8) బాదిన రెండో కెప్టెన్‌గా నిలిచింది. మెగ్ లానింగ్ (11) టాప్‌లో ఉంది.

ఆహా.. ఎంత మధురమో కదా ఈ విజయం. దాదాపు ఐదు దశాబ్దాల కల నెరవేరిన వేళ.. భారతావని యావత్తూ పులకరించిపోతోంది. గతంలో రెండు పర్యాయాలు ఫైనల్‌కు వచ్చి ఉసూరుమనిపించినా.. ఈసారి వన్డే విశ్వకప్‌లో ఆఖరి పంచ్ మనమ్మాయిలదే! టోర్నీ నాకౌట్ ముందు వరకు పెద్దగా ఆకట్టుకోలేకపోయిన మనమ్మాయిలు అసలు సిసలైన మ్యాచ్‌ల్లో మాత్రం సివంగుల్లా విజృంభించారు.

సెమీస్‌లో ప్రపంచ రికార్డు ఛేదనను తిరగరాసి సమరోత్సాహంతో ఫైనల్లోకి అడుగుపెట్టగా.. టైటిల్ ఫైట్‌లోనూ పట్టు చేజారనీయలేదు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాట్‌తో.. బంతితో సఫారీలపై పిడుగల్లే పడింది. ఇక అనూహ్య రీతిలో జట్టులోకి వచ్చిన యువ సంచలనం షఫాలీ వర్మ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లోనూ అదరగొట్టింది.

ఫలితంగా భారత మహిళల క్రికెట్ చరిత్రలోనే చిరస్మరణీయ ఘట్టం ఆవిష్కృతమైంది. మన మహిళల క్రికెట్‌లో ఎవ్వరికీ సాధ్యం కాని రీతిలో వన్డే విశ్వకప్‌ను హర్మన్ బృందం సగర్వంగా ముద్దాడి.. కోట్లాది అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. ఎన్నో అవమానాలను తట్టుకుంటూ భారత మహిళల క్రికెట్ జట్టు సాధించిన పురోగతికి నిదర్శనం ఈ అద్భుతం.

ఇక అమ్మాయిలూ.. ఈ విజయస్ఫూర్తితో ఆకాశమే హద్దుగా దూసుకువెళ్లండి.. విజయోస్తు.



దీప్తి శర్మ (58; 5/39)

నవీ ముంబై: భారత మహిళల క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కోట్లాది క్రీడాభిమానుల కోరిక ఫలించిన వేళ.. వన్డే వరల్డ్‌కప్‌లో భారత జట్టు నయా చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ సేన మొట్టమొదటిసారిగా విశ్వకప్‌ను అందుకుంది. ఓపెనర్ షఫాలీ వర్మ (78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 87; 2/36), దీప్తి శర్మ (58 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 58; 5/39) ఆల్‌రౌండ్‌షోతో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్నందించారు. అటు దక్షిణాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్ (98 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 101) శతక పోరాటానికి సహకారం కరువైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 298 పరుగులు చేసింది. మంధాన (58 బంతుల్లో 8 ఫోర్లతో 45) రాణించింది. ఖాకాకు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో దక్షిణాఫ్రికా 45.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. డెర్క్‌సెన్ (35) ఫర్వాలేదనిపించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షఫాలీ, ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా దీప్తి శర్మ నిలిచారు. అంతకుముందు మ్యాచ్ సమయానికి భారీ వర్షం కురవడంతో టాస్ కూడా వీలు పడలేదు. అనంతరం రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5 గంటలకు మ్యాచ్‌ను ఆరంభించారు.

వోల్వార్ట్ సెంచరీ బాదినా..: భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా ఓపెనర్ వోల్వార్ట్ ఒంటరి పోరాటం సాగించింది. కానీ కీలక సమయంలో వికెట్లు తీసిన స్పిన్నర్లు షఫాలీ, దీప్తి శర్మ ప్రత్యర్థికి చెక్ పెట్టారు. తొలి 5 ఓవర్లలో 18 పరుగులే చేయగా.. ఆ తర్వాత వోల్వార్ట్ బౌండరీల జోరుకు పవర్‌ప్లేలో 52 పరుగులు సాధించగలిగింది. అయితే లేని పరుగు కోసం వెళ్లి ఓపెనర్ బ్రిట్స్ (23) అమన్‌జ్యోత్‌తో రనౌటైంది. ఇక శ్రీచరణి తన తొలి ఓవర్‌లోనే బాష్ (0) వికెట్ తీసి మరింత జోష్ నింపింది. ఈ దశలో లూస్‌తో కలిసి మూడో వికెట్‌కు వోల్వార్ట్ 52 పరుగులు జోడించింది. మరోవైపు పార్ట్‌టైమ్ స్పిన్నర్ షఫాలీకి బంతినిచ్చిన కెప్టెన్ హర్మన్ ఫలితం సాధించింది. చక్కగా కుదురుకున్న లూస్ (25)తో పాటు కీలక కాప్ (4)ను వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో భారత శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఆ తర్వాత జాఫ్టా (16) స్పిన్నర్ దీప్తికి చిక్కింది. ఇక వోల్వార్ట్‌ను 42వ ఓవర్‌లో దీప్తి అవుట్ చేయడంతో స్టేడియం హోరెత్తింది. అమన్ ఈ క్యాచ్‌ను రెండో ప్రయత్నంలో అద్భుతంగా పట్టేసింది. అదే ఓవర్‌లో ట్రియాన్ (9) ఎల్బీగా వెనుదిరిగింది. దీంతో 221 రన్స్‌కే 8 వికెట్లు పడగా.. మ్యాచ్ భారత్ వైపు మొగ్గు చూపింది. చివరి రెండు వికెట్లు సైతం నాలుగు పరుగుల వ్యవధిలోనే నేలకూలడంతో భారత్‌కు అద్భుత విజయం దక్కింది.

శతక భాగస్వామ్యంతో ఆరంభం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆరంభంలో ఓపెనర్ షఫాలీ మెరుపులు.. మధ్య ఓవర్లలో దీప్తి శర్మ సంయమన ఆటతీరు.. చివర్లో రిచా ఘోష్ ఎదురుదాడితో 300 స్కోరు దరిదాపుల్లోకి రాగలిగింది. మంధాన దూకుడుగా ఆడకుండా షఫాలీకి సహకరించింది. ఇద్దరి ఆటతీరుతో తొలి వికెట్‌కు 104 పరుగుల శతక భాగస్వామ్యం జత చేరింది. ప్రతీకా గాయంతో ఏకంగా జట్టులో చోటు దక్కించుకున్న షఫాలీ కీలక ఫైనల్లో



షఫాలీ వర్మ (87; 2/36)

దుమ్ము రేపింది. దీంతో పవర్‌ప్లేలోనే భారత్ 64 పరుగులతో జోరు మీద కనిపించగా, ఈ స్థితిలో 320+ స్కోరు ఖాయమనిపించింది. కానీ ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో స్పిన్నర్లు ప్రభావం చూపి పరుగులకు ముకుతాడు వేశారు. అటు 18వ ఓవర్‌లో మంధాన వెనుదిరిగింది. 56 పరుగుల వద్ద షఫాలీ క్యాచ్‌ను బాష్ వదిలేసింది. కానీ రెండో వికెట్‌కు 62 పరుగులు జత చేరాక షఫాలీ, జెమీమా (24)లను పేసర్ ఖాకా వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన దీప్తి జట్టును ఆదుకునే ప్రయత్నం చేసింది. దీప్తితో కలిసి నాలుగో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం అందించిన హర్మన్ (20)ను స్పిన్నర్ ఎంలబా దెబ్బతీసింది. అనంతరం అమన్‌జోత్ (12) అవుటయ్యాక క్రీజులోకి వచ్చిన రిచా సిక్సర్‌తో ఖాతా తెరిచింది. ఖాకా ఓవర్‌లో సిక్సర్ బాదాక తన క్యాచ్‌ను డీప్ స్క్వేర్‌లో బాష్ వదిలేసింది. అయితే ఎక్కువ సేపు క్రీజులో నిలువకుండా తను 49వ ఓవర్‌లో ఖాకాకే చిక్కడంతో భారత్ ఆశించిన స్కోరుపై ప్రభావం పడింది. ఆరో వికెట్‌కు రిచా-దీప్తి 47 పరుగులు సమకూర్చారు. ఇక అర్ధసెంచరీ పూర్తి చేసిన దీప్తి ఇన్నింగ్స్ చివరి బంతికి రనౌటైంది.



ఏమని వర్ణించగలం?

అద్భుతం..అమోఘం..అపూర్వం..అనన్య సామాన్యం..వన్డే ప్రపంచ కప్ నాకౌట్ నుంచి భారత జట్టు కనబరచిన ప్రదర్శనకు ఈ ఉపమానాలన్నీ సరిపోవేమో! ఆతిథ్య జట్టే అయినా మెగా టోర్నమెంట్ ప్రారంభంలో హర్మన్ సేనపై పెద్దగా అంచనాల్లేవు. పైగా ప్రపంచ కప్‌కు ముందు స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌నూ టీమిండియా కోల్పోయింది. దాంతో సొంతగడ్డపై జరుగుతున్నా..వరల్డ్ కప్‌లో మన అమ్మాయిలను టైటిల్ ఫేవరెట్లలో ఒకరిగా క్రికెట్ పండితులు అంచనా వేయలేదు. అంతేకాదు మెగా టోర్నమెంట్‌లో భారత్ ప్రస్థానమూ సాఫీగా సాగలేదు. శ్రీలంక, పాకిస్థాన్‌లాంటి జట్లపై గెలుపొందినా..బలమైన టీమ్‌లకు ఎదురొడ్డలేకపోయింది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లపై పరాజయాలు చవిచూసింది. ఈనేపథ్యంలో అసలు సెమీఫైనల్‌కు చేరగలమా అనే అనుమానాలు ఉదయించాయి. కానీ తరువాతి మ్యాచ్‌ల్లో పుంజుకుని సెమీస్‌ఫైనల్లోకి అడుగుపెట్టి.. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో అమీతుమీకి సిద్ధమైంది. టోర్నమెంట్‌లో సెమీస్ ముందుకు వరకు టీమిండియా ఆట ఒక ఎత్తయితే నాకౌట్ నుంచి సాగిన భారత ఆట నిస్సందేహంగా మరో ఎత్తు ! కప్పు కల నెరవేరేందుకు కేవలం రెండడుగుల దూరంలో నిలిచిన మనోళ్లు ఆస్ట్రేలియాపై ఆకాశమే హద్దుగా విజృంభించారు. మహిళల క్రికెట్ చరిత్రలో నభూతో..అనే మ్యాచ్‌ను ఆవిష్కరించారు. ఆల్‌రౌండ్ షోతో ఏడుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియాను పడగొట్టిన ఉత్సాహంతో ఫైనల్లోనూ ఉమెన్ ఇన్ బ్లూ అదరగొట్టారు. దక్షిణాఫ్రికా ఎదుట దాదాపు 300 పరుగుల లక్ష్యాన్ని ఉంచి మానసికంగా దెబ్బ కొట్టారు. కీలక బ్యాటర్లను త్వరగా పెవిలియన్ చేర్చి బౌలర్లు తమ కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వర్తించారు. అయితే కెప్టెన్ వోల్వార్ట్ సెంచరీ ఇన్నింగ్స్‌తో గుబులు రేపినా అమన్‌జోత్ సూపర్ క్యాచ్‌తో ఆమె అవుట్ కావడంతో భారత్ విజయం ఖాయమైంది. మొత్తంగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలలో తిరుగులేని ప్రదర్శన కనబరచి విశ్వ విజేతలుగా నిలిచిన మన అమ్మాయిలకు హాట్సాఫ్..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

భళా..శ్రీచరణి



ఆడిన తొలి ప్రపంచ కప్‌లోనే తెలుగమ్మాయి శ్రీచరణి సత్తా చాటింది. 21 ఏళ్ల ఈ లెఫ్టామ్ స్పిన్నర్ టోర్నీలో అన్ని మ్యాచ్‌ల్లో ఆడడం ఆమె ప్రతిభపై జట్టు యాజమాన్యం పెట్టుకున్న నమ్మకాన్ని సూచించింది. వారి నమ్మకాన్ని వమ్ము చేయని శ్రీచరణి మొత్తం 12 వికెట్లు తీసి భళా అనిపించింది. ముఖ్యంగా బలమైన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లతో మ్యాచ్‌ల్లో ఆమె విశేషంగా రాణించింది.

స్కోరు బోర్డు

భారత్: స్మృతి మంధాన (సి) జాఫ్టా (బి) ట్రియన్ 45, షఫాలీ (సి) లూస్ (బి) ఖాక 87, జెమీమా (సి) వోల్వార్డ్ (బి) ఖాక 24, హర్మన్‌ప్రీత్ (బి) ఎంలబా 20, దీప్తి శర్మ (రనౌట్) 58, అమన్‌జోత్ (సి అండ్ బి) డిక్లెర్క్ 12, రిచా ఘోష్ (సి) డెర్క్‌సెన్ (బి) ఖాక 34, రాధా యాదవ్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 50 ఓవర్లలో 298/7; వికెట్ల పతనం:** 1-104, 2-166, 3-171, 4-223, 5-245, 6-292, 7-298; **బౌలింగ్:** కాప్ 10-1-59-0, ఖాక 9-0-58-3, ఎంలబా 10-0-47-1, డిక్లెర్క్ 9-0-52-1, లూస్ 5-0-34-0, ట్రియాన్ 7-0-46-1.

దక్షిణాఫ్రికా: లారా వోల్వార్డ్ (సి) అమన్‌జోత్ (బి) దీప్తి 101, బ్రిట్స్ (రనౌట్) 23, బాష్ (ఎల్బీ) శ్రీచరణి 0, లూస్ (సి అండ్ బి) షఫాలీ 25, కాప్ (సి) రిచా (బి) షఫాలీ 4, జాఫ్టా (సి) రాధ (బి) దీప్తి 16, డెర్క్‌సెన్ (బి) దీప్తి 35, ట్రియాన్ (ఎల్బీ) దీప్తి 9, డిక్లెర్క్ (సి) హర్మన్ (బి) దీప్తి 18, ఖాక (రనౌట్) 1, ఎంలబా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 45.3 ఓవర్లలో 246 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-51, 2-62, 3-114, 4-123, 5-148, 6-209, 7-220, 8-221, 9-246, 10-246; **బౌలింగ్:** రేణుక 8-0-28-0, క్రాంతి గౌడ్ 3-0-16-0, అమన్‌జోత్ 4-0-34-0, దీప్తి శర్మ 9.3-0-39-5, శ్రీచరణి 9-0-48-1, రాధా యాదవ్ 5-0-45-0, షఫాలీ 7-0-36-2.

గవాస్కర్, టెండూల్కర్, ధోనీ, కోహ్లీ, రోహిత్ తదితరులను క్రికెట్ దేవుళ్లుగా ఆరాధించే మన దేశంలో ఒకప్పుడు మహిళల క్రికెట్‌పై అంతులేని వివక్ష ఉండేది. ప్రభుత్వ ప్రోత్సాహం గానీ, ప్రైవేట్ స్పాన్సర్‌షిప్‌లుగానీ లేని ఆ కాలంలో అమ్మాయిలు క్రికెట్ ఆడడమే విడ్డూరంగా ఉండేది. అలాంటి పరిస్థితుల నుంచి యువతులు క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే స్థాయికి ఎదిగింది. ఇవాళ దేశంలో పురుషులతో సమానంగా మహిళల మ్యాచ్‌లకూ క్రికెట్ స్టేడియాలు నిండుతున్నాయి.. మెగా టోర్నీల్లో మనమ్మాయిలు ట్రోఫీలు గెలుస్తున్నారు.. తాజాగా హర్మన్‌ప్రీత్ సారథ్యంలో భారత సీనియర్ జట్టు వన్డే ప్రపంచ చాంపియన్‌గా నిలవడం. ఇలా.. రోజురోజుకూ మహిళా క్రికెట్ అత్యున్నత స్థాయికి ఎదగడం వెనక ఉన్న వ్యక్తి, శక్తి మిథాలీ రాజ్. తన కెరీర్‌నే సోపానంగా మలచి దేశ క్రికెట్ భవిష్యత్తును

మహిళల క్రికెట్ ముఖచిత్రం.. మిథాలీ



నిర్మించే అవకాశం దక్కించుకున్న నిఖార్సయిన క్రీడాకారిణి మిథాలీ. సుదీర్ఘంగా 23 ఏళ్ల పాటు కొనసాగిన తన దిగ్విజయ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు, రికార్డులు అందుకుంది మిథాలీ. ప్రపంచకప్‌లో రెండు సార్లు (2005, 2017) జట్టును ఫైనల్స్ దాకా తీసుకెళ్లి భారత మహిళా క్రికెట్‌కు గౌరవాన్ని, స్వర్ణయుగాన్ని తీసుకొచ్చింది. ధోనీతో సమానంగా మహిళల కెప్టెన్‌గా ఖ్యాతి గడించింది. అంచలంచెలుగా ఎదిగి మహిళల క్రికెట్‌కు ముఖచిత్రంగా మారింది. ఇవాళ.. వన్డే ప్రపంచ కప్ చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టులోని సభ్యుల్లో దాదాపు అందరికీ మిథాలీనే ఆదర్శం. గతంలో మిథాలీ వేసిన పునాదికి ఇప్పుడు ప్రపంచ కప్ విజేత రూపంలో ప్రతిఫలం దక్కిందనుకోవచ్చు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టీ20లకు కేన్ వీడ్కోలు



వన్డే, టెస్టులకు పరిమితం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ వెటరన్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే వన్డే, టెస్టుల్లో కొనసాగుతానని ప్రకటించాడు. వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు ముందు అతనీ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలిగేందుకు ఇదే సరైన సమయమని, జట్టు ఎంపికపై సెలెక్టర్లకు కూడా తగిన స్పష్టత వస్తుందని 35 ఏళ్ల కేన్ తెలిపాడు. అయితే ఫ్రాంచైజీ క్రికెట్‌పై మాత్రం నిర్ణయం తీసుకోలేదు. 2011లో టీ20ల్లో అరంగేట్రం చేసిన కేన్ 93 మ్యాచ్‌ల్లో 2575 రన్స్ సాధించాడు. అలాగే 75 టీ20ల్లో కెప్టెన్‌గా వ్యవహరించగా.. అతడి ఆధ్వర్యంలోనే కివీస్ టీ20 వరల్డ్‌కప్ 2016, 2022 సెమీస్‌లో.. 2021 ఫైనల్లో తలపడింది. మరోవైపు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా జట్టును ఫైనల్‌కు చేర్చాడు. గతేడాది గుజరాత్‌కు ఆడగా.. 2025 సీజన్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలాడు.

అదరగొట్టిన సుందర్

అర్ష్‌దీప్‌కు 3 వికెట్లు

● 5 వికెట్లతో భారత్ గెలుపు
● ఆసీస్‌తో మూడో టీ20



వాషింగ్టన్ సుందర్

అర్ష్‌దీప్

హోబర్ట్: వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 49 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్‌తోపాటు అర్ష్‌దీప్ (3/35) విజృంభించడంతో.. ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. ఆదివారం జరిగిన మూడో టీ20లో టీమిండియా 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత ఆసీస్ 20 ఓవర్లలో 186/6 స్కోరు చేసింది. టిమ్ డేవిడ్ (74), స్టొయినిస్ (64) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. వరుణ్ చక్రవర్తి2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 18.3 ఓవర్లలో 188/5 చేసి గెలిచింది. తిలక్ వర్మ (29), అభిషేక్ శర్మ (25), సూర్యకుమార్ (24) రాణించారు. నాథన్ ఎల్లీస్ మూడు వికెట్లు దక్కించుకొన్నాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అర్ష్‌దీప్ నిలిచాడు.

టాప్ తడబడినా..: ఛేదనలో సుందర్ ఆటే హైలైట్‌గా నిలిచింది. తిలక్‌తో కలసి ఐదో వికెట్‌కు 34 పరుగులు జోడించిన సుందర్.. ఆరో వికెట్‌కు జితేష్ (22 నాటౌట్)తో కలసి 25 బంతుల్లో 45 పరుగుల అజేయ భాగస్వామ్యంతో జట్టును గెలిపించాడు. ఓపెనర్లు అభిషేక్ శర్మ, గిల్ (15) పవర్‌ప్లేలోనే పెవిలియన్ చేరారు. వీరిద్దరినీ ఎల్లిస్ అవుట్ చేశాడు. సూర్యకుమార్ దూకుడుగా ఆడే క్రమంలో వికెట్ పారేసుకొన్నాడు. అయితే, తిలక్, అక్షర్ పటేల్ (17) నాలుగో వికెట్‌కు 35 పరుగులతో ఆదుకోవడంతో టీమ్ స్కోరు సెంచరీ మార్క్ దాటింది. కానీ, అక్షర్‌ను కూడా ఎల్లిస్ వెనక్కిపంపాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సుందర్.. తిలక్‌తో కలసి ఎదురుదాడి చేయడంతో టీమిండియా గెలుపు సునాయాసమైంది. 14వ ఓవర్‌లో సీన్ అబాట్ బౌలింగ్‌లో సుందర్ 19 పరుగులు రాబట్టడంతో భారత్ 145/4తో గెలుపు బాటలో నిలిచింది. తిలక్‌ను బ్రాట్‌లెట్ అవుట్ చేసినా.. జితేశ్‌తో కలసి సుందర్ మరో 9 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: హెడ్ (సి) సూర్య (బి) అర్ష్‌దీప్ 6, మార్ష్ (సి) తిలక్ (బి) వరుణ్ 11, ఇంగ్లిస్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 1, డేవిడ్ (సి) తిలక్ (బి) దూబే 74, ఓవెన్ (బి) వరుణ్ 0, స్టొయినిస్ (సి/సబ్) రింకూ (బి) అర్ష్‌దీప్ 64, షార్ట్ (నాటౌట్) 26, బ్రాట్‌లెట్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 20 ఓవర్లలో 186/6; వికెట్ల పతనం:** 1-6, 2-14, 3-73, 4-73, 5-118, 6-182; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-3, బుమ్రా 4-0-26-0, వరుణ్ 4-0-33-2, అక్షర్ 4-0-35-0, శివం దూబే 3-0-43-1, అభిషేక్ 1-0-13-0.

భారత్: అభిషేక్ (సి) ఇంగ్లిస్ (బి) ఎల్లిస్ 25, గిల్ (ఎల్బీ) ఎల్లిస్ 15, సూర్య (సి) ఎల్లిస్ (బి) స్టొయినిస్ 24, తిలక్ (సి) ఇంగ్లిస్ (బి) బ్రాట్‌లెట్ 29, అక్షర్ (సి) బ్రాట్‌లెట్ (బి) ఎల్లిస్ 17, సుందర్ (నాటౌట్) 49, జితేశ్ (నాటౌట్) 22; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 18.3 ఓవర్లలో 188/5; వికెట్ల పతనం:** 1-33, 2-61, 3-76, 4-111, 5-145; **బౌలింగ్:** బ్రాట్‌లెట్ 4-0-30-1, అబాట్ 3.3-0-56-0, ఎల్లిస్ 4-0-36-3, కునేమన్ 4-0-31-0, స్టొయినిస్ 2-0-22-1, షార్ట్ 1-0-13-0.

టీ20 జట్టునుంచి కుల్దీప్ విడుదల



హోబర్ట్: స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్ జట్టు నుంచి విడుదల జేశారు. ఈ విషయాన్ని బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. ఈనెల ఆరునుంచి భారత్ 'ఎ'-దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య బెంగళూరులో జరిగే రెండో అనధికార టెస్ట్‌లో కుల్దీప్ పాల్గొంటాడని తెలిపింది. దక్షిణాఫ్రికాతో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంలో భాగంగా కుల్దీప్‌ను భారత్ 'ఎ' జట్టు తరపున ఆడించాలని నిర్ణయించినట్టు వివరించింది.

రషీద్ శతకం



ఆంధ్ర 475/7 డిక్లేర్డ్ | ఒడిశా 80/4

కటక్: రషీద్ (140 నాటౌట్) సెంచరీ చేయడంతో.. ఒడిశాతో రంజీలో ఆంధ్ర భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజు 222/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 475/7 వద్ద డిక్లేర్ చేసింది. సౌరభ్ కుమార్ (69), శశికాంత్ (46) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఒడిశా 80/4 స్కోరు చేసింది. ఆదివారం ఆట ఆఖరుకు సందీప్ (24), గోవింద పటీదార్ (1) క్రీజులో ఉన్నారు. సాయితేజ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

కార్తీక్ శుభారంభం

పనాజీ (గోవా): ఫిడే వరల్డ్‌కప్‌లో కార్తీక్ వెంకట్రామన్ శుభారంభం చేశాడు. ఆదివారం ముగిసిన తొలి రౌండ్‌లో కార్తీక్ తొలి రౌండ్‌లోని ఒక గేమ్‌ను డ్రా చేసుకుని, మరో గేమ్‌లో నెగ్గాడు. రాబర్టో (క్యూబా) పై నెగ్గిన కార్తీక్ 1.5-0.5తో ముందంజ వేశా డు. లలిత్ బాబు ఒక గేమ్‌లో గెలిచి, మరో గేమ్‌లో ఓడి 1-1తో వామర్‌డామ్ (నెదర్లాండ్స్)తో సమం చేసుకున్నాడు. రాజా రిత్విక్ 1-1తో నోజర్‌బెక్(కజకిస్థాన్)తోడ్రాగాముగించాడు.

నేటి నుంచి హెలికాప్టర్ సర్వే

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పునరుద్ధరణ కోసం నిర్వహణ

- స్వయంగా పర్యవేక్షించనున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్
- నేడు మన్నెవారిపల్లికి రేవంత్



హైదరాబాద్/నాగర్‌కర్నూల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకం పనుల పునరుద్ధరణలో భాగంగా సోమవారం హెలికాప్టర్‌తో 'మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వే'ను ప్రారంభించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా మన్నేవారిపల్లి చేరుకుని సర్వేను పర్యవేక్షించనున్నారు. సర్వే జరిపే హెలికాప్టర్‌కు సమాంతరంగా మరో హెలికాప్టర్‌లో సీఎం, మంత్రి ప్రయాణిస్తూ పరిశీలిస్తారు. నేషనల్ జియోఫిజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సర్వే హెలికాప్టర్ దాదాపు 200 కి.మీ. మేర ప్రయాణిస్తూ సొరంగం తవ్వాల్సిన ప్రాంతంలో భూగర్భంలో 800-1000 మీటర్ల లోతు వరకు ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో జల్లెడ పడుతుంది. గత ఫిబ్రవరిలో సొరంగం కుప్పకూలిన ఘటనలో కార్మికులు మృత్యువాత పడడంతో పాటు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ముక్కలు చెక్కలైంది. దీంతో నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు అత్యంత సురక్షిత పద్ధతిలో సొరంగం తవ్వకాలను పునరుద్ధరించడానికి ఈ సర్వే నిర్వహించాలని ప్ర భుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టులో భాగంగా రెండు సొరంగాల్లో రెండోదాని తవ్వకాలు పూర్తయ్యాయి. ఒకటో సొరంగాన్ని మొత్తం 43.93 కి.మీ. తవ్వాల్సి ఉండగా.. ఇన్‌లెట్ వైపు నుంచి 13.94 కి.మీ., అవుట్‌లెట్ వైపు నుంచి 20.4 కి.మీ. తవ్వకం ఇప్పటికే పూర్తయింది. మధ్యలో 9.8 కి.మీ. తవ్వాల్సి ఉంది.

సర్వే ఇలా చేస్తారు..

24 మీటర్ల వ్యాసం కలిగిన ట్రాన్స్‌మిటర్ లూప్‌ను హెలికాప్టర్‌కు వేలాడదీస్తారు. హెలికాప్టర్ సొరంగం తవ్వాల్సిన ప్రాంతంపై ఎగురుతుండగా ట్రాన్స్‌మిటర్ లూప్ ద్వారా సర్వే చేస్తారు. అది విద్యుదయస్కాంత తరంగాలను పంపిస్తుంది. అవి భూగర్భంలోని పొరలకు తాకి తిరిగొస్తాయి. వాటిని రిసీవర్ ద్వారా గ్రహించి.. వాటి ఆధారంగా భూగర్భంలో ఎలాంటి నిర్మాణం ఉందో అంచనా వేస్తారు. 800-1,000 మీటర్ల లోతుల్లో ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయా? నీళ్లు ఉన్నాయా? వంటి అంశాలను నిపుణులు అధ్యయనం చేస్తారు. తద్వారా సొరంగం తవ్వకాలకు ఎలాంటి టెక్నాలజీ వినియోగించాలో సిఫారసు చేస్తారు.

సీఎం పర్యటనపై ఆసక్తి

నల్లగొండ జిల్లాకు సాగు నీరందించే ఎస్ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణకు కీలక సర్వే జరగనున్న నేపథ్యంలో నాగర్‌కర్నూలు జిల్లా నల్లమలలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నప్పటికీ సోమవారం ఆయన ఇక్కడకు రానుండడం ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12:30 గంటలకు ఆయన మన్నెవారిపల్లికి చేరుకోనున్నారు. అక్కడ పార్టీ అచ్చంపేట నాయకులతో సమావేశమైన తర్వాత సర్వే పరిశీలనలో పాల్గొంటారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడతారు.

నేటి నుంచి ప్రైవేటు కాలేజీలు బంద్

- బకాయిల విడుదలపై అధికారులతో చర్చలు విఫలం

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థలు సోమవారం నుంచి సమ్మె బాట పట్టనున్నాయి. డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ సహా అన్ని వృత్తి విద్య కాలేజీలు సమ్మెలో పాల్గొననున్నాయి. యాజమాన్యాల సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా 1,840 కాలేజీలు బంద్ కానున్నాయి. ఫలితంగా దాదాపు 35లక్షలకు పైగా విద్యార్థులపై సమ్మె ప్రభావం పడనుంది. గత నాలుగేళ్లుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య (ఫాతీ) గత రెండు నెలలుగా ప్రభుత్వాన్ని కోరుతోంది. పలు విడతలుగా చర్చలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో దీపావళిలోగా రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని గతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. అయితే ఇందులో రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేశారు. మిగతా రూ.900 కోట్లు వెంటనే విడుదల చేయాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో ప్రభుత్వానికి ఫాతీ సమ్మె నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఫాతీ ప్రతినిధులతో మాట్లాడారు. రూ.150 కోట్లు విడుదల చేస్తామని, సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి యాజమాన్యాలు అంగీకరించలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నామని ఫాతీ అధ్యక్షుడు నిమ్మగడ్డ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం నుంచి అన్ని ఉన్నత విద్యాసంస్థలు సమ్మెలో పాల్గొంటాయన్నారు. ప్రభుత్వంతో చర్చలు కొనసాగినా.. బకాయిలు ఇవ్వనంతవరకు సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. సమ్మె నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షలు వాయిదా వేయాలని అన్ని వర్సిటీలను కోరినట్టు తెలిపారు. సమ్మె నేపథ్యంలో పరీక్షలు వాయిదా పడ్డాయి. జేఎన్‌టీయూ పరిధిలోని ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ వార్షిక పరీక్షలను వాయిదా వేశారు. అలాగే బీఈడీ, డీఈడీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. అనేక కాలేజీల్లో జరుగుతున్న ఇంజనీరింగ్ ఇంటర్నల్ పరీక్షలనూ వాయిదా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 800 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉండగా.. 300 ఎంబీఏ-ఎంసీఏ, 215 బీఈడీ, 175 ఇంజనీరింగ్, 123 ఫార్మసీ, 100 పాలిటెక్నిక్, 70 డైట్, 27 ఆర్కిటెక్చర్, 30 న్యాయ కళాశాలలున్నాయి.

టీచర్ల పెండింగ్ బిల్లులు, డీఏ ఇవ్వకుంటే కాంగ్రెస్ విజయోత్సవాలను అడ్డుకుంటాం

- డిసెంబరు 9లోపు సమస్యలు పరిష్కరించాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను డిసెంబరు 9 లోపు పరిష్కరించాలని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకొనేందుకు అవకాశం ఇవ్వబోమని, వాటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర (పీఆర్‌టీయూటీఎస్) 36వ సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి దాదాపు 2 వేల మంది ఉపాధ్యాయ ప్రతినిధులు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్వీస్‌లో ఉన్న ఏ ఒక్క ఉపాధ్యాయుడు కూడా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాయాల్సిన పనిలేకుండా పోరాడతామని భరోసానిచ్చారు. అవసరమైతే విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తామని తెలిపారు. 2020కి ముందు నియమించిన టీచర్లు టెట్ రాయకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఇప్పటికే ఒత్తిడి పెంచామని, అనుకూల ఉత్తర్వులు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా టీచర్లకు నగదు రహిత వైద్య సేవలు అందించాలని, రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన విస్తృత సమావేశానికి హాజరైన వారికి అభివాదం చేస్తున్న బీసీ సంఘాల, రాజకీయ నేతలు

బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ తప్పనిసరి

- బీసీ జేఏసీ సమావేశంలో అఖిలపక్ష నేతల ప్రకటన
- 8 దశల ఆందోళన కార్యాచరణకు ఆమోదం

బంజారాహిల్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీలకు న్యాయం జరగాలంటే రాజ్యాంగ సవరణ చేయడం తప్పనిసరని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నేతలు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ విషయమై చట్టం చేయకపోతే గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. రిజర్వేషన్ల సాధన కోసం 8 దశల కార్యాచరణ ఆందోళనను సమావేశం ఆమోదించింది. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, కో-చైర్మన్ దాసు సురేశ్ సంయుక్త ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో సమావేశం జరిగింది. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. 'బీసీ రిజర్వేషన్ల కోసం రాజీ లేని సమరమే. బీసీలకు రాజకీయ, సామాజిక న్యాయం జరిగే వరకూ ఈ ఉద్యమం ఆగదు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలదే బీసీ రిజర్వేషన్ల పెంపు బాధ్యత' అని స్పష్టం చేశారు. దాసు సురేశ్ మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్లకు ఆదర్శమైన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల మాదిరిగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేయాల్సిందేనన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. జెండాను పక్కనబెట్టి ఒకే ఏజెండాతో పని చేస్తే లక్ష్యం నెరవేరుతుందన్నారు. సినీ నటుడు ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ.. చరిత్రలో పోరాడిన సమాజమే గెలిచిందని, బీసీలూ తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ, విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్ అనిల్, సినీ దర్శకుడు ఎన్. శంకర్, రచయిత జూలూరి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవీన్ యాదవ్‌ను ఓడగొట్టేందుకు బీఆర్ఎస్ నేతల కుట్ర

- కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా హైడ్రా అధికారుల అత్యుత్సాహం
- దీనిపై హైడ్రా చీఫ్ దృష్టి పెట్టాలి
- కుట్రల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ దృష్టికి తీసుకెళ్తా
- హైడ్రా దాడులను బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోంది
- బీఆర్ఎస్ అనుకూల అధికారుల కుట్రలపై విచారణ చేయాల్సిన అవసరం ఉంది
- త్వరలో హైడ్రా బాధితులను కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్తా: జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను ఓడించడానికి బీఆర్ఎస్ పార్టీ హైడ్రాను అడ్డం పెట్టుకొని కుట్రలు పన్నుతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం సంగారెడ్డిలో ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా కొందరు హైడ్రా అధికారులు పనిచేస్తున్నట్లుగా అనుమానం కలుగుతోందన్నారు. అత్యుత్సాహం చూపుతున్న అధికారులపై హైడ్రా చీఫ్ రంగనాథ్ దృష్టిపెట్టాలని సూచించారు. హైడ్రా కూల్చివేతలను బీఆర్ఎస్ సోషల్ మీడియా విస్తృతంగా ప్రచారం చేస్తూ ఉప ఎన్నికలో లబ్ధిపొందాలని చూస్తోందని వివరించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి సహకరిస్తున్నట్లుగా ఉన్న హైడ్రా అధికారుల కుట్రలకు అడ్డుకట్ట వేయాలని, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం ఉందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే హైడ్రా బాధితులను కలుస్తానని, బీఆర్ఎస్ అనుకూల అధికారుల గురించి పూర్తి వివరాలు తెలుసుకొని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇప్పటిదాకా హైడ్రా దాడుల గురించి మాట్లాడని కేటీఆర్.. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో హైడ్రా జపం చేయడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు.



సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

బిజినెస్

అమెరికాతో వాణిజ్య చర్చల్లో జర జాగ్రత్త

టారిఫ్‌లు 20% మించకూడదు ● ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

న్యూయార్క్: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం అమెరికాతో జరుపుతున్న చర్చల్లో భారత ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ప్రముఖ ఆర్థికవేత్త రఘురామ్ రాజన్ హెచ్చరించారు. ఈయూ, జపాన్ దేశాల్లా తొందరపడి అమెరికాకు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వవద్దని కోరారు. అలాగే ఈ ఒప్పందం ద్వారా అమెరికా మన ఎగుమతులపై విధించే సుంకాలు 10 నుంచి 20 శాతం మించకుండా చూసుకోవాలని కోరారు. లేకపోతే తూర్పు, దక్షిణాసియా దేశాల ఉత్పత్తులతో మన ఉత్పత్తులు పోటీపడడం కష్టమని రాజన్ స్పష్టం చేశారు. ఈయూ, జపాన్ దేశాలు అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడతామని హామీ ఇచ్చి 15 శాతం సుంకాలతో బయటపడ్డాయన్నారు. మన దేశం అలాంటి హామీలకు దూరంగా ఉండడమే మంచిదన్నారు. మన దేశం జీరో సుంకాలకు అమెరికాను ఒప్పిస్తే మరీ మంచిదన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	


ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	115
వరంగల్	107	గుంటూరు	121
కరీంనగర్	107	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	118
కర్నూలు	107	నెల్లూరు	123
విశాఖపట్నం	111	అనంతపురం	123
గోదావరి	115		

ఉద్యోగుల్లోని భిన్న ప్రతిభకు గుర్తింపు 'ఎస్‌బీఐ స్టార్'

న్యూఢిల్లీ: భిన్న రంగాల్లో ఉద్యోగుల్లోని అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) "ఎస్‌బీఐ స్టార్" అవార్డును నెలకొల్పింది. వృత్తిపరమైన నైపుణ్యాలకు వెలుపల భిన్న రంగాల్లో ఉద్యోగుల ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రతి ఏడాది అందచేస్తారు. కళలు, సాహిత్యం, క్రీడలు, సంస్కృతి, సమాజ సేవ, పర్యావరణ రంగాల్లో ఉద్యోగులు ప్రదర్శించే అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. ఎస్‌బీఐ స్టార్ అవార్డుకు ఉద్యోగులు తమను తాము నామినేట్ చేసుకోవచ్చునని ఆయన చెప్పారు. ఎంపిక ప్రక్రియ నిజాయతీగా, పారదర్శకంగా, నిర్మాణాత్మకంగా ఉంటుందన్నారు.

కోతల తర్వాతే కొత్త నియామకాలు



ఏఐతో మారుతున్న ఉద్యోగాల స్వరూపం
అయితే ఏఐతో మరింత ఉత్పాదకత
మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాల స్వరూపమే మారిపోతోందని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల మరోసారి స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఏఐతో ఉద్యోగుల పనితీరు మెరుగుపడి వారి ఉత్పాదకతా పెరుగుతోందన్నారు. బ్రాడ్ జెర్‌స్టనర్ అనే ఇన్వెస్టర్ నిర్వహించిన బీజీ2 అనే పాడ్‌కాస్ట్‌లో ఆయన ఈ విషయాలు చెప్పారు. ఏఐ నైపుణ్యాలు లేని ఉద్యోగుల తొలగింపు పూర్తయిన తర్వాత మైక్రోసాఫ్ట్ మళ్లీ నియామకాల ప్రక్రియ ప్రారంభిస్తుందని కూడా సత్య నాదెళ్ల వెల్లడించారు. అయితే ఈ నియామకాల ప్రక్రియ ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ఉండే అవకాశం ఉందన్నారు. ఏఐ కారణంగా మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది ఇప్పటి వరకు 15,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ నేపథ్యంలో సత్య నాదెళ్ల మళ్లీ కొత్త నియామకాల గురించి మాట్లాడడం విశేషం.

మార్పు సహజమే: 'ఏఐ' కారణంగా కార్పొరేట్ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులను సత్య నాదెళ్ల 'సహజ' మార్పులుగా అభివర్ణించారు. వివిధ సంస్థలు లేదా ఒకే సంస్థలో వివిధ విభాగాల మధ్య జరిగే సమాచారం మార్పిడి కోసం గతంలో పలు పద్ధతులు ఉపయోగిస్తే.. ఇప్పుడు ఈ-మెయిల్స్, ఎక్సెల్ స్ప్రెడ్‌షీట్లను ఉపయోగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కంపెనీల్లో పని స్థితిగతుల మెరుగుదల కోసం ఏఐ ఉపయోగించడం అలాంటిదేనన్నారు.

ఈ ఏడాది 'లక్ష'కుపైగా కొలువులు ఔట్

ఈ ఏడాది ఇప్పటి వరకు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి టెక్ దిగ్గజాలు ప్రపంచవ్యాప్తంగా లక్షకు పైగా ఉద్యోగులను తొలగించాయి. ఏఐతో పాటు వ్యాపారాల పునర్ వ్యవస్థీకరణ, ఖర్చులు తగ్గించుకునే ఆలోచన ఇందుకు ప్రధాన కారణం. మన దేశంలో టీసీఎస్ కూడా ఇప్పటి వరకు 12,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. వ్యాపార అవకాశాలు సన్నగిల్లడం, తీసి వేసిన ఉద్యోగుల్లో ఎక్కువ మందికి సరైన ఏఐ నైపుణ్యాలు లేకపోవడం ఇందుకు కారణమని కంపెనీ వర్గాలంటున్నాయి.

అక్టోబరులో ఎఫ్‌పీఐ పెట్టుబడులు పెరిగాయ్..

ఈక్విటీల్లోకి రూ.14,610 కోట్ల నిధులు

న్యూఢిల్లీ: మూడు నెలల నిరంతర ఉపసంహరణల తర్వాత అక్టోబరులో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారత ఈక్విటీ మార్కెట్లో రూ.14,610 కోట్ల పెట్టుబడులు పెట్టారు. అంచనాలను మించిన సంస్థాగత ఆదాయాలు, యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుతో పాటు భారత్- అమెరికా వాణిజ్య చర్చలు సానుకూలంగా ఉండటం నిధుల రాకకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. సెప్టెంబరులో రూ.23,885 కోట్లు, ఆగస్టులో రూ.34,990 కోట్లు, జూలైలో రూ.17,700 కోట్ల నిధులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. కాగా ఎఫ్‌పీఐలు ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మొత్తం రూ.1.4 లక్షల కోట్లకు పైగా నిధులను మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్నారు.

ఎల్ఐసీ ఎంఎఫ్ కంజప్షన్ ఫండ్

ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్.. కంజప్షన్ ఫండ్‌ను ప్రారంభించింది. కంజప్షన్ (వినియోగం) థీమ్‌తో తీసుకువచ్చిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. వినియోగం, వినియోగ ఆధారిత రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 14.

యాక్సిస్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ప్యాసివ్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్)ను ప్రారంభించింది. ఇది ప్యాసివ్ డెట్ ఓరియెంటెడ్ ఎంఎఫ్ పథకాల్లో 50-65%, ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో 35-50%, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో 0.5% పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఎఫ్ఓఎఫ్. కనీస పెట్టుబడి రూ.100. ముగింపు తేదీ ఈ నెల 11.

25,700 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ మైనర్ అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై 26,100 వరకు వెళ్లి రియాక్షన్‌కు లోనైంది. కీలక స్థాయి 26,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలం కావడంతో తక్షణ అప్‌ట్రెండ్‌లోకి ప్రవేశించలేకపోయింది. చివరికి వారం మొత్తం మీద 73 పాయింట్ల స్వల్ప నష్టంతో 25,720 వద్ద క్లోజైంది. గత రెండు వారాలుగా 26,000 వద్ద సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం జీవితకాల గరిష్ఠ స్థాయి 26,100 వరకు వెళ్లినప్పటికీ రియాక్షన్ సాధించడం గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది. మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు సైతం ఇదే ధోరణిని ప్రదర్శించాయి. ప్రస్తుత ధోరణిని బట్టి నిఫ్టీ ఈ వారంలో మరింత అప్రమత్త ట్రెండ్‌లో ట్రేడ్ కావచ్చు. కీలక మద్దతు స్థాయి 25,700 వద్ద మరో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయిల్లో పునరుజ్జీవం సాధించినట్టయితే మరింత సానుకూలత కోసం 26,000 పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 26,300. ఇదే గత ఏడాది ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయి.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 25,700 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,400. ఇక్కడ రికవరీ ఏర్పడవచ్చు. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 25,000.

బ్యాంక్ నిఫ్టీ: గత రెండు వారాలుగా సైడ్‌వేస్ ధోరణి ప్రదర్శించిన ఈ సూచీ గత వారంలో 57,770 సమీపంలో క్లోజైంది. రికవరీ బాట పడితే 58,000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం. ప్రధాన నిరోధం, జీవితకాల గరిష్ఠ స్థాయి 58,600. మద్దతు స్థాయి 57,400. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: నిఫ్టీ 25,700 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. నిఫ్టీ ప్రస్తుతం ఇదే స్థాయిలో ఉన్న 25 డిఎంఏ వద్ద ఉంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,760, 25,850
మద్దతు	25,700, 25,610

అప్రమత్తంగా వ్యవహరించండి..!

దేశీయ స్టాక్ మార్కెట్ల గమనం ఈ వారం అంతర్జాతీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. దేశీయంగా జీఎస్‌టీ వసూళ్లు, కంపెనీల ఫలితాలు సానుకూలంగా ఉన్నాయి. యూఎస్ రిజర్వ్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించటం, టారిఫ్స్ నేపథ్యంలో అప్రమత్తత అవసరం. ప్రస్తుతం చమురు, రియల్టీ, ఇన్‌ఫ్రా, పీఎస్‌యూ బ్యాంకుల షేర్లు బలాన్ని ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

అరబిందో ఫార్మా: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు రివర్సల్ బాట పడుతోంది. క్రమంగా బలం పుంజుకుంటోంది. డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,138 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,100 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,250/1,330 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,050 వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

బీఈఎల్: జీవితకాల గరిష్ఠం తర్వాత 18 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరు మళ్లీ సెప్టెంబరు నుంచి అదే స్థాయిలో రాబడి అందించింది. ఒడుదొడుకులు లేకపోవటం, రాబోయే రోజుల్లో రక్షణ రంగ డీల్స్ పెరిగే అవకాశం, మంచి ఆర్థిక ఫలితాలు ఈ కౌంటర్‌ను ఆకర్షణీయంగా మార్చాయి. గత శుక్రవారం రూ.426 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.455/475 టార్గెట్ ధరతో రూ.415 పై స్థాయిలో పడుతున్నప్పుడు కొనుగోలు చేయాలి. రూ.404 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐనాక్స్ విండ్: జీవిత కాల గరిష్ఠం తర్వాత ఈ షేరు దాదాపు 50 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం కీలకమైన మద్దతు స్థాయి రూ.150 వద్ద మరోసారి అప్‌ట్రెండ్ బాట పట్టింది. బలమైన ఫండమెంటల్స్ ఉండటం మున్ముందు షేరు ధర పెరుగుదలను సూచిస్తోంది. గత శుక్రవారం రూ.155 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.150 ఎగువన ప్రవేశించి రూ.175/190 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.144 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్లెన్‌మార్క్: ఈ ఏడాది జూలై నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో ఉంది. దాదాపు 20 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. మళ్లీ ఆర్థిక ఫలితాల తేదీ సమీపిస్తుండటంతో ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,891 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,820 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: ఈ కౌంటర్‌లో డబుల్ బేస్ ఏర్పడింది. పైగా పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగానికి మూమెంటమ్ ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.148 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.145/140 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.190/210 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.135 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.


కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

జూబ్లీహిల్స్‌లో సత్తా చాటాలి

» కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి జూపల్లి దిశా నిర్దేశం

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, పార్టీ శ్రేణులు సమిష్టిగా పని చేసి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఎర్రగడ్డ డివిజన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, డివిజన్, బూత్ ఇన్‌చార్జిలకు ఆయన దిశా నిర్దేశం చేశారు.ప్రతి ఓటరునూ ఓటు వేయాలని అభ్యర్థించాలని, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు, డివిజన్, బూత్ లెవల్ ఇన్‌చార్జిలు సమన్వయంతో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. తద్వారా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.



"ది ఫైర్ ఆఫ్ డిఫాయిన్స్" ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరించిన పుణ్యవతి, చిత్రంలో కొండవీటి సత్యవతి, జ్యోతి, మల్లు లక్ష్మి, గీతారామస్వామి తదితరులు

మల్లు స్వరాజ్యం "ది ఫైర్ ఆఫ్ డిఫాయిన్స్" పుస్తకావిష్కరణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనే కాక సమసమాజ నిర్మాణం లక్ష్యంగా జీవితమంతా పోరాడిన అలుపెరుగని యోధ మల్లు స్వరాజ్యమని ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్. పుణ్యవతి కొనియాడారు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన "మల్లు స్వరాజ్యం-ది ఫైర్ ఆఫ్ డిఫాయిన్స్" ఆంగ్ల పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆమె ఆవిష్కరించారు. ఆస్తిలో మహిళల వాటా హక్కు సాధనలో మల్లు స్వరాజ్యం పోరాటం నిరుపమానమైనదని పుణ్యవతి చెప్పారు. భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కొండవీటి సత్యవతి పుస్తక పరిచయం చేశారు. అన్యాయంపై రాజీలేని పోరు సలిపిన సాహసి మల్లు స్వరాజ్యం జీవితాన్ని ప్రతి ఒక్కరూ తప్పకుండా చదవాలని సీపీఎం నాయకురాలు టి. జ్యోతి సూచించారు. ప్రజా ఉద్యమాల్లో పని చేస్తున్న వారికి ఆమె జీవితం ఓ నిఘంటువులాంటిదని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మల్లు స్వరాజ్యం కోడలు లక్ష్మి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నిర్వాహకురాలు గీతారామస్వామి, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ప్రతినిధి ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

జోగి రమేశ్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

మూడు గంటలపాటు పడక గది తలుపులు తీయకుండా లోపలే ఉండిపోయారు. వైసీపీ కార్యకర్తలను, స్థానిక నేతలను ఇంటికి రప్పించుకున్నారు. వారు ఆందోళన చేయడం మొదలుపెట్టిన తర్వాత ఆయన తలుపులు తీసుకుని బయటకు వచ్చారు. ఆయన బయటకు రాగానే ఎక్సైజ్ ఏఈఎస్ రామ్‌శివ అరెస్టు నోటీసు అందజేశారు. తర్వాత జోగి సోదరులతోపాటు ఆయన పీఏ ఆరేపల్లి రామును అదుపులోకి తీసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం వారిని విజయవాడ గురునానక్ కాలనీలోని ఎక్సైజ్ తూర్పు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ సిట్ ఎస్పీ కడియం చక్రవర్తి సాయంత్రం 4 గంటల వరకు ప్రశ్నించి కీలక సమాచారం రాబట్టారు. కేసులో ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు జగన్మోహనరావు చెప్పిన అంశాలు, దర్యాప్తు సందర్భంగా తాము సేకరించిన ఆధారాలను వారి ముందుంచి ప్రశ్నించారు. అయితే ఈ కేసుతో తనకెలాంటి సంబంధమూ లేదని, రాజకీయ కుట్రతోనే కేసులు పెట్టారని జోగి రమేశ్ వాగ్వాదానికి దిగారు. వారితో పాటు తీసుకెళ్లిన పీఏ రామును అధికారులు ప్రశ్నించి ఉదయం 11 గంటల సమయంలో స్టేషన్ నుంచి పంపేశారు.

డాక్యుమెంట్లు, కారు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్‌డిస్క్, ఫోన్ల స్వాధీనం

మరోవైపు.. సిట్, ఎక్సైజ్ బృందాలు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతం నుంచి రాత్రి 8 గంటల వరకు జోగి రమేశ్ ఇంట్లో సోదాలు నిర్వహించాయి. కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయన కారు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఎన్‌వీఆర్ హార్డ్‌డిస్క్, వైఫై రూటర్‌ను, ఆయన భార్య ఫోన్, జోగి సోదరుడు రాము ఫోన్‌ను కూడా సీజ్‌చేశారు.

కేసులో ప్రధాన పాత్రధారి..

నకిలీ మద్యం తయారీ, సరఫరా వెనుక జోగి రమేశే ఉన్నారని.. ఆయన సంపూర్ణ సహకారంతోనే తయారుచేసి మద్యం దుకాణాలకు పంపామని ఈ కేసులో ఏ-1గా ఉన్న ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు, అతడి సోదరుడు జగన్మోహన్‌రావు గతంలోనే వెల్లడించిన సంగతి తెలిసిందే. నకిలీ మద్యం తయారీకి ముడి సరుకు సరఫరా, ఆ తర్వాత మద్యం షాపులకు పంపించడం, వాటి ద్వారా వచ్చిన నగదుతో జరిగిన లావాదేవీల వంటి కీలక వివరాలను జనార్దనరావు నుంచి రాబట్టారు. అతడి వాంగ్మూలాన్ని వీడియో రికార్డు చేసిన సిట్.. కొద్దిరోజుల కింద కోర్టుకు కూడా సమర్పించింది. తదనంతరమే జోగి సోదరులను అరెస్టు చేసింది. ఎక్సైజ్ స్టేషన్‌లో విచారణ పూర్తయ్యాక వారిని రాత్రి 9.45 గంటలకు వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షల అనంతరం పొద్దుపోయాక అర్ధరాత్రి సమయంలో ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసులో రమేశ్‌ను (ఏ-18), జోగి రాము (ఏ-19)గా చేర్చారు. జోగి సోదరులను ఆదివారం రాత్రి 10 గంటలకు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చిన సమయంలో జోగి రమేశ్ కుమారుడు రాజీవ్ వైసీపీ నేతలతో కలిసి నానా హంగామాచేశారు. క్యాజువాలిటీ వార్డు అద్దం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా తనను అడ్డుకోబోయిన మాచవరం ఎస్సైపై రాజీవ్ దౌర్జన్యానికి దిగారు. దీంతో పోలీసులు ఆయన్ను బలవంతంగా బయటకు నెట్టేశారు.

కోర్టు హాలులోనూ..

వైద్య పరీక్షలు పూర్తయ్యాక జోగి సోదరులను కోర్టుకు తీసుకొస్తున్నారని తెలిసి వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు అక్కడకు తరలివచ్చారు. వారితో కోర్టు హాలు నిండిపోయింది. మేజిస్ట్రేట్ లెనిన్‌బాబు రాత్రి 11.30కి కోర్టుకు వచ్చారు. కోర్టు హాలు కిక్కిరిసి ఉండడం చూశారు. సూర్యారావుపేట ఇన్‌స్పెక్టర్ మహ్మదాలీని తన చాంబరుకు పిలిపించుకున్నారు. న్యాయవాదులు కానివారు బయటకు వెళ్తేనే కోర్టు హాలులోకి వస్తానని స్పష్టంచేశారు. దీంతో ఆయన తన సిబ్బందితో లోపలకు వెళ్లి వైసీపీ నేతలందరినీ బయటకు వెళ్లాలని సూచించారు. వారు వినిపించుకోకుండా అక్కడే ఉండిపోయారు. ఆ తర్వాత పోలీసులు ఖాళీ చేయించారు.

మళ్లీ పిలుస్తామన్నారు: పీఏ రాము

ఎక్సైజ్ స్టేషన్‌లో విచారణ సందర్భంగా.. నకిలీ మద్యం కేసులో జోగి రమేశ్ పాత్ర ఏమిటి.. ఎన్నిసార్లు జనార్దనరావును కలిశావని తనను సిట్ అడిగిందని ఆయన పీఏ ఆరేపల్లి రాము విలేకరులకు తెలిపారు. 'నాకేమీ తెలియదని, మద్యంతో సంబంధం లేదని చెప్పాను. జనార్దనరావు ఇబ్రహీంపట్నంలో ఎప్పటి నుంచో ఉంటున్నాడు. నేనూ అక్కడే పెరిగా. అలా అతడితో పరిచయం ఉంది. కానీ అతడితో ఎటువంటి లావాదేవీలూ లేవు. జోగి రమేశ్‌కు, జనార్దనరావుకు పరిచయం ఉంది. నకిలీ మద్యం కేసులో మాకు సంబంధం లేదు. విచారణకు అందుబాటులో ఉండాలని, అవసరమైతే మళ్లీ పిలుస్తామని చెప్పి పంపారు' అని వెల్లడించారు.

ప్రజాప్రభుత్వాన్ని దీవించండి.. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

» ఎన్నికల తర్వాత బోరబండ ఖబరస్థాన్ సమస్యను పరిష్కరిస్తాం
» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్/బోరబండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వాన్ని దీవించి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని జూబ్లీహిల్స్ ప్రజలను రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. జూబ్లీహిల్స్ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను అభ్యర్థించారు. ఆదివారం రహమత్ నగర్ డివిజన్‌లోని శ్రీరామ్ నగర్, సంధ్య నగర్, కార్మిక నగర్, వినాయక నగర్, ఎస్‌పీఆర్‌హిల్స్‌లో మంత్రి పొంగులేటి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉదయాన్నే గల్లీ గల్లీల్లో పర్యటించి ప్రజలను పలకరించి ఓట్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా టమాటాలు, ఉల్లిగడ్డలు కొనుగోలు చేసిన మంత్రి పొంగులేటి.. ఒక టిఫిన్ సెంటర్‌లో దోశ వేసి అందరినీ ఆకట్టుకున్నారు. చిరు వ్యాపారులు, షాపుల యజమానులను ప్రత్యక్షంగా కలిసి మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ హవా కనిపిస్తోందని, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరుపై ప్రజలలో మంచి స్పందన కనిపించిందని తెలిపారు. పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి అనునిత్యం పాటుపడుతున్నారని, తమ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంత్రి పొంగులేటి ప్రచారానికి మంచి స్పందన లభించింది. మరోవైపు, బోరబండలోని ఓ ఫంక్షన్ హాలులో బోరబండ ఖబరస్థాన్ కమిటీ ప్రతినిధులతో జరిగిన భేటీలో స్థానికుల ఖబరస్థాన్ సమస్యను ఎన్నికల తర్వాత ఖచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి వెంట రహ్మత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, తెలంగాణ మైనారిటీ విద్యాసంస్థల చైర్మన్ రహీం ఖురేషీ, బీ భవానీ శంకర్ తదితరులు ఉన్నారు.


కూరగాయల బండి వద్ద వ్యాపారితో మంత్రి పొంగులేటి ముచ్చట్లు

ఓట్ల వేటకు పార్కుల బాట

ఉదయం, సాయంత్రం నడక వేళల్లో ఓటర్లను కలిసి ప్రసన్నం చేసుకునేందుకు నేతల ప్లాన్

» ఒకేరోజు పార్కుల్లో ప్రచారం చేసిన కిషన్‌రెడ్డి, పొన్నం, మహేశ్‌గౌడ్, బోయినపల్లి వినోద్ కుమార్

హైదరాబాద్, యూసుఫ్‌గూడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరు ఔనన్నా కాదన్నా.. ఎన్ని ప్రచార సభలు, రోడ్ షోలు నిర్వహించినా నేరుగా ఓటరును కలిసి ప్రసన్నం చేసుకుంటేనే ఎన్నికల ప్రచారానికి సార్థకత! పల్లెప్రాంతాల్లోనైతే సాగు పనులకు వెళ్లే రైతులను, కూలీలను కలిసి వారి పనుల్లో ఓ చేయివేయడం ద్వారా నేతలు ప్రచారం నిర్వహిస్తుంటారు. ఇప్పుడు జరిగేది హైదరాబాద్ నడిబొడ్డులోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక! ఇక్కడ ప్రజలు ఉదయం పదింటికల్లా వివిధ పనుల కోసం ఇంట్లోంచి బయటపడితే మళ్లీ సాయంత్రమెప్పుడో ఇంటికి తిరిగొస్తారు. కొందరు రాత్రివేళల్లో ఉద్యోగాలు చేస్తుంటారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పనివేళలూ భిన్నంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ఓటర్లను కలిసేది ఎలా? దీనిపైనే ముమ్మర కసరత్తు చేసిన వివిధ పార్టీల నేతలు ఓ నిర్ణయానికొచ్చారు. ఓటర్లు అందుబాటులో ఉండే సమయాల్లోనే వారిని కలిసి ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందుకు వారు ఎంచుకుంది. 'ఉదయం, సాయంత్రం నడక వేళల్లో' ప్రచారం చేయాలని! శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం నడకే చక్కని మార్గం అనే అవగాహన ప్రజల్లో బాగా పెరగడం, ప్రత్యేకించి నగర ఓటర్లలో ఎక్కువమంది ఉదయం, సాయంత్రాల్లో పార్కులో వాకింగ్ చేస్తుండటంతో నేతలు తదనుగుణంగా ప్రచార షెడ్యూల్‌ను మార్చుకుంటున్నారు. వాకింగ్ చేసే సమయాల్లోనే ఓటర్ల వద్దకు వెళ్లటం, వారితో కలిసి నడవటం, వారితో ముచ్చటించటం, తమపార్టీ గురించి నాలుగు మంచి మాటలు చెప్పటం, తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని విన్నవించడం వంటివి చేస్తున్నారు. ఆదివారం ఉదయం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. కృష్ణకాంత్ పార్కులో వాకింగ్ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లతో మాటామాటా కలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల నేతలు కూడా వాకింగ్ ప్రచారాన్ని మొదలుపెట్టారు. ప్రతిరోజు ఇదేతరహాలో నియోజకవర్గం పరిధిలో ఉన్న పార్కుల్లో ప్రచారం చేసేలా షెడ్యూలు రూపొందించుకున్నారు. కేబీఆర్, కృష్ణకాంత్ పార్కులు మొదలుకొని.. ఎర్రగడ్డ, బోరబండ, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రెహమత్ నగర్, షేక్‌పేట డివిజన్లలో ఉన్న చిన్నా, పెద్ద పార్కుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం కృష్ణకాంత్ పార్క్‌లో ప్రచారం నిర్వహించారు. బోయినపల్లి వినోద్ కుమార్ తదితర బీఆర్‌ఎస్ నేతలు తమ అనుచరులతో పార్కుల్లో ఓటర్లను కలిసి తమ పార్టీ అభ్యర్థికి ఓటెయ్యాలని అభ్యర్థించారు.


కృష్ణకాంత్ పార్క్‌లో స్థానికులతో కలిసి వాకింగ్ చేస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రచార వేళలపై సీఎం ఫోకస్.. పీసీసీ చీఫ్‌తో చర్చలు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారసరళిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టారు. ప్రచారానికి మరో వారం రోజుల సమయమే ఉండటంతో.. ప్రచార శైలి మార్చాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌తో కూడా ఈ అంశంపై చర్చించారు. పూర్తిగా నగర ఓటర్లు కావటంతో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గట్టిగా ప్రచారం చేయాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాలనీల్లో ఎవరూ అందుబాటులో లేనప్పుడు ప్రచారం చేసినా ప్రయోజనం ఏముంటుందని సీఎం ప్రశ్నించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర నేతలంతా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ క్రమంలోనే ఆదివారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్.. వాకింగ్ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కాగా ఈ సమయంలో కొందరు వాకర్స్ తమ సమస్యలను కూడా చర్చకు తెస్తున్నారు. అధికారపార్టీ నేతలు సమస్యల పరిష్కారానికి భరోసా ఇస్తున్నారు. విపక్షనేతలు పార్టీల నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ఓటర్లతో చెబుతున్నారు. కాగా వాకింగ్ జోన్‌కు, పార్కులకు ఒకేసారి రెండు, మూడు పార్టీలకు చెందిన నాయకులు వచ్చినపుడు వాకర్లు కాస్త ఇబ్బందులు పడుతున్నారు. కొందరు మొహమాటానికి గురవుతున్నారు.

విపక్షాల జూటా ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి శ్రీధర్‌బాబు

తటస్థులు ఓటేసేందుకు బయటకు రావాలని పిలుపు

హైదరాబాద్/బంజారాహిల్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అభివృద్ధికి తమ సర్కారు కట్టుబడి ఉందని, ప్రతిపక్షాల 'జూటా' ప్రచారాన్ని నమ్మొద్దని ప్రజలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే తమపై బురద చల్లే రాజకీయాలు చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలకు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి ఆదివారం ఎల్లారెడ్డిగూడ, ఎస్పార్ నగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, కాలనీలు, బస్తీల్లో శ్రీధర్ బాబు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికుడైన నవీన్ యాదవ్‌ను గెలిపించుకునేందుకు తటస్థులు ఓటేసేందుకు బయటకు రావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో మాటలు కోటలు దాటాయి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు, యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీ నర్సింహనగర్‌లో పాద యాత్ర చేసిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.. ఇంటింటికి వెళ్లి భారీ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మనోహర్ రెడ్డి, విజయ రమణరావు, అరికెపూడి గాంధీ, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సినీ నటుడు సుమన్ తదితరులున్నారు.





గెలుపు సునాయాసం

(మొదటిపేజీ తరువాయి)

గెలిచేందుకు బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోందని, పెయిడ్ సర్వేలను వినియోగించుకుంటోందని రేవంత్ పేర్కొన్నారు. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకుని తప్పుడు సమాచారాన్ని జనంలోకి తీసుకెళుతోందని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ చేస్తున్న ఆ తప్పుడు ప్రచారాలను, తప్పుడు సర్వేలను మంత్రులు బలంగా తిప్పి కొట్టాలని సూచించారు. పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని.. ప్రతి వంద మంది ఓటర్లకు ఒక బూత్ స్థాయి ఏజెంట్‌ను పెట్టి, పర్యవేక్షించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఇక ఈ ఉప ఎన్నికను సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని మంత్రులకు మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ సూచించారు. ఇక కొత్త మంత్రి అజారుద్దీన్‌కు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డికి మంత్రులు అభినందనలు తెలిపారు.

ప్రచారంపై సమన్వయ కమిటీ ఏర్పాటు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచారాన్ని సమన్వయం చేసుకునేందుకు కో-ఆర్డినేషన్ కమిటీని నియమించారు. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి చైర్మన్‌గా, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ కో-చైర్మన్‌గా, మరో 14 మంది సభ్యులతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

తెలంగాణ జాగృతిలో పలువురు బీసీ నేతల చేరిక

హైదరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో పలువురు బీసీ నేతలు జాగృతిలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో తెలంగాణ కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నరసింహ, గొరిగె రాధిక, మేడె సరిత, మేడె బాపురాజు తదితరులకు ఆమె కండువాలు కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. చెంగిచర్ల మేడ్చల్, మియాపూర్, ఈసీఐఎల్, మూసారాంబాగ్, రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు యువకులు జాగృతిలో చేరారు. మరోవైపు తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మోరం వీరభద్రరావు, జాడి శ్రీనివాస్ నియమితులయ్యారు. టీజేటీఎఫ్ నూతన కమిటీని కవిత ప్రకటించారు.

హరీశ్‌రావును పరామర్శించిన నేతలు

హైదరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి, మాజీ డీజీపీ అంజనీకుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్ తదితరులు పరామర్శించారు. మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు తదితరులు కోకాపేటలోని హరీశ్‌రావు నివాసానికి వచ్చి ఇటీవలే కన్నుమూసిన ఆయన తండ్రి సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

500 రోజులు ఆగితే కేసీఆర్ ప్రభుత్వం

హైడ్రా అరాచకాలకు పాల్పడుతోంది.. పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపి కూల్చేస్తోంది

» మంత్రులు పొంగులేటి, వివేక్ ఇళ్లు చెరువుల్లోనే ఉన్నాయి
» రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లూ బఫర్ జోన్‌లోనే..
» కూల్చే దమ్ము హైడ్రాకు ఉందా?: కేటీఆర్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు అరాచకానికి పాల్పడుతోందని, ఎంతో మంది గూడు కోల్పోయారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేసే బాధ్యత తనదని, 500 రోజులు ఆగితే కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని పేర్కొన్నారు. హైడ్రా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 'పెద్దోళ్లకు ఓ న్యాయం.. పేదలకు ఒక న్యాయం' పేరిట ఆదివారం తెలంగాణభవన్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించారు. హైడ్రా అరాచకాలకు పాల్పడుతోందంటూ కేటీఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 'కేసీఆర్ హయాంలో ఎక్కడచూసినా కట్టడాలే కనిపిస్తాయి. హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించాం. అమెరికా వైట్‌హౌస్‌ను తలదన్నేలా రాష్ట్ర సచివాలయం, దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, 42 ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు ఇలా ఎన్నో నిర్మించాం. కానీ రేవంత్‌రెడ్డి గత రెండేళ్లలో కూలగొట్టడమే తప్ప కొత్తగా నిర్మించిందేమీ లేదు. హైడ్రాపై భట్టి విక్రమార్క ఇచ్చిన ప్రజంటేషన్‌లో చాలామంది బిల్డర్ల పేర్లు చెప్పారు. వారెవరినీ ఇబ్బంది పెట్టలేదు. కానీ పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపి కూలగొట్టి, వారికి నీడలేకుండా చేశారు. కొండాపూర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న కొందరికి గతంలో ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది. ఇప్పుడు హైడ్రా వారిని కూడా వెళ్లగొట్టింది. హైడ్రా చేసేది న్యాయమే అయితే.. ముందుగా నోటీసులు ఎందుకు ఇవ్వరు, బాధితులు చూపుతున్న పేపర్లను ఎందుకు పరిశీలించరు? ప్రభుత్వానికి అంతా సమానమైతే పెద్ద వాళ్ల జోలికి ఎందుకు వెళ్లడం లేదు? మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెరువును పూడ్చి ఇల్లుకట్టారు. మరో మంత్రి వివేక్ కూడా హిమాయత్‌సాగర్ చెరువు వద్ద ఇల్లు కట్టుకున్నారు. రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ లోపల ఇల్లుకట్టారు. వారి ఇళ్లను కూల్చే దమ్ము హైడ్రాకు ఉందా?" అని కేటీఆర్ నిలదీశారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెరువుల్లోనే ఇళ్లు కట్టుకున్నారని, వారికి నోటీసులు ఇచ్చే దమ్ము అధికారులకు ఉందా అని ప్రశ్నించారు. కాగా, బీజేపీ నేత, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి ఆదివారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ గెలుపుతోనే కాంగ్రెస్ అరాచకాలకు అంతమని ఈ సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నారు.


తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితుల సమస్యలు వింటున్న కేటీఆర్

కాంగ్రెస్ నోట్లతో ఓట్లు కొనాలనుకుంటోంది

విద్యావంతులు ఎక్కువగా ఉండే హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండడం బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక్కరు ఓటు వేయకున్నా కాంగ్రెస్ రిగ్గింగ్ చేసి ఆ ఓట్లు వేసుకుంటుందని ఆరోపించారు. ఆదివారం షేక్‌పేటలోని ఆదిత్య ఇంప్రెస్, సత్వ గేటెడ్ కమ్యూనిటీల్లో నిర్వహించిన సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడారు. తాము పదేళ్లలో పేదల కోసం, హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. మరోవైపు.. కాంగ్రెస్ గూండాలు మణుగూరు బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేసి, దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావుతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మొదలైన నాటి నుంచి గూండాల రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు.

సన్నబియ్యం పథకాన్ని రద్దు చేసే దమ్ముందా?

సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్.. కాంగ్రెస్‌కు ఓటేయకపోతే బెదిరిస్తారా? అని ఆగ్రహం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దమ్ముంటే సన్న బియ్యం పథకాన్ని రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవాల్ చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే సన్న బియ్యం ఇవ్వడం మానేస్తామంటూ సీఎం హోదాలో రేవంత్ బెదిరింపులకు దిగడం ఎంత వరకు సబబు? అని మండిపడ్డారు. ఈ బెదిరింపులు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓడిపోతామనే నిరాశతోనా? లేదంటే ఇది కాంగ్రెస్ మార్కు రాజకీయమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నిధులతో ఏమైనా బియ్యం ఇస్తున్నారా? అని నిలదీశారు. సన్న బియ్యం పథకాన్ని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తోందని, కిలోకు రూ.42 చొప్పున కేంద్రం చెల్లిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రూ.15మాత్రమే ఇస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమస్యలను, ప్రజల ఇబ్బందులను పరిష్కరించగల ఏకైక పార్టీ బీజేపీయేనని, ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్లతో, యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్క్‌లో ఉదయపు నడకకు వచ్చిన ప్రజలతో కిషన్ రెడ్డి మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ హద్దులు దాటి మితిమీరి వ్యవహరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బంజారాహిల్స్‌లో పెద్దమ్మ గుడికి స్థలం ఇవ్వడానికి ముందుకు రాని రాష్ట్ర ప్రభుత్వం.. ఖబరస్థాన్ కోసం మాత్రం ఎకరాల కొద్దీ భూములను ధారాదత్తం చేసిందని ఆయన ఆరోపించారు.



ఓటమి భయంలో కాంగ్రెస్: రాంచందర్‌రావు

ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓటమి భయం వెంటాడుతోందని, అందుకే సీఎం రేవంత్ ఎన్నికల ముందు ఓ మైనారిటీని మంత్రిని చేసి గంపగుత్తగా ఓ వర్గం ఓట్ల కోసం ఆరాట పడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు దుయ్యబట్టారు. బెదిరించి ఓట్లు కొల్లగొట్టాలని కాంగ్రెస్ చూస్తుండగా.. డబ్బులు వెదజల్లి ఓట్లు రాబట్టుకోవాలని బీఆర్‌ఎస్ భావిస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్ పరిధిలో బీజేపీ ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించింది. శ్రీకృష్ణానగర్-ఏ బ్లాక్‌లో ఎంపీ రఘునందన్‌రావు, బోరబండలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, శ్రీనగర్‌లో కాలనీ పార్క్‌లో మల్కా కొమరయ్య పాదయాత్ర చేశారు. రహ్మత్‌నగర్‌లో పాదయాత్రను రాంచందర్‌రావు ప్రారంభిస్తూ మాట్లాడారు. కాగా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వనపర్తి జిల్లాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీలో చేరారు.



వేదికపై ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- ఘనంగా ఐఎంఏ రాష్ట్ర కార్యవర్గం ప్రమాణస్వీకారం

సుభాష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వైద్యులకు అండగా ఉంటుందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్యుల సమస్యలు పరిష్కరించడంతోపాటు వారికి అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఐఎంఏ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ పి. కిషన్, కార్యదర్శిగా వి. అశోక్, కోశాధికారిగా డాక్టర్ దయాల్ సింగ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ విజయరావు, డాక్టర్ ఎంఎల్ ఎన్ రెడ్డి, డాక్టర్ బి. శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ టీవీ శ్రీనివాస్, డాక్టర్ ఆర్. సునీత, డాక్టర్ పి. శరత్‌చంద్ర, డాక్టర్ యు. రామకృష్ణ, డాక్టర్ బి. రూప్‌లాల్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు సైంటిఫిక్ సెషన్లు నిర్వహించారు. కరీంనగర్ ఐఎంఏ రాష్ట్రంలో అన్ని విభాగాల్లో ఉత్తమ బ్రాంచిగా ఎన్నికైంది. దీనికి సంబంధించి మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్ అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ విజయేందర్‌రెడ్డి, డాక్టర్ రామ్ కిరణ్ పొలాస పాల్గొన్నారు.



యాదాద్రిజిల్లా బీబీనగర్‌లో ప్రమాదానికి కారణమైన కారు; మృతిచెందిన ప్రశాంత్, ప్రసూన (ఫైల్)

వరంగల్ రహదారిపై కారు బీభత్సం

- అదుపుతప్పి దంపతులపైకి దూసుకెళ్లిన వాహనం
- అక్కడికక్కడే మృతి చెందిన దంపతులు
- కారులో ఉన్న ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు
- యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ వద్ద ఘటన

బీబీనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జాతీయ రహదారిపై ఓ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో అదుపుతప్పి రోడ్డు పక్కన నిలబడి ఉన్న దంపతులపైకి దూసుకెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న గర్దాసు ప్రశాంత్ (32), ప్రసూన దంపతులు ఆదివారం వరంగల్ జిల్లా పాలకుర్తిలో ఉన్న తమ బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో బీబీనగర్ పెద్దచెరువు సమీపంలోకి రాగానే ప్రశాంత్‌కు ఫోన్ రావడంతో రోడ్డు పక్కన వాహనాన్ని ఆపి ఫోన్ మాట్లాడుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపు తప్పి దంపతులను ఢీకొట్టింది. ప్రశాంత్ రోడ్డుపై 20 అడుగుల దూరంలో ఎగిరిపడి మృతి చెందగా ప్రసూన పక్కనే ఉన్న చెరువు అలుగు ప్రదేశంలో పడి ప్రాణాలు విడిచింది. కారు చెట్టుకు ఢీకొని ఎడమ వైపున సర్వీస్ రోడ్డుపై పడింది. కారు నడుపుతున్న షణ్ముక్ తలకు తీవ్ర గాయాలు కాగా, అతని పరిస్థితి విషమంగా ఉంది. కారులో ఉన్న భార్గవ్, సాయిరిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురు యువకులను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు.

కారును అద్దెకు తీసుకుని యాదగిరిగుట్టకు..

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన తంగెళ్లపల్లి షణ్ముక్, చైతన్యపురికి చెందిన భార్గవ్, వరంగల్ పద్మానగర్‌కు చెందిన సాయిరిత్ హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు ఎల్బీనగర్‌లో కారును అద్దెకు తీసుకుని బయలుదేరిన ముగ్గురు బీబీనగర్ వద్ద ప్రమాదానికి కారణమై తీవ్రంగా గాయపడ్డారు.

అద్దెకు వైద్య పట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆ ఆస్పత్రి యాజమాన్యానికి నెలకు రూ.50 వేలకు అద్దెకు ఇచ్చారు. అందువల్ల ఆ వైద్యుడి స్థానంలో ఇంకెవరో ఆ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. డాక్టర్ ఏంటీ తన సర్టిఫికెట్లు అద్దెకు ఇవ్వడం ఏంటీ ? అని విడ్డూరంగా అనిపిస్తున్నా.. ఇది నిజంగా నిజం. సాధారణంగా ఫార్మసీ పూర్తి చేసిన వారు తమ సర్టిఫికెట్లను మెడికల్ షాప్ నిర్వాహకులకు అద్దెకు ఇస్తుంటారనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. కానీ, వైద్యులు కూడా తమ సర్టిఫికెట్లను అద్దెకు ఇవ్వడం ఇటీవల అధికమైంది. రాష్ట్రంలోని చాలా ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు ఇలా అద్దె సర్టిఫికెట్ల ఆధారంగా అనుమతి పొంది నడుస్తున్నాయి. ఎవరో వైద్యుడి పేరిట అనుమతి తీసుకొని ఆస్పత్రి పెట్టడం మరెవరితోనూ వైద్యం చేయించడం ఓ దం దాగా మారిపోయింది. కొన్ని ఆస్పత్రుల్లో అసలు వైద్యుడి స్థానంలో అర్హత లేని వారు, వైద్య విద్య పూర్తి చేయని వారు కూడా చికిత్సలు చేసేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతా ల్లో ఈ తరహా ప్రైవేటు ఆస్పత్రులు 30 దాకా ఉన్నాయి. ఇటీవల వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్రవ్యాప్తంగా సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీలు చేపట్టగా.. ఒక డాక్టర్ పేరుతో అనుమతి తీసుకొని మరొకరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50 వరకు ఫర్టిలిటీ కేంద్రాలను అధికారులను గుర్తించి నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ జిల్లాలో రాష్ట్ర వైద్యమండలి వంద ఆస్పత్రుల్లో తనిఖీలు చేయగా... మెజార్టీ వాటిలో అనుమతులు పొంది వైద్యం చేయాల్సిన డాక్టర్లకు బదులు, అర్హత లేని వారు, వైద్యం చదవని వారు ప్రాక్టీసు చేస్తున్నట్లు తేలింది. దీని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నెలకు రూ.10 వేల నుంచి 40 వేలు

ప్రైవేటు ఆస్పత్రి ఏర్పాటుకు సంబంధిత వైద్యుడి విద్యార్హత పత్రాలను వైద్య, ఆరోగ్య శాఖకు కచ్చితంగా సమర్పించాలి. వాటిని పరిశీలించి అధికారులు ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతులిస్తారు. అనుమంతి పొందిన వైద్యుడే ఆ ఆస్పత్రిలో సేవలు అందించాలి. అయితే, వైద్యాన్ని వ్యాపారంగా భావిస్తోన్న



కొందరు.. ఆస్పత్రుల ఏర్పాటు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఎంబీబీఎస్ ధ్రువపత్రాన్ని కిరాయికిచ్చే వారిని పట్టుకుని, వారి పట్టాతో దరఖాస్తు చేసి అనుమతి పొంది ఆస్పత్రులు పెట్టేస్తున్నారు. సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులకు ఎంత కొంత ముట్టజెబుతున్నారు. ఇందులో ఎంబీబీఎస్ పట్టాలకు ఒక రేటు, స్పెషాలిటీ వాటికైతే మరో రేటున నెలకు, ఏడాదికి ఇంత అని మాట్లాడుకుని చెల్లిస్తున్నారు. ఎంబీబీఎస్ డిగ్రీలకైతే నెలకు సుమారు రూ.10-20 వేల మధ్య, అదే స్పెషాలిటి అయితే నెలకు రూ.30-40 వేల మధ్య ఇస్తున్నారని సమాచారం. చాలామంది వైద్యులకు ఇదో ఆర్థిక వనరుగా మారిపోగా.. ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతులు జారీ చేసే డీఎంహెచ్‌వోల నిర్లక్ష్యం వారికి వరంగా మారింది. ఓ వైద్యుడి పట్టా చూసి ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్న డీఎంహెచ్‌వోలు.. ఆ తర్వాత సదరు వైద్యుడు ఆ ఆస్పత్రిలోనే ఉంటున్నారా? అనే విషయాన్ని పట్టించుకోవడం లేదు. డీఎంహెచ్‌వోలు ఇలా చూసీచూడనట్టుగా ఉండడానికి తప్పుడు తరహాలో అనుమతులు పొందిన ఆస్పత్రుల యాజమాన్యాలు లక్షల్లో ఆమ్యామ్యాలు ముట్టజెబుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా నకిలీ వైద్యుల ఆట కట్టించేందుకు తనిఖీలు చేపట్టే రాష్ట్ర వైద్య మండలి.. నకిలీ వైద్యులు, ఆర్ఎంపీలు, పీఎంపీల ఆధ్వర్యంలో నడిచే క్లినిక్‌ల పైనే అధికంగా దృష్టి పెడుతోంది. ఎంబీబీఎస్ వైద్యుల పేరిట నిర్వహణలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లను మాత్రం పట్టించుకోవడం లేదు. ఎంబీబీఎస్ డాక్టర్లు సంబంధిత హాస్పిటల్/క్లినిక్‌ల్లో ప్రాక్టీస్ చేయనప్పటికీ, కేవలం వాటి అనుమతి కోసం తమ సర్టిఫికెట్లను కిరాయికి ఇచ్చిన వైద్యులపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వైద్యమండలి తీరుపై అనేక విమర్శలు ఉన్నాయి.

తనిఖీలు చేపట్టి.. నోటీసులు పంపాం

ఆర్ఎంపీ క్లినిక్‌లతోపాటు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌ల్లో కూడా తనిఖీలు చేపట్టాం. ఒక వైద్యుడి పట్టా పేరుతో అనుమతులు పొంది ఏర్పాటైన ఆస్పత్రుల్లో సంబంధిత వైద్యులు పనిచేయడం లేదనే విషయాన్ని చాలా చోట్ల గుర్తించాం. వాటిల్లోని కొన్ని ఆస్పత్రుల్లో అసలు వైద్యపట్టానే లేని వారు ప్రాక్టీసు చేయడాన్ని గమనించాం. ఇతర కోర్సులు చేసి వైద్యం చేస్తున్న విషయాన్ని కనుగొన్నాం. వారందరికీ నోటీసులు పంపాం. అలాగే కోడ్ ఆఫ్ మెడికల్ ఎథిక్స్ పాటించని కొందరి వైద్యులపై చర్యలు కూడా తీసుకున్నాం. జాతీయ వైద్య కమిషన్ గుర్తించిన వైద్యపట్టాలుండి, ఆయా రాష్ట్రాల మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయిన వారే వైద్యాన్ని ప్రాక్టీసు చేయాలి. లేకపోతే నిబంధనల మేరకు చర్యలుంటాయి.

- డాక్టర్ గుండగాని శ్రీనివాస్,
వైస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర వైద్యమండలి

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 2010, 2012 ప్రకారం ప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్‌కు వైద్యారోగ్యశాఖ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఆ సర్టిఫికెట్‌ను ప్రజలకు కనిపించేలా ఆస్పత్రిలో ప్రదర్శించాలి. ఎవరి పేరు మీద ఆస్పత్రి నమోదైందో ఆ వైద్యుడి పర్యవేక్షణలోనే ఆస్పత్రి పని చేయాలి. అర్హత కలిగిన వైద్యులు, నర్సులు, ఇతర పారామెడికల్ సిబ్బంది వివరాలను పేర్కొనాలి. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ 1956, ఎన్ఎంసీ యాక్ట్ 2019 ప్రకారం ప్రతి వైద్యుడు చెల్లుబాటయ్యే మెడికల్ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. ప్రిస్క్రిప్షన్, సర్టిఫికెట్, సైన్‌బోర్డ్‌పై ఆ నంబర్ తప్పనిసరిగా చూపించాలి.



తల్లిదండ్రులతో డ్రాలో విజేతగా నిలిచిన హన్సిక

'లక్కీ' హన్సిక!

- 500కే రూ.16లక్షల విలువైన ఇల్లు
- లక్కీడ్రా పద్ధతిలో ఇంటిని విక్రయానికి పెట్టిన చౌటుప్పల్ వాసి
- విజేతగా నిలిచిన చిన్నారి

చౌటుప్పల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సొంతిల్లు లేని ఓ చిరుద్యోగి కుటుంబానికి లక్కీ డ్రాలో అదృష్టం వరించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో నిర్వహించిన లక్కీ డ్రాలో రూ.16 లక్షల విలువైన ఇంటిని రూ.500లకే సొం తం చేసుకుంది. కుటుంబంలో ఉన్న నలుగురి పేరిట కూపన్లు కొనుగోలు చేయగా, చిన్న కుమార్తె హన్సిక లక్కీ డ్రా గెలుచుకుంది. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన కార్పెంటర్ రామబ్రహ్మం.. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 66 గజాల విస్తీర్ణంలో ఉన్న తన ఇంటిని అమ్మకానికి పెట్టాడు. అయితే, ఏడాదిగా ఇంటి కొనుగోలుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో ఓ వినూత్న ఆలోచన చేశాడు. లక్కీ డ్రా పద్ధతిలో ఇంటిని విక్రయించేందుకు నిర్ణయించుకుని, డ్రా పద్ధతిలో రూ. 500లకే గెలుచుకోవచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేశాడు. ఇందుకోసం 3,600 కూపన్లు ముద్రించానని, నవంబరు 2న లక్కీ డ్రా తీస్తానని ప్రకటించాడు. ఇచ్చిన మాట మేరకు ఆదివారం రోజున కూపన్లు కొనుగోలు చేసిన దాదాపు 300మంది సమక్షంలో డ్రా తీశాడు. చౌటుప్పల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో లక్కీ డ్రా నిర్వహించగా.. సంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లికి చెందిన చిన్నారి హన్సిక కూపన్ గెలుచుకుంది. చిన్నారి తండ్రి శంకర్‌కు రామబ్రహ్మం ఫోన్ చేసి సమాచారాన్ని అందించాడు. త్వరలోనే ఇంటిని రిజిస్ట్రేషన్ చేయిస్తానని తెలిపాడు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కుమార్తె పేరిట ఇల్లు దక్కటం అదృష్టంగా భావిస్తున్నానంటూ సంతోషం వ్యక్తం చేశాడు.

హైడ్రా కూల్చేసిన 24 గంటల్లోపే మళ్లీ ఫెన్సింగ్

- ఆరెకపూడి గాంధీ వ్యవహారంపై బీఆర్ఎస్ భగ్గు

కుత్బుల్లాపూర్/గాజులరామారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కుటుంబ సభ్యులు ఆక్రమించారంటూ హైడ్రా కూల్చివేసిన ఓ స్థలం ఫెన్సింగ్‌ను 24గంటలు గడవక ముందే పోలీసుల బందోబస్తుతో మళ్లీ ఏర్పాటు చేయడంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్వే నెంబర్ 307లోని 11ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆరెకపూడి గాంధీ కుటుంబ సభ్యులు ఆక్రమించి ఫెన్సింగ్ వేయగా ఇటీవల హైడ్రా అధికారులు కూల్చివేశారు. మళ్లీ ఫెన్సింగ్ వేసిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నేతలు ఆదివారం సందర్శించారు. సర్వే నెంబర్ 307లోనే 270మంది పేదల ఇండ్లను కూల్చి 15వేల కోట్ల విలువైన 300ఎకరాలను కాపాడామని ప్రకటించిన హైడ్రా, అదే ప్రాంతంలో ఆరెకపూడి గాంధీకి 11ఎకరాల స్థలాన్ని కట్టబెట్టిందని ఆరోపించారు. హైడ్రా బాధితులు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించాలని

1991లోనే ఆ భూమిని కొన్నాం: ఆరెకపూడి గాంధీ

గాజులరామారం సర్వే నెంబర్ 307లో ఉన్న 11ఎకరాల భూమిపై ఎటువంటి చర్చకైనా, విచారణకైనా తాను సిద్ధమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. "నా కుటుంబ సభ్యులు తొమ్మిది మంది కలిసి కొన్న భూమి. 1991లో పట్టా భూమిని కొనుగోలు చేసినట్టుగా స్పష్టంగా ఉంది. ఒక వ్యాపారవేత్తగా నేను 1991లో కొన్న భూమిని కాపాడుకోవడంలో తప్పేముంది. ఈ భూమి వివరాలను ఎమ్మెల్యే నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో కూడా చూపించాం" అని వివరించారు. దీనిపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. "2009లో నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇద్దరి ఆస్తులపైన సిట్టింగ్ జడ్జితో కానీ, ఈడీతో గానీ విచారణకు నేను సిద్ధం. మీరు సిద్ధమా" అంటూ కృష్ణారావుకు ఆయన సవాలు విసిరారు.

ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు

వేధింపులపై గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆందోళన

- షాద్‌నగర్‌లో ఆరు గంటల పాటు ధర్నా
- ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- పోలీసులు, విద్యార్థినుల మధ్య తోపులాట



షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నిత్యం తమను వేధిస్తున్న ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేయాలంటూ నాగర్‌కర్నూల్ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు కదం తొక్కారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రధాన కూడలిలో 400 మందికి పైగా విద్యార్థినులు సుమారు 6 గంటల పాటు ధర్నా చేశారు. కలెక్టర్ వచ్చి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడామని, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని షాద్‌నగర్ సీఐ విజయకుమార్ తెలిపినా వినలేదు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థినుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఓ విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. చివరికి పోలీసులు విద్యార్థినులను ఒప్పించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ అధికారి నిర్మల కళాశాలకు వచ్చి విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ వేధింపుల గురించి విద్యార్థినులు ఏకరువు పెట్టారు. గుడ్‌మార్నింగ్ చెప్పలేదని ఇంటర్నల్ పరీక్షలకు రానివ్వలేదన్నారు. ప్రిన్సిపాల్‌ను కూడా విచారించి సర్కారుకు నివేదిక అందజేస్తామని, వారంలో చర్యలు తీసుకుంటామని నిర్మల చెప్పారు.

విద్యార్థుల నుంచే ఫీజుల వసూలు

నాగర్‌కర్నూల్‌కు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాలను షాద్‌నగర్ శివారులోని ఖాళీగా ఉన్న నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా శైలజ పనిచేస్తున్నారు. ఆమె సూర్యాపేట గురుకుల డిగ్రీ కళాశాలలో పనిచేస్తుండగా పలు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈ కళాశాలకు బదిలీ చేశారు. ఆమె ఇక్కడా విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థినులు ఆరోపించారు. తమ పరీక్ష ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తున్నా ఫీజు చెల్లించాలంటూ 490 మంది విద్యార్థినుల నుంచి రూ.2,300 చొప్పున వసూలు చేశారని తెలిపారు. విద్యార్థినుల కార్పస్‌ఫండ్ కోసం ప్రతి నెలా రూ.50 వేలు జమ చేస్తుంటే ఆ డబ్బులను తమకు ఇవ్వడం లేదన్నారు. ఎవరైనా ఫైనలియర్ విద్యార్థిని వివాహం చేసుకుంటే ఆమె తల్లిదండ్రులు ఎంత కట్నం ఇస్తున్నారో.. అందులో సగం ఎంతైతే అంత తనకివ్వాలని వేధిస్తున్నారని తెలిపారు. కళాశాలకు 20 కేజీల మటన్ సరఫరా అవుతుంటే.. అందులో సగం ప్రిన్సిపాల్ నొక్కేస్తున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ శైలజకు ఇతర అధ్యాపకులు కూడా అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాగా, విద్యార్థినుల ధర్నాతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు 4 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

నాసిరకం విత్తనాలకు చెక్!

- విత్తన ముసాయిదా చట్టం-2025పై మంత్రి తుమ్మల సమీక్ష

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోతున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ విత్తన ముసాయిదా చట్టం-2025పై ముసాయిదా కమిటీ సభ్యులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. విత్తనోత్పత్తికే కాకుండా విత్తనం కొన్న ప్రతి రైతు పంట నష్టపోయిన సందర్భంలో న్యాయం జరిగేలా చట్టం ఉండాలన్నారు. నకిలీ కంపెనీల పట్ల కఠినంగా వ్యవహరించేలా చట్టం ఉండాలని తెలిపారు. కొత్త చట్టాన్ని ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలకు అనుబంధంగానే తీసుకువస్తున్నామని, న్యాయ సమీక్షలో నిలబడేలా రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టంలోని లోపాలను, రైతులకు జరుగుతున్న నష్టాలను కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

రాజధానిలో దంచి కొట్టిన వాన

- జలమయమైన రోడ్లు.. పలు చోట్ల ట్రాఫిక్ జామ్
- మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను మరోసారి భారీ వర్షం ఇబ్బందుల పాల్జేసింది. ఆదివారం సాయంత్రం సుమారు 20 నిమిషాల పాటు ఆగకుండా దంచికొట్టింది. ఉదయం నుంచి పొడి వాతావరణం ఉన్నప్పటికీ.. సాయంత్రం భారీ వర్షం కురిసింది. మొంథా తుఫాను ప్రభావంతో గత నెల 28న రాత్రి నుంచి 29వ తేదీ రాత్రి వరకు తెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో మరోసారి భారీ వర్షం అవస్థలు సృష్టించింది. ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్, పంజాగుట్ట, చిక్కడపల్లి, సికింద్రాబాద్, బేగంపేట్, మియాపూర్, లింగంపల్లి, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద ప్రవహించడంతోపాటు గుంతల్లో నీరు నిలిచిపోయింది. మాసబ్‌ట్యాంక్ బంజారాహిల్స్ మార్గంలో, జూబ్లీహిల్స్ నుంచి మాదాపూర్, హైటెక్‌సిటీ రోడ్డులో, మెహిదీపట్నం-అమీర్‌పేట్, ఉప్పల్-నాగోల్ మార్గాల్లో, మియాపూర్‌లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కేవలం ఇరవై నిమిషాల పాటు కురిసిన వర్షానికే అమీర్‌పేట్, బేగంపేట్, సికింద్రాబాద్‌లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. నగరంలో మరో రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై వర్షం కురుస్తున్న దృశ్యం

సాగర్ నాలుగు గేట్ల నుంచి నీటి విడుదల

నాగార్జునసాగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నాలుగు క్రస్ట్ గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 589.60గా నమోదైంది. సాగర్‌నుంచి మొత్తం 72,151 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి అంతే మొత్తంలో వరద వచ్చి చేరుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.